ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి



సజల శ్రద్ధ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః


సంకల్పం
సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 6**
**సంచిక 8**
**నవంబర్ 2005**
**పార్థివ కార్తీకం**
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**
కూర్పు
సుందర్ గ్రాఫిక్స్


## ధర్మయజ్ఞంద్వారా ధర్మోద్ధరణ

హిమాలయ హిమ శిఖరాలనుండి వస్తున్న పిలుపు మన హృదయాలను తాకుతూన్నది. దుర్గమ హిమాలయంలో మహాతపస్సు చేస్తూన్న మహాఋషులూ, మహాసిద్ధులూ ఇస్తూన్న పిలుపు అది. ఆ పిలుపులో మిళితమై ఉంది – వారి మనోవేదనలోనుండి, వారి తీవ్ర ఆవేదనలో నుండి, వారి సాంద్ర సంతాపం నుండి జనించిన ప్రశ్న – ధర్మాన్ని ఎవరు రక్షిస్తారు?

మన గుండెలలో సంవేదన ఉంటే, ఈ ప్రశ్నలోని వాడినీ వేడినీ మనం అనుభూతి చెందుతాం. మన ప్రాణానికి ఈ ఋషి – వేదన తప్పక తగులుతుంది.

ధర్మం ప్రవచనం కాదు. బుద్ధిపరమైన తర్కవిన్యాసం, మాటల గారడీకూడ ధర్మం కావు. ధర్మం తపస్సు. ధర్మం తితిక్ష. ధర్మం కష్ట సహిష్ణుత. ధర్మం పరదుఃఖ కాతరత – ఎదుటివ్యక్తి దుఃఖానికి చలించిపోవడం. ధర్మం నిజంకోసం, మంచికోసం జీవించే సాహసం, మరణించే సాహసం. ధర్మం కట్టుబాట్ల పరిరక్షణకై వెలువడే హుంకారం. ధర్మం సేవ యొక్క ఆర్ద్ర సంవేదన. ధర్మం పీడా నివారణకై ఆవిర్భవించే మహాసంకల్పం. ధర్మం పతన నివారణకు యుద్ధ భేరీ, దుష్ట ప్రవృత్తులపై, దుష్ట కృత్యాలపై, దురాచారాలపై జరిగే మహోద్యమానికి శంఖనాదం. ధర్మం సర్వహితం కోసం స్వహితం యొక్క త్యాగం.

అలాంటి ధర్మం తపోజ్వాలలనుండే ఉద్భవిస్తుంది. బలిదానంలో దాని మధుర నాదం వినిపిస్తుంది. మనందరి జీవితాలలో ఆ తపోజ్వాలలను రగిలించడానికే వచ్చింది ఈ ఋషుల పిలుపు. ఆ జ్వాలలను మరింతగా ప్రజ్వలింపజేయడానికే వచ్చింది ఈ పిలుపు. మనం ఋషి సంతానం అనే సందేశాన్నీ, దానితో ముడిపడిన కర్తవ్యాలను గుర్తు చేయడానికే వచ్చింది ఈ పిలుపు.

ఈ పిలుపులోని ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసినవాళ్లం మనమే. మన జీవితాలలో ధర్మానికి నిజమైన పరిభాషను నింపుకోవలసింది మనమే. మనం మన జీవితాన్ని ధర్మంయొక్క యజ్ఞ కుండంగా చేసినప్పుడు మాత్రమే, తపో జ్వాలలలో మన ప్రాణాలను నిరంతరం సమిధలుగా వేస్తూన్నప్పుడు మాత్రమే – ఈ పని జరుగుతుంది. ఈ ధర్మ యజ్ఞం ఫలితంగా ధర్మ సత్యం దశదిశలకూ విస్తరిస్తుంది.

H H H

**గాయత్రికి వేయి కళ్లు ఉన్నాయి. ఆమెనుండి ఏదీ దాగదు.**

# విషయ సూచిక

**ముఖచిత్రం : గురునానక్**


1. **సంపాదకీయం :**
   ధర్మయజ్ఞం ద్వారా ధర్మోద్ధరణ 1
2. **విషయ సూచిక** 2
3. **వేద మంత్రం** 3
4. **గురుదేవుల అమృతలేఖిని**
   యుగపరివర్తనకై మహాప్రజ్ఞ అవతరణ 4
5. **ధారావాహిక: యువతరానికి మేలుకొలుపు - 1**
   యువతరానికి భావదాస్యం నుండి విముక్తి 9
6. **ధారావాహిక: మనఃస్థితి మారితే మారుతుంది పరిస్థితి-1**
   యుగధర్మాన్ని పాటించడం అనివార్యం 13
7. **ముఖచిత్ర కథనం**
   గ్రుడ్డి నమ్మకాలను కూల్చివేసిన గురునానక్ 17
8. **యజ్ఞ విజ్ఞానం**
   బ్రాహ్మణత్వానికి జనని యజ్ఞం 23
9. **సాధన విజ్ఞానం**
   ఉపాసనకన్న జీవన సాధన మిన్న 24
10. **వ్యక్తి నిర్మాణం**
    నిరాడంబరతలో నిజమైన ప్రగతి 25
11. **భాగవత బోధ**
    మానవజన్మ లభించడం మహాభాగ్యం 27
12. **ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వ్యాసం**
    మూర్తీభవించిన విప్లవ చైతన్యం 30
13. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం - 6**
    మర్మస్థానములను సక్రియంచేసే ఆసనాలు 35
14. **దేవసంస్కృతి సౌరభం**
    రోజుల పేర్లలో వైదిక విజ్ఞానం 38
15. **ఆచరణలో అధ్యాత్మ**
    సిరిసంపదలనుకాక - సద్గుణాలను సంపాదించు 40
16. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 23**
    హిమాలయం నుండి ఆహ్వానం - 3 35
17. **నావారితో నామాట: మహోద్యమం విరాట్ యాత్ర-10**
    ఇతర సంస్థలతో సమన్విత కృషి 45
18. **విశ్వవిద్యాలయ విశేషాలు**
    యోగ చికిత్సకు విలక్షణ కేంద్రం 47
19. **వార్తలు :**
    చీరాలలో 24 లక్షల గాయత్రీ మంత్రజపం 48


## చందాదారులకు విజ్ఞప్తి

యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందాను

ఐష్త్రు జూ-ఈఊజుఖజు-ఊఊజు స్త్రజుఖజు-ఊశిష్త్రు -ఊశిష్త్రఏఐ-ఊఈ - ఔఏఐ।శ్రీజూఐఐ -ఈ॥ఐంశ్రీ, ఇఖ-ఈఊజూష్త్రజుఔజు-ఈ పేరుమీద బ్యాంకు డ్రాఫ్టు ద్వారాకాని, చెక్కుద్వారాకాని పంపగోరుతాము. మీరు పంపే మనియార్డరులో మీ పేరు, చిరునామా, పిన్‌కోడ్ వ్రాయగలరు.

**హైదరాబాదులోని యుగశక్తి గాయత్రీ కేంద్రం సెల్ నంబర్- 9392506888. క్రొత్త నెంబర్ - 040 - 30986922.**

పత్రికకు వార్తలు పంపే పరిజనులు దిగువ విషయాలను గమనించాలి -

1. పంపే ఫోటోల వెనుక వాటి వివరాలు తప్పనిసరిగా వ్రాయాలి. అలాంటి వివరాలు లేని ఫోటోలు ప్రచురణకాకుండా ఉండిపోతున్నాయి.
2. వార్తలు స్పష్టంగా వ్రాయాలి. ప్రతినెలా 5వ తేదీ వరకు అందిన వార్తలు, ఫోటోలు మాత్రమే తర్వాతి నెలలో ప్రచురణకు పరిశీలించబడతాయి.
3. కార్యక్రమం జరిగిన తర్వాత వీలైనంత త్వరగా ఆ వార్త పంపే ప్రయత్నం చేయాలి.

H H H

## నవంబరు డిసెంబరు నెలలలో పర్వదినాలు

**నవంబరు :**

1. దీపావళి.
10. ధన్వంతరి జయంతి.
14. బాలల దినోత్సవం.
15. గురునానక్ జయంతి.
16. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి.
30. జగదీష్‌చంద్ర బోస్ జయంతి.
    గురు తేగ్‌బహదూర్ బిదానం.

**డిసెంబరు :**

6. నాగపంచమి.
7. సుబ్రహ్మణ్య షష్ఠి.
10. దత్తాత్రేయ జయంతి.
11. గీతా జయంతి.
23. స్వామి శ్రద్ధానంద బలిదానం.
25. మదన్‌మోహన్ మాలవ్యా జయంతి
    క్రిస్మస్

**ఆత్మ పిలుపును పెడచెవిని పెట్టకు.**

# వేద మంత్రం

## అశాంతికి కారణం దురాలోచన

పరోపేహి మనస్పాప కిమశస్తాని శంససి ।

పరేహి న త్వా కామయే వృక్షాం

వనాని సంచర గృహేషు గోషు మే మనః ॥ –అధర్వవేదం 10/164/1

**భావార్థం** : ఏవైనా చెడ్డ ఆలోచనలలో దారితప్పిపోకుండా నీ మనస్సును ఎప్పుడూ ఏదో ఒక పనిలో నియమించు, దానిని ఊరికే వదలివేయవద్దు.

**సందేశం** : శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి ఉపదేశిస్తూ, ప్రపంచంలో కొంతమంది దైవీసంపద వారు, కొంతమంది ఆసురీ ప్రవృత్తి వారు ఉంటారని చెప్పిఉన్నారు. దైవీసంపదవారు శుద్ధ అంతఃకరణతో భయరహితులై, ధ్యానయోగులై, తత్త్వజ్ఞానం తెలిసినవారై ఉంటారు. వారు ఎల్లప్పుడూ సాత్త్విక కర్మలు చేస్తూ ఇంద్రియాలను అదుపు చేస్తూ, స్వాధ్యాయం చేస్తూ ఉంటారు. మధురంగా మాట్లాడుతూ, మనస్సు, శరీరం, వాక్కు దేనితోనూ ఇతరులకు కష్టం కలిగించనివారై ఉంటారు. అహంకారం దరిచేరకుండా, ప్రపంచంలో అన్ని పనులూ చేస్తూ అంటనట్లు ఉంటారు. మానవ జీవనోద్దేశ్యాన్ని పూర్తి చేస్తారు. ఆసురీ స్వభావం కలిగిన వ్యక్తుల గురించి చెప్పుకోవలసిన అవసరం లేదు. నలువైపులా వారు రకరకాల భ్రాంతులు, దారుణ దుఃఖాలు అనుభవిస్తూ కనిపిస్తారు.

దైవీ లేదా ఆసురీ అనేవి రెండు భావనల, ప్రవృత్తుల పేర్లు. ఈ అనిత్య ప్రపంచం యొక్క అనిత్య వస్తువులను నిత్యమని భావించి, వాటి గురించే చింతిస్తూ ఉండే వారిలో ఆసురీ ప్రవృత్తి ఉత్పన్నమవుతుంది. దైవీ లేదా ఆసురీ ప్రవృత్తులకు మూలకారణం అంతఃకరణయే. దీని ద్వారానే మనుష్యుడు వివశుడై, కోరుకోకుండానే ఆసురీ భావనల సుడిగుండంలో చిక్కుకుపోతాడు.

నేటి మనుష్యుడు శారీరకంగా ఆరోగ్యవంతుడిగా కనిపించినా, అతడి మనస్సు అశాంతితో ఉన్నది. దీనికి కారణం అతని మనస్సులో ఎల్లప్పుడు దురాలోచనల రాశి ప్రోగవుతూ ఉండడం. మానసిక కాలుష్యం ఎంతగా పెరిగిందంటే నిద్రిస్తున్నా, మేల్కొన్నా, లేచిఉన్నా–కూర్చున్నా, పగలు – రాత్రి కుత్సిత, అశ్లీల ఆలోచనలే మన మనస్సును చుట్టుముడుతున్నవి. ఈ దుఃఖప్రద స్థితినుండి మనలను రక్షించుకొనే ఏకైక ఉపాయం మనస్సును ఎల్లప్పుడూ శుద్ధము, పవిత్రము అయిన ఆలోచనలతో నింపడం. ఎప్పుడూ దానిని ఖాళీగా ఉంచకూడదు. 'ఖాలీ దిమాగ్ సైతాన్ కా ఘర్' అని అంటారు. పనిలేని మెదడు భూతాల మందిరం. అందువలన ఎప్పుడూ మన మనస్సు – మస్తిష్కాన్ని ఖాళీగా ఉంచకూడదు. ప్రతి క్షణం మనసుని ఏదోఒక సృజనాత్మక, లోకోపయోగకర కార్యంలో నియోగిస్తే దానిలో దురాలోచనలు ప్రవేశించలేవు.

మనస్సును ఈ విధంగా దురాలోచనల నుండి కాపాడుకొనే అభ్యాసం బాల్యం నుండే చేయవలసిన ఆవశ్యకత ఉన్నది. బాల్యంలోని కోమలమైన మనస్సుమీద పడిన ప్రభావం స్థిరంగా ఉంటుంది. అందువలన పిల్లలను ఎప్పుడూ శుభప్రద ఆలోచనలు లభించే వాతావరణంలోనే ఉంచాలి. కన్నులతో, చెవులతో ఎప్పుడూ మంచి విషయాలు చూచేటట్లు, వినేటట్లు చేయాలి. ఉత్తమమైన ఆలోచనలు నిండిన, జ్ఞానవర్ధక పుస్తకాలు చదవాలి. విదేశీ ప్రచార వ్యవస్థ ద్వారా మన ఉన్నత సంస్కృతిపైన ఏ గొడ్డలి వ్రేటు పడుతున్నదో దాని నుండి మనం మనలను, ప్రత్యేకంగా పిల్లలను రక్షించుకోవాలి. దైవీసంపద అభివృద్ధిలో నిరంతరం నిమగ్నమై ఉండాలి.

"నిమగ్నమై ఉండండి, సంతోషంగా ఉండండి, ఆరోగ్యంగా ఉండండి". మనుష్యుడు ఎల్లప్పుడూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉంటే ఆనందంగా ఉంటాడు, హుషారుగా ఉంటాడు. దానితో శారీరక, మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉంటుంది. ఆత్మబలం పెరుగుతుంది.

H H H

**యుగాన్ని మార్చాలంటే, మొట్టమొదట మనం మారాలి.**

## గురుదేవుల అమృతలేఖిని

# యుగపరివర్తనకై మహాప్రజ్ఞ అవతరణ

### ఉషోదయవేళ ఇది

యుగ-పరివర్తన నేటి సునిశ్చిత సత్యం. ఈ విశ్వ - ఉద్యానవనం వినాశనపు సుడిగుండంలోకి శరవేగంతో దూసుకుపోతోంది. నిరుపమానమైన తన ఈ కళాఖండం ఇలా నశించిపోవడం దాని సృష్టికర్తకు ఇష్టంలేదు. ఆ సృష్టికర్త వర్చస్సుకూ, వైభవానికీ ప్రతీక ఈ విశ్వం. తన నైపుణ్యమంతా వినియోగించి, ఎన్నెన్నో ఆశలతో ఆయన దీన్ని సృష్టించాడు. ఆ విశ్వం ఇప్పుడు సామూహిక ఆత్మహత్యకు సిద్ధపడుతోంది. బుద్ధి-వైభవం అనే భస్మాసురుడు సంస్కృతి అనే పార్వతిని ఎత్తుకుపోవడానికీ, శివుణ్ణి నాశనం చేయడానికీ తలపడుతున్నాడు.

ఈ స్థితిలో "యదా యదా హి ధర్మస్య..." (గీత - 4/7) అనే తాను అవతరిస్తాననే భగవానుని వాగ్దానం వట్టి వాగ్దానంగా మిగిలపోదు. సంతులనాన్ని నిలిపి ఉంచడానికి కట్టుబడిన నియతి తన సృష్టిచక్రాన్ని కొనసాగించవలసిందే. అదే ఇప్పుడు జరుగుతోంది. బ్రహ్మ ముహూర్తపు ఆగమనాన్ని మామూలు కళ్లు చూడలేకపోవచ్చు. అయినా - రాత్రి గడచింది. ఉషాదేవి చిరునవ్వుకు ఇక ఎక్కువ ఆలస్యం లేదు. భవిష్యత్తును దర్శించే సంవేదన శక్తి కలిగి ఉన్నవారికి ఇది కానవస్తోంది.

నవయుగ అవతరణ వివాదాస్పదంగా మిగిలిపోవడం లేదు. సునిశ్చిత వాస్తవంగా దానిని దాదాపు ప్రత్యక్షంగా అనుభూతి పొందవచ్చు. విధ్వంసక శక్తులతో తలపడడానికై సృజన శక్తి సాహసంతో లేచి నిలబడితే - ఎవరు గెలుస్తారో అందరికీ తెలుసు. సత్యం జయిస్తుంది. అసత్యం జయించదు. ఈ ఋషి వచనంలో సృష్టిలోని శాశ్వత పరంపర ఇమిడి ఉంది. వెలుగురేకలు విచ్చుకోనంతవరకే చీకటి తన ఏలుబడిని సాగించగలుగుతుంది. చీకటిని నిరాకరిస్తూ, వెలుగువైపు పయనించాలనే ఆతురతను వ్యక్తం చేస్తూ విశ్వ-చేతన పిలుపు ఇస్తున్నప్పుడు - నవప్రభాత అవతరణ తథ్యమే.

### భ్రష్టత్వానికి విరుగుడు గాయత్రి

యుగ-పరివర్తనలో వికృతుల వినాశనం, సత్ప్రవృత్తుల సంస్థాపన ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. అయితే, ప్రతిసారీ రోగాన్ని బట్టే చికిత్స జరుగుతుంది.

గతంలో జరిగిన సంఘటనలలో దుష్టత్వ విజృంభణయే విశ్వ వినాశనానికి దారి తీసింది. ఫలితంగా - దాన్ని నాశనం చేయడానికై పాలకుడైన భగవానుడు అవతారాలు ధరిస్తూ వచ్చాడు. వరాహం యొక్క దంతం, నరసింహుని గోళ్లు, పరశురాముని పరశువు, రాముని ధనుస్సు, కృష్ణుని చక్రం - ఇవన్నీ ఆ సందర్భంగా గుర్తుకు వస్తాయి.

అయితే ఈసారి విజృంభిస్తున్నది దుష్టత్వం కాదు - భ్రష్టత్వం. కనుక, బుద్ధుని సంప్రదాయమే సఫలతను చేకూర్చగలుగుతుంది. జ్ఞానగంగ స్వర్గనుండి ధరిత్రికి అవతరించడం ద్వారా, ఋతంభరా ప్రజ్ఞ అవతరించడం ద్వారా ఈ భ్రష్టత్వం నాశనం చేయబడుతుంది. యుగచండి యొక్క సాక్షాత్కారాన్ని మనమంతా ఈ రూపంలోనే చూస్తాం.

ఈ క్రియాశీలమైన దుష్టత్వం వ్రేళ్లు ఈ సారి మరింత లోతుగా ఉన్నాయి. అవి వికృతితో నిండిపోయాయి. మరింత ముందుకు పోయాయి. విశ్వాసాల రంగాన్ని ఆక్రమించుకున్నాయి. వాటి జటిలత భ్రష్టత్వం రూపంలో వ్యక్తం అయింది. వీటిని తొలగించడం మరింత కష్టం. కనుక, వైద్యం కూడ అంత తీక్షణంగా, అంత ఉచ్చ స్థాయిలో ఉంది.

**యుగ సంకల్ప సాధనకై మహాకాలుడు ప్రేరణ ఇచ్చిన యుగ ప్రవాహం 'ప్రజ్ఞా అభియాన్'.**

ఈసారి అవతరణ యుగశక్తి గాయత్రి రూపంలో. దుష్టత్వాన్ని జయించడానికి ఆయుధం చాలు. అయితే, భ్రష్టత్వం కంటికి కనపడదు. అది ఆకాంక్షలలోనికీ, విశ్వాసాలలోనికీ చొచ్చుకుపోతుంది. అంత లోతుకు దూకి, దాగికొన్న దొంగను కనుగొని వెలికితేవడం, అతడిని నాశనం చేయడం మరింత కష్టమైన పని. ఇంత విస్తృతమూ, జటిలమూ, కఠినమూ అయిన పనిని భగవతి ఆదిశక్తి గాయత్రి మాత్రమే చేయగలుగుతుంది. అజ్ఞానంవల్ల జనించిన అనాచారం ప్రజ్ఞయొక్క వెలుగుల వెల్లువద్వారా తప్ప మరోవిధంగా నాశనం కాదు. ఈసారి మహాపరివర్తన కోసమై బ్రహ్మీశక్తి స్వయంగా దిగిరావలసి వస్తోంది. అనుచరులవల్ల జరిగే పని కాదిది.

ప్రతి మహా కార్యానికీ శక్తి అవసరం అవుతుంది. శక్తిలేనిదే యంత్రం - చిన్నదైనా పెద్దదైనా - నడవదు. సమష్టి-వ్యవస్థ ముందుకు సాగాలన్నా, వ్యక్తి-వ్యవస్థ ముందుకుసాగాలన్నా - అది శక్తియొక్క మోతాదుపై ఆధారపడి ఉంటుంది. పరివర్తన కార్యాలలో మామూలుకన్న హెచ్చు పరిమాణంలో శక్తి అవసరం అవుతుంది. విధ్వంసానికీ, నిర్మాణానికీ కూడ అసాధారణమైన సాధనాలను సమీకరించవలసి ఉంటుంది.

ప్రపంచంలోని మహత్తర పరివర్తనలలోని సంఘటనల క్రమాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. వాటికోసం భారీ యెత్తున సాధన శక్తినీ, శ్రమ శక్తినీ, చింతననూ వినియోగించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ విప్లవాలను సఫలం చేయడం కోసమై ఆయా సమయాలలో అసామాన్యమైన సామర్థ్యాన్ని ఉపయోగిస్తూ వచ్చారు. వారు సాధనాలను సమీకరించకపోతే లక్ష్యం సాధించబడేది కాదు.

## జనమానసమే కురుక్షేత్రం

ఈ సారి యుగ-పరివర్తనకు రణరంగం, ఆ ధర్మక్షేత్రే కురుక్షేత్రే, జనమానసం. సంస్కరణకూ, పరివర్తనకూ అవసరమయే సరంజామానూ, పరికరాలనూ ఈ పరిధిలో సమీకరించవలసి ఉంది. సేనాధిపతుల శిబిరాలు ఈ భూమిమీదనే ఏర్పాటవుతున్నాయి. లక్ష్యం జనమానస సంస్కరణ. నేటి సమస్యలు అత్యంత జటిలమైనవి. కనుక, వాటి పరిష్కారం బాహ్య ఉపకరణాలద్వారా ఏవిధంగానూ సాధ్యమయ్యేది కాదు. ఆలోచనా ప్రవాహాన్ని వెనుత్రిప్పనిదే వినాశనమనే ఉపద్రవాన్ని వికాస అవకాశంగా మార్చలేము.

ఆలోచనా మార్గాన్ని సువ్యవస్థితంచేసే దివ్యప్రవాహం **యుగాంతర చేతన.** ఇదే యుగశక్తి గాయత్రి. యువ-పరివర్తన ఉద్యమ స్రోతస్సు, పుట్టిల్లు గాయత్రి. ఆ గాయత్రి కార్యకలాపాలను ప్రతి అవాంఛనీయతనూ ధ్వంసం చేయడంలో, సముచితములూ సృజనాత్మకములూ అయిన వాటిని ప్రోత్సహించడంలో మనం చూడవచ్చు. సమగ్ర పరివర్తనను బౌద్ధిక, నైతిక, సామాజిక విప్లవాలుగా మూడు భాగాలు చేశారు. ఇవి త్రిపదలోని మూడు ధారలు. వీటి సంగమం త్రివేణి.

త్రివేణీ సంగమంలో స్నానం చేస్తే - **కాకహోంహి పిక వకహు మరాలా** - అనగా కాకి కోకిల అవుతుందనీ, కొంగ హంస అవుతుందనీ చెప్పబడింది. జనమానస సంస్కరణ ఈ రూపంలో కానవస్తుంది. ఆకారం అలాగే ఉంటుంది. స్వభావం మారుతుంది. అంతరంగం మారితే, బాహ్య స్వరూపం మారడానికి సమయం పట్టదు. యుగశక్తి గాయత్రి అవతరణను, కార్యకలాపాలను ఈ దృష్టితో అవగాహన చేసుకోవాలి. యుగ-పరివర్తనలో ఈసారి వాటి పాత్ర సర్వాధికం అవుతుంది. జ్ఞానయజ్ఞం, భావ విప్లవ మహోద్యమాల రూపంలో ఆ ఆదిశక్తి అవతరణనే చూడవచ్చు.

## దేవమానవులను నిర్మించిన గాయత్రి

సామాన్యుల దృష్టిలో గాయత్రీ మంత్రం పూజ, ఉపాసనల కోసం హిందూ మతంలో ఉపయోగించబడే ఒక

**వానప్రస్థ సంస్కారం భారతీయ సంస్కృతిలో అంతర్భాగం.**

మంత్రం మాత్రమే. స్థూల దృష్టికి దాని ఆకారం, దాని పరిధి పరిమితాలుగా కనబడవచ్చు. కానీ, వాస్తవం ఇంతకన్నా విస్తృతమైనది.

గాయత్రీ మంత్రమే నిజమైన శక్తి స్రోతస్సు, శక్తి కేంద్రం. దాని ప్రత్యక్ష రూపాన్ని 24 అక్షరాల కూర్పులో **చూడవచ్చు. భారతీయ ధర్మానికి గాయత్రి ప్రాణం, ఉద్యమం, వెన్నెముక.**

శిఖ గాయత్రి. యజ్ఞోపవీతం గాయత్రి. గాయత్రి వేదమాత, దేవమాత, విశ్వమాత. బ్రహ్మవిద్య యొక్క తత్వం, బ్రహ్మవర్చస్సు యొక్క తప-విధానం ఈ ఉద్యమ కేంద్రంనుండి గంగోత్రి, యమునోత్రిలవలె వెలువడుతున్నాయి. భారత వర్షంయొక్క గౌరవమయ గతం దేవమానవుల చరిత్ర. ఆ దేవమానవులు తమ మాతృభూమిని **'స్వర్గాదపి గరీయసీ'**గా రూపొందించారు. సమస్త విశ్వాన్నీ సమృద్ధులతో, విభూతులతో సుసంపన్నం చేశారు. అలాంటి దేవ మానవుల అంతఃకరణాల అచ్చు గాయత్రీ తత్వం, గాయత్రీ తప-విధానమే అన్నది నిస్సంశయం.

## ప్రతి సమస్యకూ పరిష్కారం గాయత్రిలో

గాయత్రీ మహాశక్తియొక్క మొదటి అరుణోదయం భారత-భూమిలో జరిగింది. ఇందుకోసమై సహజంగా ఈ క్షేత్రంలోనే మొట్టమొదట అత్యధిక ప్రమాణంలో తన వర్చస్సును ప్రకటించడం ఆ మహాశక్తికి సునాయాసంగా సాధ్యపడింది. అయితే - అందువల్ల దాని పరిధి ఇంత స్వల్పమైనదని భావించకూడదు. సూర్యుడు తమ దేశంలో మొట్టమొదట ఉదయిస్తాడన్నది జపాన్ దేశీయుల నమ్మకం. తాము సూర్యపుత్రులమని వారు చెపుతారు. ఆ నమ్మకాన్ని కాదనవలసిన పని లేదు. అయితే - సూర్య భగవానుడు జపాన్ దేశానికే పరిమితం కాదని మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఆయన తన వెలుగును అన్ని ఖండాలకూ ప్రసాదిస్తున్నాడు. అందరికీ ప్రయోజనం కలిగిస్తున్నాడు. గాయత్రినికూడ ఈ విధంగా అర్థం చేసుకోవాలి.

దేవమాత గాయత్రి యొక్క తొలి రూపం. దాని విస్తృతిని వేదమాతగా, విశ్వమాతగా చూడవచ్చు. హిందూ మతస్థులలో అధికంగా ప్రచారంలో ఉండి, సంస్కృత పదాలతో కూర్చబడి, ఉపాసనలో వినియోగించబడుతూన్నప్పటికీ - దానిని ఆ పరిధికే పరిమితం చేయలేము. దాని కార్యక్షేత్రం, దాని వికాస విస్తరణ అత్యధికం. మనిషి ఎదుర్కొనే ప్రతి సమస్యకూ పరిష్కారం, అతడికి గల ప్రతి శుభ అవకాశానికీ సాధనం గాయత్రి. నవయుగ అవతరణలో గాయత్రీ మహాశక్తి పాత్ర ప్రధానమైనది.

విత్తనం చిన్నదిగా ఉంటుంది. దాని లోపల వృక్షంలోని ప్రత్యేకతలన్నీ సూక్ష్మ రూపంలో ఉంటాయి. పరమాణువు సూక్ష్మమైనదే. అయితే, దాని అంతరంగ సామర్థ్యాన్నీ, గతిశీలతనూ చూస్తే ఆశ్చర్యచకితులం కావలసివస్తుంది. శుక్రాణువులో కానవచ్చే గుణాలు ప్రత్యక్షంగా చాలా అల్పమైనవే. అయితే అందులో మనిషి అస్తిత్వం ఇమిడి ఉంటుంది. గాయత్రీ మంత్రం అలాంటిది. దాని ఆకారం చిన్నదిగానే కనబడుతుంది. దాని ఉపయోగం స్వల్పంగానే కనబడుతుంది. అయితే, దానిలో ఇమిడి ఉన్న భవిష్య అవకాశాలు అత్యంత విస్తృతం అయినవి. కొత్త ప్రపంచాన్ని నిర్మాణం చేసే సామర్థ్యం దానిలో ఇమిడి ఉంది.

బ్రహ్మచేతన మహాశక్తి అయిన గాయత్రికి రెండు రూపాలు ఉన్నాయి - మొదటిది జ్ఞానం, రెండవది విజ్ఞానం. జ్ఞాన భాగం ఉచ్చస్థాయి తత్వం. జ్ఞానం అనగా బ్రహ్మవిద్య. జ్ఞానం అనగా ఋతంభర. విశ్వాసాలనూ, ఆకాంక్షలనూ ఉన్నత స్థాయికి కొనిపోవడానికి అవసరమైన ప్రశిక్షణ ఇవ్వడానికి దానిని వినియోగించవచ్చు. జ్ఞానయజ్ఞం, భావ విప్లవం మున్నగు బౌద్ధిక ఉత్కృష్టతకు సాధనాలు ఈ ఆధారంమీదనే సమీకరించబడతాయి. స్వాధ్యాయం, సత్సంగం, చింతన,

**సదాశయాల సాధనకు మాత్రమే దానం ఇవ్వాలి.**

మననం మున్నగు కార్యకలాపాలు దీనికోసమే నడుస్తున్నాయి.

విజ్ఞాన భాగం ఉపాసన, సాధనలలో అనేక పద్ధతుల, సంప్రదాయాల రూపంలో వ్యాపించి ఉంది. ఏదో దేవతను ప్రార్థించి కొన్ని కోరికలను తీర్చుకోవడంకోసం కానుకలు ఇవ్వడంగా ఇది స్థూలదృష్టికి కనబడుతుంది. అయితే వాస్తవం అది కాదు. మానవీయ సత్తాయొక్క అంతరాళంలో మహత్తర సామర్థ్యాలూ, భవిష్య అవకాశాలూ నిద్రాణంగా పడి ఉన్నాయి. వాటిని బ్రహ్మచేతన యొక్క నకళ్లుగా, ట్రూ కాపీలుగా వర్ణించవచ్చు. అంతరాళంయొక్క నిద్రాణ స్థితియే దారిద్ర్యం. దాని జాగరణలో సంపన్నత అనే మహాసాగరం పొంగిపొరలుతూ కానవస్తుంది. దానిని మేలుకొలిపే, సాధనచేసే, సద్వినియోగపరచే సామర్థ్యం కలిగిన వ్యక్తి మహామానవుడు అవుతాడు. ఆ మహామానవులు చరిత్రాత్మక పాత్రను నిర్వహించారు. వారు తాము ధన్యులు అయినారు. తమ సంపర్క క్షేత్రంలోని జన సముదాయాన్నీ, వాతావరణాన్నీ ధన్యం చేశారు.

## భౌతిక ప్రగతికి ఆధారం

మనిషి 5 1/2 అడుగుల పొడవు, 1 1/2 మణుగుల బరువు కలిగిన శరీరంగా కనిపిస్తాడు. అయితే అతడి మూల సత్తా చేతన యొక్క గహ్వరంలో, అంతఃకరణలో దాగి ఉంది. అక్కడ ఏ వాతావరణం ఉంటే ఆ వాతావరణంలో చేతన పనిచేయవలసి ఉంటుంది. ఫలితంగా దాని స్వరూపంకూడ ఆవిధంగా రూపొందుతుంది. మిడత పచ్చగడ్డిలో ఉన్నప్పుడు ఆకుపచ్చగా ఉంటుంది; ఎండు గడ్డిలో ఉన్నప్పుడు పసుపుపచ్చగా మారుతుంది. అంతఃకరణ స్థాయికూడ చేతనయొక్క ఉత్కృష్టత, నికృష్టతలకు బాధ్యురాలుగా ఉంటుంది. ఈ అంతరంగపు మర్మస్థలాన్ని భౌతిక ఉపకరణాలు తాకజాలవు. సచేతనమైన ఉపకరణములే అంత లోతుకు వెళతాయి. గాయత్రీ మహామంత్ర సాధన-ఉపాసనల ప్రయోజనం ఇదే. ఈ ఉపాయాన్నే, ఈ చికిత్సనే గాయత్రీ మహావిజ్ఞానం అని పిలుస్తారు. నిద్రాణమై ఉన్నదానిని మేలుకొలపడం దాని లక్ష్యం. మనిషి గొప్పతనం ఇంద్రియాలకు అతీతమైనది. దానిని సంస్కరించడం, వెలికితీయడం, ఉన్నతం చేయడం అనే ప్రక్రియ పేరు గాయత్రీ ఉపాసన. దీని విజ్ఞాన భాగం ఆసరాతో భౌతిక ప్రగతికి అనేక ఆధారాలు నిర్మాణం అవుతాయి.

## సరస్వతి, దుర్గ, గాయత్రి

అధర్మం తరఫున జరిగే కార్యకలాపాలను అదుపు చేయడానికీ, ధర్మరక్షణను సమర్థించి పునరుద్ధరించడానికీ వివిధ సమయాలలో భగవానుడు అవతారాలను ధరిస్తూ వచ్చాడు. అసంతులనాన్ని సంతులనంగా మార్చడమే అవతార ప్రయోజనం. ఇందుకోసమై సమకాలీనమైన పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు ఇవ్వబడతాయి. అవే అవతారాల లీలలు. ప్రతి అవతారం యొక్క లక్ష్యం ఒక్కటే – సమష్టిలో ఉన్న వికృత మనఃస్థితినీ, విపత్కర పరిస్థితినీ నిర్మూలించడం. ఇందుకోసమై అవినీతి వ్యతిరేకములూ, నీతి సమర్థకములూ అయిన కార్యకలాపాలను యోజన చేయడమే అవతారాల ఒకేఒక కార్యక్రమంగా ఉంటుంది.

ఈ కార్యక్రమ స్వరూపం సమకాలీన సమస్యల స్వరూపాన్నిబట్టి నిర్ణయించబడుతుంది. అవతార లక్ష్యం ఒక్కటే అయినా, వివిధ అవతారాల కార్యకలాపాలు వేర్వేరుగా ఉండడానికి కారణం ఇదే.

బౌద్ధికతను పరిపుష్టం చేయడం కోసం, శిక్షణ కోసం అవసరమైన సాధనాలనూ, ఉత్సాహాన్నీ వెంటతీసుకుని భగవతి సరస్వతి అవతారం దిగివచ్చింది.

సామూహికతకూ, సహకార భావనకూ, అవినీతిని వ్యతిరేకించే సంఘర్షణశీలతకూ ప్రాతినిధ్యం వహిస్తూ భగవతి దుర్గ భువికి దిగివచ్చింది.

**గాయత్రి కామధేనువు.**

సరస్వతి యొక్క బౌద్ధికతనూ, దుర్గయొక్క సామాజికతనూ విప్లవ చేతనగా చెప్పవచ్చు.

మూడవ శక్తి గాయత్రి. అంతఃక్షేత్రపు ఆధ్యాత్మికత, బాహ్యక్షేత్రపు నైతికత – ఇదే గాయత్రి. గాయత్రి అవతరణతో పాటుగా నీతి, ధర్మం, అధ్యాత్మ అవతరించాయి. వేదంద్వారా తత్వజ్ఞానం, అనుశాసనం, నీతి నిర్ధారణల వ్యవస్థ నడిచింది.

లక్ష్మి చేతనా విభాగంలోనికి రాదు. అది భౌతికతకూ, కళకూ ప్రతీక. అవతరణ సందర్భంగా దాని పేరు, దాని లీలలు ప్రస్తావన రావు.

మనయుగంలోని వికృతులన్నీ ఇతర యుగాల వికృతులకన్న లోతైనవి. అవి మనిషి అంతరాళంలో విశ్వాసరాహిత్యం రూపంలో వేరూని ఉన్నాయి. అవి చింతననూ, కర్తృత్వాన్నీ భ్రష్టం చేసివేశాయి. జనమానస సంస్కరణయే ప్రస్తుత విశ్వాసరాహిత్య సంక్షోభ నిర్మూలనకూ, అన్ని సమస్యల పరిష్కారానికి ఒకేఒక ఉపాయం. ఉజ్వల భవిష్య ఆధారాలకు కేంద్ర బిందువు ఈ జనమానస సంస్కరణయే. సంస్కరణ, ఉద్ధరణలకు సంబంధించిన ఇతర చికిత్సలు ఈ కేంద్ర బిందువుచుట్టూ పరిభ్రమిస్తాయి. విశ్వాసరాహిత్య నిర్మూలన, విశ్వాసాలను నాటడం అనే లక్ష్యాన్ని సాధించడంలో నేటి యుగ విప్లవం నిమగ్నమై ఉంది. బ్రహ్మచేతన అవతరణయొక్క ఈ స్వరూపం మన యుగంలో వ్యక్తం అవుతోంది.

అవతారాలపై జరిగే చర్చలో నాయకత్వం వహించే వ్యక్తులకు ప్రాధాన్యం లభిస్తూ వచ్చింది. ఇది చర్మ చక్షువులు (మామూలు కళ్లు) చేసిన స్థూల మూల్యాంకన, స్థూల నిర్ణయం. వాస్తవానికి – యుగ–పరివర్తన సూక్ష్మ జగత్తులో ఎగసిపడే తుపానువంటి చేతనా ప్రవాహంగా దివ్యలోకంలో ఉదయిస్తుంది, ఉప్పొంగుతుంది. ఆ చేతనా ప్రవాహంవల్ల ప్రభావితులై లెక్కకుమిక్కిలి అయిన జాగృత ఆత్మలు బుజం బుజం కలిపి తమతమ ధోరణులలో బాధ్యతలను నిర్వహిస్తారు. ప్రతి అవతారం యొక్క తాత్విక స్వరూపం ఇదే.

కెమెరాలో మొదటి వరుసలో నిలబడిన వ్యక్తి ఫొటో మరింత స్పష్టంగా కనబడుతుంది. అయినా – గొప్పతనం, అస్తిత్వం ఆ గ్రూపులోని సభ్యులందరికీ చెందుతాయి. అవతారాలుగా ప్రఖ్యాతి పొందిన వ్యక్తులు మొదటి వరుసలో నిలబడి, విశిష్ట నాయకత్వం వహించి, ఆ కీర్తిని పొందినవారు. తాత్వికంగా పరిశీలిస్తే – అవతారం సూక్ష్మ జగత్తులో సంచలనాన్ని సృష్టించే యుగ చేతనయే.

## వేదమాత, దేవమాత, విశ్వమాత

'యుగశక్తి గాయత్రి' యొక్క అవతరణ – పరంపరలో మొట్టమొదట వేదమాత స్వరూపం బ్రహ్మదేవునిద్వారా వ్యక్తమయింది. భావనతోపాటు అవతారం ఏడు వ్యాహృతులుగా వ్యక్తమయింది. అది సప్తఋషులుగా ప్రఖ్యాతిపొందింది.

యుగ–పరివర్తన చక్రం, యుగ–పరివర్తన అవతారం మొట్టమొదటిసారి విశ్వామిత్రుని రూపంలో దిగివచ్చింది. ప్రస్తుత గాయత్రీ మంత్ర వినియోగ–ప్రకటనలో – గాయత్రీ ఛందం, సవితా దేవత, విశ్వామిత్ర ఋషి అని పేర్కొనబడి ఉంది.

ఇంతవరకు జరిగిన యుగంలో విశ్వామిత్రుడే తొమ్మిదవ అవతారం.

ఈవిధంగా – బ్రహ్మదేవుని ద్వారా వేదమాత, సప్తఋషులద్వారా దేవమాత, విశ్వామిత్రునిద్వారా విశ్వమాత అవతరించాయి. తొమ్మిది అవతరణలు పూర్తయినాయి.

పదవ అవతారం, మన సమయపు అవతారం యుగశక్తి గాయత్రి. అంధకార యుగం సమాప్తం కావడం, ఉజ్వల భవిష్యత్తు ఆరంభం – ఈ దృశ్యాన్ని మనమందరం ఈ చర్మ చక్షువులతో ప్రత్యక్షంగా చూస్తున్నాం.

H H H

**సద్బుద్ధి ఉపాసనకు మంత్రం గాయత్రి.**

## ధారావాహిక : యువతరానికి మేలుకొలుపు-1

# యువతరానికి భావదాస్యం నుండి విముక్తి

*శాంతికుంజ్‌లో ఈ సంవత్సరం ప్రచురితమై విడుదల అయిన గ్రంథాలలో "వర్తమాన చునౌతియా - ఔర్ యువావర్గ" ఒకటి. గ్రంథాన్ని రచించినవారు "బ్రహ్మవర్చస్". యువతరాన్ని మేలుకొలిపే ఉత్తమ గ్రంథం అది. "యువతరానికి భావదాస్యం నుండి విముక్తి", "కర్మఫల వ్యవస్థ తిరుగులేనిది", "సమగ్ర జీవన దర్శనం - చతుర్విధ పురుషార్థం", సాధన, సంయమనం, స్వాధ్యాయం, సేవ", "విశ్వ విప్లవాలలో యువశక్తి విశిష్ట భూమిక", "యువతరాన్ని పిలుస్తోంది భరతమాత" అనే ఆరు భాగాలుగా ఆ గ్రంథాన్ని "యువతరానికి మేలుకొలుపు" అనే శీర్షికతో ధారావాహికగా ప్రచురిస్తున్నాం. అనువాదం : కందర్ప రామచంద్రరావు.*

### మన యువతరానికి....

*మన యువతరంలో ప్రతిభకూ, సామర్థ్యానికీ ఎన్నడూ ఎలాంటి కొరతా లేదు. నేడు సైతం వారికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. వారికి అసాధ్యమన్నది ఏదీ లేదు. వారు రకరకాల వికట పరిస్థితులనూ, విపరీత పరిస్థితులను ఎదుర్కొనవలసివస్తూ ఉండడమే నేటి సమస్య. సమాజంలోని నీచ ప్రవృత్తి గల వ్యక్తులు వారిని క్రిందికి దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారు. మానవ జీవన లక్ష్యాన్ని గుర్తించగలిగితే, కార్యశూరత చూపితే - వారీ చీకటి గదినుండి బయటపడ గలుగుతారు.*

*ఈ గ్రంథం యువతరానికి ఈ సందేశాన్ని అందిస్తోంది. కొద్దిగా విజ్ఞత చూపితే వారు తమ జీవితాలను సాఫల్యపు బంగారు వెలుగుతో నింపుకోగలుగుతారు. ఈ వెలుగును యువతరంలోని ఇతరులు పలువురికి విరజిమ్మగలుగుతారు.*

### మరుగుపడిన మంచితనం

పరివర్తన చక్రం శరవేగంతో తిరుగుతోంది. సామాజిక పరిస్థితి క్షణ క్షణం మారిపోతోంది. ఫలితంగా మనిషి విచిత్రమైన ఒక సుడిగాలిలో చిక్కుకుపోయాడు. బయట నలువైపులా భౌతిక ప్రగతి, ఆర్థిక ప్రగతి, కానవస్తోంది. సుఖ సౌకర్యాలకు సాధనాలు కోకొల్లలు. రోజుకో వైజ్ఞానిక ఆవిష్కరణ జరుగుతోంది.

అయినా - మనిషి లోలోపల ముక్కచెక్కలు అయిపోతున్నాడు. చెల్లాచెదరు అయిపోతున్నాడు. ప్రపంచం పట్ల విశ్వాసం, సమాజం పట్ల సద్భావన, జీవితం పట్ల ఉల్లాసం క్రమక్రమంగా అతడిలో అంతరించిపోతున్నాయి. నేడు సమాజంలో నలువైపులా పరస్పర సౌహార్దం, సమరసత, సాత్వికతల స్థానంలో కుటిలత్వం, దుష్టత్వం, స్వార్థపరత్వం తిష్ట వేశాయి. దుర్మార్గ సామ్రాజ్యంలో మంచితనం అరుదైపోతోంది.

మన భారతవర్షం ఒకప్పుడు జగద్గురువుగా వెలుగొందింది. కానీ నేడు ఇక్కడ జాతీయ, సామాజిక, కౌటుంబిక, వ్యక్తిగత రంగాలలో అరాచకత్వం, విచ్చలవిడితనం రాజ్యమేలుతున్నాయి. జీవన విలువలపై, ఆదర్శాలపై విశ్వాసం గురించి ఆలోచనయే కరవైపోయింది. ఆలోచనా శూన్యత, దుష్ట ప్రవృత్తుల విషవలయంలో చిక్కుకుని దిశను కోల్పోయిన మనిషి పతనమనే కూపంలోకి జారిపోతున్నాడు. అతడిని సంస్కరించేవారూ, అతడికి దారి చూపేవారూ కానరావడంలేదు. బహుకొద్ది ధార్మిక ఆధ్యాత్మిక సంస్థలు, సామాజిక సంస్థలు మాత్రమే ఈ దిశలో క్రియాశీలంగా ఉన్నాయి. అనేక సంస్థలు స్వార్థంతో, వ్యాపార దృక్పథంలో పని చేస్తున్నాయి. నిజాయితీతో, నిరంతర క్రియాశీలతతో, సత్యనిష్ఠతో, నిస్వార్థభావంతో, స్వచ్ఛందంగా ప్రజాశ్రేయస్సు కోసం పని చేసే వ్యక్తులను వెర్రిబాగులవాళ్లుగా

**గాయత్రీ మంత్రంలో ఇమిడి ఉన్న శక్తిపుంజం మరే వేదమంత్రంలోనూ లేదు.**

పరిగణించడం కనిపిస్తోంది. వారి శ్రమనూ, అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునే కాంట్రాక్టర్లు సర్వత్రా ప్రత్యక్షం అవుతున్నారు.

## అహంకార, స్వార్థముల సామ్రాజ్యం

సమాజ సేవారంగంలో కాని, మత - ఆధ్యాత్మిక రంగంలో కాని, రాజకీయరంగంలో కాని, నలువైపులా అవకాశవాదం, అధికార వ్యామోహం, ఆసురీ తత్వం కలిగిన వ్యక్తులు కానవస్తున్నారు. విద్యా, వైద్య రంగాలలో ఒకప్పుడు ఆదర్శవంతమైన సేవాభావం తొణికిసలాడేది. నేడా రంగాలు వ్యాపార పోటీకి కేంద్రాలుగా తయారైనాయి. ఇక వ్యాపార రంగంలో నల్లబజారు, మోసం, కల్తీ, పన్నుల ఎగవేత విజయానికి కీలకాలుగా పరిగణించబడుతున్నాయి. త్యాగం, బలిదానం, శిష్టత, శాలీలత, ఔదార్యం, నిజాయితీ, శ్రమశీలత వంటి గుణాలు నవ్వులపాలు అవుతున్నాయి. మామూలు పౌరుని నుండి ప్రభుత్వంలోని శిఖరాగ్రం వరకు హెచ్చుమంది అవినీతిలో, అనాచారంలో పీకలవరకు మునిగిఉన్నారు. స్వార్థం, అసూయ, ద్వేషం, శతృత్వం ప్రతి వ్యక్తి మనసులో గూడుకట్టుకుని ఉన్నాయి.

ఇలాంటి వికృత మనస్తత్వం కారణంగా - మనిషి వైజ్ఞానిక ప్రగతి అందించిన సౌకర్యాలనూ, సాధనాలనూ దుర్వినియోగపరుస్తున్నాడు. ఫలితంగా అతడి శరీరం లోలోపల డొల్ల అయిపోయి, ఎన్నెన్నో రోగాలకు స్థిర నివాసం అవుతోంది. మనిషి వాంఛలకూ, ఇచ్ఛలకూ పరిమితి ఉండడం లేదు. ధైర్య, సంయమనాల పరిధులు పటాపంచలు అవుతున్నాయి. అహంకారం, స్వార్థముల నిషా తలకెక్కుతోంది.

ఇలాంటి స్థితిలో - సామాజిక సమరసత, సహకారం జీవించగలుగుతాయా? సుఖశాంతులు, ఆనందం అందుతాయా? ధనబలం, కండబలం విలయతాండవం చేస్తూన్న సమాజంలో, కుంభకోణాల మీద కుంభకోణాలు సాగుతూన్న సమాజంలో నిజమైన ప్రగతి సాధ్యపడుతుందా?

## డబ్బుపిచ్చిలో పడిన మనిషి

మనిషి ఇలా పతనం కావడానికి మూలకారణం డబ్బు. ప్రపంచమంతటినీ డబ్బు రాజ్యమేలుతోంది. డబ్బు సంపాదించాలనే రంధి ప్రతి మనిషినీ పట్టుకుంది. ఇందుకోసం మనిషి అవినీతికీ, అనాచారానికీ పాల్పడుతున్నాడు. బహిరంగంగా ఇలా సంపాదించిన డబ్బు కారణంగానే - విలువలు లేని భోగవాద సంస్కృతిని గ్రుడ్డిగా అనుకరించడం, అడ్డు అదుపూ లేని భోగవిలాసాల సభ్యత సమాజంలో సర్వత్రా గోచరిస్తున్నాయి. ఇదంతా తెలిసినా కూడా మనిషి డబ్బు పిచ్చి నుండి బయటపడలేకపోతున్నాడు.

## యువతరంపై పాశ్చాత్య అపసంస్కృతి దాడి

నేటి యువతరం ఇలాంటి కలుషిత వాతావరణంలో జన్మిస్తోంది. ఇలాంటి దుఃఖమయ పరిస్థితుల మధ్య పెరిగి పెద్దదవుతోంది. ఆదర్శాలు లేని సమాజం నుండి వారికి తగు మార్గదర్శనం లభించడం లేదు. దారీ తెన్నూ లేని విద్యా విధానం వారిని మరిన్ని భ్రమలలో ముంచివేస్తోంది.

దిగ్భ్రమలో, ఆలోచనా శూన్యతలో మునిగిఉన్న ఈ యువతరంపై పాశ్చాత్య అపసంస్కృతి సునాయాసంగా దాడి చేస్తోంది. భోగవాదంతో నిండిన ఆధునికత వరదలో కొట్టుకుపోతున్నది యువతరం. ఒకప్పుడు యువతరాన్ని నిర్మాణం చేసిన విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు అరాచకత్వానికీ, విచ్ఛలవిడితనానికీ కేంద్రబిందువులు అయినాయి. వాటిలో విలువల పట్ల, ఆదర్శాల పట్ల నిష్ఠ కానరావడం లేదు. అంతటా వ్యతిరేకాత్మక, విధ్వంసక కార్యకలాపాలు సాగుతున్నాయి. నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టాలనే తపన కలిగిన అధ్యాపకులూ, విద్యార్థులూ అరుదుగా కనిపిస్తున్నారు. ఫలితంగా జాతీయంగా, సామాజికంగా మన భవిష్యత్తు చిమ్మచీకటి అయిపోతోంది.

## సర్వత్రా దోపిడీ

ఎలాంటి విత్తనం నాటితే అలాంటి మొక్క మొలుస్తుంది; అలాంటి చెట్టు పెరుగుతుంది. పుష్పిస్తుంది, పల్లవిస్తుంది, ఫలిస్తుంది. యువతరం దురవస్థకు మొట్టమొదటి బాధ్యత వారి తల్లితండ్రులది, కుటుంబానిది. వారు స్వయంగా దుష్ట ప్రవృత్తుల వలలో చిక్కుకున్నారు. మరి వారు తమ సంతానానికి తగిన శిక్షణనూ, సంస్కారాలనూ ఎలా ఇవ్వగలుగుతారు? యువదశ

**సత్కర్మ చేస్తూన్న క్షణాలే జీవితంలోని కాంతిపుంజాలు.**

ప్రారంభంలో శారీరకమూ, మానసికమూ అయిన అనేక మార్పులు వస్తాయి. జీవితంలోని ఈ దశ తీవ్ర సంచలనాలతో కూడినది. అతడు తన చుట్టూ ఉన్న పరిస్థితులను తన మనస్తత్వానికి అనుగుణంగా వివేచన చేస్తాడు. ఈ వివేచనలో ఎన్నో ప్రమాణాలు ధ్వంసం అవుతాయి. క్రొత్త ప్రమాణాలు ఏర్పడతాయి. ఈ దశలో వ్యక్తి తన అస్తిత్వాన్ని కుటుంబంలో, సమాజంలో స్థాపించడానికి ప్రయత్నిస్తాడు. తన అస్మితను అన్వేషిస్తాడు. తాను ఎవరో, తన వ్యక్తిత్వం ఏమిటో వెదకడానికి చొరవ చూపుతాడు. ఒక ఆదర్శ నాయకుని కోసం అన్వేషిస్తాడు. అతడి నమూనాలో తనను తాను మలచుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ అన్వేషణ యాత్రలో అతడికి కుటుంబంనుండి ప్రత్యేకమైనది ఏదీ లభించడంలేదు. బయట అతడికి అంతటా దోపిడీయే దర్శనం ఇస్తోంది.

ఒకప్పుడు అభిమన్యునికి తల్లి గర్భంలో ఉన్నప్పుడే తల్లి దండ్రుల నుండి శిక్షణ, సంస్కారాలు లభించాయి. మన అభిమన్యులను ఎలా తయారు చేస్తున్నాం – అని నేటి తల్లితండ్రుదులు, నాయకులు ఆత్మపరీక్ష చేసుకోవాలి.

## దేవసంస్కృతి పట్ల ఉపేక్ష

గతంలో యువతరం తమ ఆదర్శాలను అన్వేషించడం కోసం కుటుంబాన్ని, సమాజాన్నే కాక ఆదర్శ గ్రంథాలను ఆశ్రయించేవారు. భారతీయ సంస్కృతి వారసత్వమంతా ఆ గ్రంథాలలో ఉంది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మున్నగు గ్రంథాలను చదవడం, వాటిని గురించి చర్చించడం సంగతి అలా ఉంచి – వాటి పేర్లు ప్రస్తావించడమే వెనుకబడినతనానికి గుర్తుగా నేడు పరిగణిస్తున్నారు. ప్రేరణదాయకమైన ఆదర్శ సాహిత్యం పట్ల అభిరుచి బాగా క్షీణించింది. అశ్లీల సాహిత్యం, నిస్సారమైన సాహిత్యం తామరతంపరగా విస్తరిస్తోంది. ఉదాత్త సాహిత్యాన్ని చదివే సంప్రదాయం నశించిపోతోంది. ఏమి చదవాలి, ఎలా చదవాలి అనేది యువతరానికి అర్థం కావడంలేదు.

దేవసంస్కృతిని ఇలా ఉపేక్షించడం వల్ల కలిగిన ఫలితం మన కళ్లముందున్నది. యువతరం వీరులను, మహాపురుషులను తమ ఆదర్శాలుగా స్వీకరించడంలేదు. టి.విల, సినిమాల తెరలమీద ఆ ఆదర్శాలను అన్వేషిస్తున్నారు. అక్కడ వారికి హింస, అశ్లీలత, ఫ్యాషన్లపై మోజు, విచ్చలవిడితనం వంటివి తప్ప మరేమి లభిస్తాయి? వీటిని అనుసరించడమే ప్రగతిశీలతగా వారు భావిస్తున్నారు.

ఈ కారణంగానే నలువైపులా క్రమశిక్షణారాహిత్యం పెచ్చుపెరిగిపోతోంది. స్థాయిలేని ఆదర్శాలకు పట్టం కట్టుతున్నారు. మరోప్రక్క మన టి.వి ఛానళ్లలో మన సంస్కృతిని వక్రించి చూపుతున్నారు. ఫలితంగా ఆహార విహారాలలో, వేష భాషలలో, ఆచార వ్యవహారాలలో యువతరం పాశ్చాత్య అపసంస్కృతిని గ్రుడ్డిగా అనుకరిస్తున్నారు. మహోజ్వలమైన మన సాంస్కృతిక వారసత్వాన్ని అవహేళన చేస్తున్నారు. ప్రగతిశీలత పేరిట నైతికతకు నీళ్లు వదులుతున్నారు. భారతీయతను వ్యతిరేకిస్తున్నారు.

## పార్టీల పావులుగా యువతరం

రాజకీయవాదుల ఎత్తుగడలు యువతను మరింతగా దిగజార్చుతున్నారు. విద్యాలయాలు రాజకీయ పోటీలకు తాలింఖానాలుగా తయారైనాయి. రాజకీయవాదులు యువతను తమ పోటీలకు ముడిసరుకుగా వాడుకుంటున్నారు. బహిరంగంగా ఈ వ్యవహారంలో మద్యాన్నీ, మగువలనూ వాడడానికి సైతం రాజకీయ పార్టీలు వెనుకాడడంలేదు. ఇక నల్లధనపు సంచులు విప్పడం సరేసరి.

ఇలాంటి కలుషిత వాతావరణంలో యువత దుష్ట సంస్కృతి ప్రభావానికి గురి అవుతున్నారు. లైంగిక విశృంఖలత ఫ్యాషన్‌కూ, ఆధునికతకూ చిహ్నం అవుతోంది. ఇలా యువతీ యువకులు ఆత్మ వినాశకర ధోరణిలో చిక్కుకుంటున్నారు. వారి శక్తి సామర్థ్యాలు, వారి ప్రతిభ సత్కార్యాలలో వినియోగం కావడం లేదు. సౌందర్య పోటీలలో, ఫ్యాషన్ షోలలో, సినిమాలలో వృధా అవుతున్నాయి. నేరస్థుల, దుష్టుల వలలో వారు చిక్కుకునే అవకాశాలు పెరుగుతున్నాయి. ఉదాత్తమైన ఆదర్శాలు, ప్రేరణ కేంద్రాలు లోపించడంతో – వారు క్రొత్తక్రొత్త విషవలయాలలో చిక్కుకుంటున్నారు. సామాజిక, జాతీయ కర్తవ్యాల అవగాహనకు దూరమైన యువత జీవితం స్వార్థానికీ, సంకుచితత్వానికీ పరిమితం అయిపోతోంది.

**ప్రతిరోజూ ఒక జీవితం. క్షణమైనా వృధా చేయకు.**

## కారుచీకటిలో కాంతి కిరణాలు

కారు చీకటితో నిండిన ఇలాంటి వాతావరణంలో కూడ ఆశాకిరణాలు కానవస్తున్నాయి. నిరాశాజనకమైన ఈ పరిస్థితులలో యువత శక్తి సామర్థ్యాలు పెడదారులు పడుతున్నాయే గాని నశించిపోలేదు. వాటికి సరైన దారి చూపడానికి ఎన్నెన్నో సాధనాలు ఉన్నాయి. సాంస్కృతిక దాస్యపు, భావదాస్యపు అదృశ్య శృంఖలాల నుండి తమను తాము విముక్తి చేసుకుని, విశ్వ విప్లవానికి అగ్రేసరులుగా నిలిచే సామర్థ్యం వారిలో దాగి ఉంది. యువశక్తియే జాతికి ఆశా కేంద్రం. దేశాన్ని దుర్గతినుండి ప్రగతి పథంలోనికి మళ్లించే శక్తి యువత నరనరాల్లో నిండి ఉంది. శూన్యం నుండి శిఖరానికి చేరే కార్యశూరత వారిలో అంతర్గతంగా ఉంది.

ప్రపంచంలో చెడు చాలా ఉంది. అబద్ధం, మోసం, అవినీతి వ్యాపించి ఉన్నాయి. అయితే, వీటిని గురించి చర్చించి ప్రయోజనం ఏముంది? ప్రపంచంలో అసుర ప్రవృత్తి కలిగిన జనం ఎపుడూ ఉన్నారు. రామాయణ, మహాభారత కాలంలోనూ, నేడూ. వారి సంఖ్య ఒక్కొక్కప్పుడు తక్కువగా, ఒక్కొక్కప్పుడు ఎక్కువగా ఉండవచ్చు. అలాగే ప్రతి కాలంలోనూ సాత్విక, దైవీ ప్రవృత్తి కలిగిన వ్యక్తులు కూడ ఉంటారు. హనుమంతునికి రాత్రి చీకటిలో లంకలో రాక్షసుల మధ్య దైవ స్వరూపుడైన విభీషణుడు దొరికాడు. అలాగే – మనం మెలకువతో చూస్తే, మన చుట్టుప్రక్కల నిజాయితీపరులూ, శీలవంతులూ, నైతిక విలువలను పాటించేవారూ అయిన మంచి వ్యక్తులు మనకు కనిపిస్తారు. ఆశావాదులు కనిపిస్తారు. నిర్మాణాత్మక దృక్పథం కలిగిన వ్యక్తులు కనిపిస్తారు.

యువతరంలో ఇలాంటి శీలవంతులు కోకొల్లలుగా ఉన్నారు. వారిని చెడిపోకుండా కాపాడడం ఎలా? ఈ విషవలయం నుండి వారు స్వయంగా ఎలా బయటపడగలరు? ఇదే ప్రస్తుత సమస్య. అసలు బాధ్యత యువతదే. దుష్ట ప్రవృత్తుల వలలో చిక్కుకోవడం వల్ల కలిగే దుష్ట ప్రభావాలను వారు సకాలంలో గుర్తించాలి. వాటి ప్రలోభాలకు లోనుకాకూడదు. అప్పుడు వారిని ఎవ్వరూ పెడదారి పట్టించలేరు. తమను తాము సంస్కరించుకోవాలనే ఇచ్ఛాశక్తి వారిలో మేలుకొంటే – ఇతర సత్పురుషుల మాటలు వారికి రుచిస్తాయి. తమను సంస్కరించుకున్నపుడే వారు ప్రపంచాన్ని సంస్కరించగలుగుతారు.

## కాయకల్పం చేయగలిగేది యువతయే

వివిధ సమయాలలో సామాజిక పరిస్థితిలో మార్పులు వస్తూనే ఉంటాయి. అవి ఒకోసారి నిర్మాణాత్మకంగా ఉంటాయి. ఒకోసారి వ్యతిరేకాత్మకంగా ఉంటాయి. ప్రస్తుతం కుటుంబపు ఇరుసు, సమాజపు ఇరుసు ఊగిసలాడిపోతున్నాయి. వ్యవస్థ మొత్తాన్ని ఆమూలాగ్రం మార్చవలసిన అవసరం ఏర్పడింది. ఈ పని ఎవరు చేయగలరు? ఎవరు చేస్తారు?

ప్రపంచంలో జరిగిన మహత్తర విప్లవాలు అన్నింటిలో యువతరం మహత్తర పాత్ర నిర్వహించిందని చరిత్ర చెపుతోంది. మనిషి జీవితంలో సర్వశ్రేష్ఠమైన సమయం యౌవనం. ఉత్సాహంతో, ఉత్తేజంతో ఉరకలు వేసే యువతరం పర్వతాలను ఢీకొనాలని ఉవ్విళ్లూరుతుంది. ఎంతటి గడ్డు పరిస్థితులనయినా ఎదుర్కొనే సాహసం యువతరంలో ఉంది. వారి శారీరక, మానసిక శక్తులు వివిధ రూపాలలో విజృంభిస్తాయి. అసాధ్యాలను సాధ్యాలు చేసే సామర్థ్యం వాటిలో ఉంది. వాస్తవానికి – అపరిమితమైన ఊర్జస్వితకూ, ఉత్సాహానికీ, సాహస కార్యాలను సాధించాలనే దీక్షకూ మరోపేరు యువత. జాతికి కాయకల్ప చికిత్స చేయగలిగేది యువతయే. ఆ విధంగా వారు సమాజానికి ఆశా జ్యోతులు. జాతికి విశ్వాస ప్రదాతలు.

'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్స్‌డ్ స్టడీస్' ప్రకారం – దేశంలో 16నుండి 24 సంవత్సరాల వయస్సుగల యువతీ యువకుల సంఖ్య 21.5 కోట్లు. ఇంత పెద్ద జనశక్తి వ్యతిరేకాత్మక కార్యకలాపాలలో మునిగిపోతే – దేశం అధోగతిపాలు కాక తప్పదు. మరోప్రక్క ఈ యువశక్తి నిర్మాణాత్మక మార్గంలో పురోగమిస్తే దేశం ప్రపంచానికి మకుటమణి అవుతుంది. నేడు ఏ దేశమయినా తన పెత్తనాన్ని చెలాయించగలిగేది కొద్ది సమయమే. తన సద్గుణాలు ఆధారంగా, సదాలోచనలు ఆధారంగా భారతవర్షం ఒకప్పుడు జగద్గురువుగా ప్రఖ్యాతి పొందింది. ఆ భారతవర్షాన్ని తిరిగి ఆ స్థానంలో స్థాపించే సామర్థ్యం కేవలం మన యువతరానికే ఉంది.

HHH

**మీరు సమయాన్ని వృధా చేస్తే, సమయం మిమ్మల్ని వృధా చేస్తుంది.**

# ధారావాహిక : మనఃస్థితి మారితే మారుతుంది పరిస్థితి-1

## యుగధర్మాన్ని పాటించడం అనివార్యం

*పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ రచించిన "మహాపూర్ణాహుతి పుస్తకమాల"లోని 12వ గ్రంథం "మనఃస్థితి బదల్‌నెసె పరిస్థితి బదలే" అనువాదాన్ని ఈ సంచికనుంచి ధారావాహికగా ప్రచురిస్తున్నాం. అనువాదం చేసినవారు: మాధవి, శారద.*

---

పసివయసులో కుట్టించిన బట్టలు యువకులైతే సరిపోవు. అలాగే యౌవనంలో కుట్టించిన బట్టలు మధ్యవయస్సు వస్తే చాలవు. వయస్సు పెరిగేకొద్దీ మార్పు వస్తుంది. భోజనం తాజాగా ఉంటేనే బాగుంటుంది. విద్యార్థి ఒక్కొక్క తరగతీ పాసయి, తరువాత తరగతికి వెళ్తుంటే, కొత్త పాఠ్యపుస్తకాలు కొనడం తప్పనిసరి అవుతుంది. చలికాలపు వస్త్రాలు వేరు. ఎండాకాలపు వస్త్రాలు వేరు. మార్పు జరుగుతుండగానే, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవటం ఒకరకంగా ఆవశ్యకమౌతుంది.

కాలం ఎల్లప్పుడూ ఒకరకంగా ఉండదు. అది మారుతూ ముందుకుపోతూఉంటే, దానికి అనుగుణంగా నియమాలు - సూత్రాలు ఏర్పరచవలసి వస్తుంది. ఆదిమానవుడు వస్త్రాలు లేకుండానే జీవించేవాడు. మధ్యయుగంలో ధోవతి, పైపంచె - కుట్ట నవసరంలేని రెండే వస్త్రాలు వాడుతుండేవారు. ప్రాచీన కాలంలో మోటు ఆయుధాలు, పనిముట్లు వాడుకలో ఉండేవి. మధ్యయుగంలో ధనుర్బాణాలు, కత్తి, డాలు వంటివి యుద్ధంలో ఉపయోగింపబడే ముఖ్య ఆయుధాలు. కాని ఇప్పుడు నిప్పులు కక్కే అణ్వాయుధాలతో తప్ప పని జరగడం లేదు. కాలంతో పాటు మారే పరిస్థితులకు పరిష్కారం వెదకవలసి వస్తుంది.

ప్రాచీన కాలంలో వర్ణాశ్రమ ధర్మాల ననుసరించి చేయబడిన విభజన ఇప్పుడు చాలావరకు మారిపోయింది. ఇప్పుడు ఆ స్థానాన్ని కొత్త వ్యవస్థ స్వీకరించింది. రెండు వందల సంవత్సరాల క్రిందట వాడబడిన వస్త్రాలు ఇప్పుడు అక్కడక్కడ ప్రదర్శనలలో మాత్రమే కన్పిస్తున్నాయి. సైకిలు తయారయిన కొత్తలో ముందుచక్రం పెద్దదిగా, వెనుక చక్రం చిన్నదిగా ఉండేది. ఇప్పుడు అలాంటివి పురాతనవస్తుప్రదర్శనలలో మాత్రమే చూడగలము. గొడ్డలితో నేలను దున్ని వ్యవసాయం చేయటం పూర్వం వాడుకలో ఉండేది, కాని ఈనాడు కొత్తరకం నాగళ్లు ఉపయోగించుతున్నాము. వీటిని జంతువులు లేదా మెషిన్‌లు ద్వారా నడిపించుతున్నాము. కర్రలను ఒకదానితో ఒకటి రాపిడి చేసి నిప్పు చేయటం మధ్యకాలంలో జరిగేది. ప్రస్తుత కాలంలో అగ్గిపెట్టెలు వాడుకలోకి వచ్చిన తర్వాత, ఎవ్వరూ ఈ కష్టసాధ్యమైన పనిని చేయటానికి సిద్ధపడడంలేదు.

వికాసక్రమంలో ఇటువంటిమార్పులు సునాయాసంగా జరుగుతాయి. ఈ మార్పును ఆపలేము. పాతకాలపు పద్ధతులను పట్టుకుని వేళ్లాడే వ్యక్తి కేవలం నష్టపోవడమేగాక ఎగతాళిపాలు కూడ అవుతాడు.

ఆలోచనలు, ప్రతిపాదనలు, కొన్ని గుర్తింపులు, క్రియాకలాపాలు సమయంతోపాటు వచ్చే మార్పులవల్ల ప్రభావితం కాకుండా ఉండవు. వీటిని నిర్లక్ష్యం చేయకూడదు. ధర్మశాస్త్రాలు కూడ సమయపు కట్టుబాట్లకు లోబడి ఉన్నాయి. వీటిలో కాలపు మార్పులు ఆధారంగా సవరణ వస్తూ ఉంటాయి. ఋషులు తమతమ సమయాను కనుగుణంగా స్మృతులు, సూత్రాలు వ్రాయవలసిన ఆవశ్యకతను అర్థం చేసుకున్నారు. ఆ సంస్కరణలే జనజీవనంలో ఆదరణ పొందుతూ ఉండేవి. వారిలో వారికి అభిప్రాయభేదాలు కాని, వైరం కాని ఇందుకు కారణం కాదు. మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, ధర్మవ్యవస్థ స్వరూపంలో గొప్పమార్పులు చెయ్యబడ్డాయి.

ప్రాచీన కాలంలో భూమిని తొలిచి గుహలు

**పోగొట్టుకొన్న ధనాన్ని రాబట్టవచ్చు. పోగొట్టుకొన్న సమయాన్ని రాబట్టలేము.**

నిర్మించుకునేవారు. తరువాత కుటీరాలు ఏర్పరచుకోవటం చాలా తేలిక, సులభం అన్పించింది. ఇప్పుడు ఇనుము, సిమెంటుల సహాయంతో భవన నిర్మాణ ప్రక్రియ నిరంతరం ముందుకుసాగుతూ ఉంది. కట్టెలు, పేడలతో పూర్వం వంట చేసుకునేవారు. ఈ పని ప్రస్తుత కాలంలో 'గోబర్‌గాస్', లేదా 'పెట్రోలియం గాస్'తో మరింత వేగవంతమైన ప్రక్రియ రూపొందించబడింది. ఎక్కువ విద్యుచ్ఛక్తి దొరికే ప్రదేశాలలో దానినికూడ ఇంధనంగా వాడుతున్నాము. పెట్రోలు కూడ ఈ పనికి ఉపయోగపడుతున్నది. ప్రస్తుత కాలంలో సౌరశక్తి కూడ వంటచెరుకుకు ప్రత్యామ్నాయంగా వినియోగించబడుతున్నది. ఈ మార్పులలో, "ఆవశ్యకతకు అనుగుణమైన ఆవిష్కరణ" అనే సిద్ధాంతం సార్థకం అవుతున్నది.

కాలం ఎప్పుడూ వెనుకకు జరుగదు. అది నిరంతరం ముందుకు మాత్రమే సాగుతుంటుంది. దీనితోపాటు నమ్మకాల్లోనూ ఆచరణలలోనూ మార్పులు వస్తూ ఉంటాయి. పూర్వకాలంలో ఆలోచించబడిందే, ఆచరణలో ఉన్నదే శిలాశాసనంలా ఎప్పటికీ ఉండాలనే పట్టుదల అరుదుగా ఉంటుంది. ఇటువంటి పట్టుదల ఉన్న మూర్ఖులు బహుశా కరెంటు వాడటానికి, పంపునీళ్లు త్రాగటానికి కూడ అభ్యంతరం చెపుతారేమో. వీళ్లు బహుశా గుహ తయారుచేసుకొని ఉంటామని పట్టుపడతారేమో. ఎందుకంటే మన పూర్వీకులు నివసించినది ఆ విధంగానే కనుక.

ఒకప్పుడు పింగాణీ పలకలమీద వ్రాతపని సాగుతుండేది. తరువాత తోళ్లు, భూర్జర పత్రాలు, తాటియాకులమీద వ్రాస్తుండేవారు. ఇంకా కొంతకాలం తర్వాత, చేతితో తయారైన కాగితం వాడుకలోకి వచ్చింది. ఇప్పుడయితే, అన్ని ప్రదేశాలలోనూ కర్మాగారాలలో తయారైన కాగితం మాత్రమే ఉపయోగించబడుతున్నది. చేతితో గ్రంథాలను నకలు చేసే విధానం చాలా కాలం సాగింది. ప్రస్తుత కాలంలో అతి చౌకగా లభించే సరళమైన అచ్చు యంత్రాల సౌకర్యాలను వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడరు. అప్పుడు రైళ్లు మోటార్ల అవసరమే ఉండేదికాదు. ఇప్పుడు అవి లేకుండా ప్రయాణం కానీ రవాణాకానీ జరగడంలేదు. పోస్టాఫీసుద్వారా జరిపే ఉత్తర ప్రత్యుత్తరాల కార్యక్రమమే ప్రస్తుతం అమలులో ఉన్నది. గుర్రాల మీద ఎంతోదూరం ప్రయాణించి సందేశాలను అందించే విధానం లుప్తమైపోయింది.

పరివర్తనకు అనుగుణంగా కొత్త విధానాలను రూపొందించడం తప్పనిసరి. ఎందుకంటే, వీటిని ఉపయోగించకుండా ఉండటానికి ఎవ్వరూ పొరపాటున కూడ ఒప్పుకోరు. ఈ కాలంలో గడియారాన్ని ఉపయోగించడానికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. యుగధర్మాన్ని గుర్తించటానికి, దానిని తప్పనిసరిగా ఆచరించటానికి ఆలస్యం కూడదని కాలం ప్రతి ఒక్కరినీ హెచ్చరిస్తూ ఉంటుంది. సనాతన ధర్మం, నీతి సూత్రాలు, సామాజిక స్పృహ శాశ్వతమైనవి. కానీ పాత ఆచార వ్యవహారాలు, కార్యకలాపాలు, సాధనాలు అలాగే ఉండాలని పట్టుపట్టడంవల్ల ప్రయోజనం లేదు. ఇటువంటి హఠవాదులు, మూర్ఖులు "పాత సాంప్రదాయపు భక్తులు"గా మిగిలిపోతారు. వారు తాము మినహా ఇంకెవ్వరినీ ఇందుకు అంగీకరింప చెయ్యలేరు. 'సాంప్రదాయవాదులు'గా ఉండిమాత్రమే ధర్మాన్ని నిలబెట్టగలమని అనుకోవటం పొరపాటు. "పూర్వం ఉన్న పద్ధతులలో మార్పుతేవాలనే ఆలోచనే పాపమనీ, ఇలా చేసేవాళ్లని అధర్మపరులనీ, అటువంటి వారికి పాపం చుట్టుకుంటుందని చెప్పే ఈ సంప్రదాయవాదులు ఎవ్వరినీ అందుకు ఒప్పించలేరు.

'మంచో చెడో' ఏదో ఒక ఆచారాన్ని తన, తన పూర్వీకుల "ప్రతిష్ఠకు సంబంధించిన విషయంగా పరిగణించి దానికే అంటిపెట్టుకొని ఉండటం సాధ్యం కావచ్చు. కానీ, అందులో విజ్ఞత ఇసుమంతైనా లేదు. మనిషి అభివృద్ధిపథంలో పయనించాడు, పయనిస్తాడు. సృష్ట్యాది నుంచి అనేక మార్పులకు, పరిణామాలకు గురి అవుతూ, వ్యక్తి ఈనాటి ప్రస్తుత స్థితికి చేరుకున్నాడు. ఈ విధానం ఇక ముందుకూడ జరుగనున్నది. పూర్వపు పద్ధతుల కోసం మొండిపట్టు పట్టడం ఎవరికీ ఏ విధంగానూ మంచిదికాదు. యుగ ధర్మాన్ని పాటించడంద్వారానే మనిషి ప్రగతిని సాధించాడు;

**బద్ధకం సమయానికి బద్ధ శత్రువు.**

ఇకముందుకూడ మనిషి అందుకు సిద్ధం కావాలి. ఇది కాలపు పిలుపు, యుగధర్మం. దీనిని ఎవ్వరూ కాదనజాలరు.

## సంపన్నుల ముసుగులో దరిద్రులు

రోమ్‌లోని ఒక తత్త్వవేత్త మనసులో భారతదేశపు గొప్పతనాన్ని చూడవలెననే కాంక్ష కల్గింది. ఎంతో డబ్బు, సమయం వెచ్చించి, ఇక్కడకు వచ్చి, దేశమంతా తిరిగాడు. తిరిగి వెళ్లినపుడు చాలా ఉదాసీనంగా ఉన్నాడు. ఆయన స్నేహితులు ప్రశ్నించగా, కేవలం ఒక్క వాక్యంతో ఈ విధంగా జవాబిచ్చాడు – "భారతదేశంలో పేదలు అత్యధికంగా ఉన్నారు. వారిలో 'గొప్పవారి'లాగ ఉండవలెననే నటన సాగుతోంది." ఇదేవిధమైన అభిప్రాయాన్ని జపానులోని ఒక తత్త్వవేత్తల మండలికూడ వెలిబుచ్చింది. వారు దేశమంతటా సంచరించిన తర్వాత ఈ విధంగా అన్నారు – "ఇచ్చట ధనవంతుల భవంతు లున్నాయి. కాని వాటి నీడలోనే వెనుకబడిన బీదా – బిక్కీ నివసిస్తుంటారు."

ఇటువంటి తారతమ్యం ఎందుల కేర్పడింది అనే ప్రశ్న ఉదయిస్తుంది. గొప్పవాళ్లకు సాధారణంగా ఉండే దుర్గుణాలు ఇక్కడ ప్రతి ఒక్కరిలోనూ ఉన్నాయి. కాని ప్రగతి పథంలో పయనించేవారికి ఉండవల్సిన సద్గుణాలు ఎంత మాత్రమూ లేవు. ఈ లోటువల్ల బీదలేకాక, అవిద్యావంతులు, పనిదొంగలు, అశుభ్రమైనవారు తయారవుతారు. ఇతరుల సంపద ఆధారంగా ఈ లోపాలను తొలగించలేము. భూమికి సారం లేనట్లయితే, విత్తనాలు నాటేవాడూ నీరు కట్టేవాడూ ప్రయోజనం పొందలేరు.

మనిషికి అతని వ్యక్తిత్వమే నిజమైన సంపద. దీనిలో జీవం ఉన్నట్లయితే – పొలాలు, ఉద్యానవనాల మాదిరిగా తననుతాను ఆకర్షణీయంగా మలచుకోవటమే కాక, ఇది ఇతరుల మనస్సులను రంజింపచేయగలిగే సంపదలను తగినంతగా ఉత్పన్నం చేయగల్గుతుంది; కానీ రాళ్లలో పచ్చదనాన్ని ఎట్లా పండించగలము? వ్యక్తిత్వం అంత తేలిగ్గా ఏర్పరచుకునేది కాదు. అది చుట్టుపక్కల వాతావరణం నుండి తనకు కావల్సిన ప్రాణవాయువును తీసుకుంటుంది. ఎక్కడైతే విషవాయువు వ్యాపించి ఉందో అక్కడ ఊపిరి పీల్చడమే కఠినమవుతుంది. అటువంటప్పుడు ఎక్కువ కాలం జీవించి ఉండటమనే ప్రశ్నే లేదు!

దీర్ఘకాలం బలహీనతకు లోనై ఉండేవాళ్లని కొన్నిరకాల రోగాలు చుట్టుముట్టి వేధిస్తూ ఉంటాయి. అంటువ్యాధులు ఒకరినుండి ఒకరికి అంటుకుంటూ ఉంటాయి. సుఖంగా ఆరోగ్యంగా ఉన్నవాళ్లని కూడ తమ సందిట్లోకి తీసుకుంటాయి. దీర్ఘకాలపు బానిసత్వం, కూడని మూఢాచారాలు, దుష్ప్రవృత్తుల విషయం కూడ ఇటువంటిదే! అవి నిరాటంకంగా పయనిస్తూ పెరుగుతూ ఉంటే, సమాజం గుల్ల కాకతప్పదు.

దేశంలోని దరిద్రం తెలిసిన విషయమే. అవిద్య, మురికితనం, చెడు అలవాట్లు దాగిన విషయాలేమీ కావు. కాకపోతే ఒక్క విషయం గురించి ఎక్కువ ఆలోచించవల్సి ఉంది. అది – భారతదేశంలో 'గొప్పతనపు ప్రదర్శన', ఎందుకు జరుగుతున్నది? ధనవంతులుగా కనబడాలనే అవలక్షణం ఇక్కడ ఉన్నది. అయితే దీనికి మినహాయింపు ఉన్నది. దానిని సద్వినియోగం చేసేవారు తాము లాభం పొందడమేకాక, ఇతరులకు తగినంత సహాయం చెయ్యగలరు. కాని సాధారణంగా అలా జరగటంలేదు.

మన దేశంలో గొప్పతనం అంటే – అర్థం బద్ధకం – అపవ్యయం, దుర్వ్యసనాల చిట్టా. మన దేశంలో కష్టపడి పనిచేయటం ఒక దురదృష్టమనే భావన ఉంది. రాజులు, సామంతులు, జమీందార్లు, గొప్పవాళ్లు, పేదవాళ్లు, సన్యాసులు, మహాత్ములు అందరూ కష్టపడటం అవమానంగా భావిస్తుంటారు. వారు తమ శారీరక సేవలకు దగ్గర్లో ఉన్న ఇతరుల మీద ఆధారపడతారు. అమ్మాయికి పెండ్లి చేసేటప్పుడే అత్తవారింట్లో హాయిగా మంచంమీద పడుకొని సుఖంగా ఉండగలదా లేదా అనే చూస్తారు. ఎవడైనా రోజంతా పనిచేస్తే వాడిని తక్కువగా చూస్తారు. మంచి ప్రవర్తన, మంచి గుణాలు కలగిన వ్యక్తులు, రోజంతా పని చేయటంలో నిమగ్నమై ఉంటారు కాబట్టి వారిని హీనంగా చూడటం పరిపాటి

**సమయమూ, సాగర తరంగాలూ ఎవరి కోసమూ వేచి ఉండవు.**

అయింది. రోజంతా ఏ పనీ లేకుండా కాలక్షేపం చేసేవారు సంపన్నులుగా పరిగణించబడతారు. ఈ సోమరితనం, పనిదొంగతనంతో కూడిన అలవాటు, వేళ్లని పాతుకుపోతుంది, ఇక కదలనే కదలదు.

మితిమీరిన ఖర్చు చేయడం ధనికులకున్న ఒక పెద్దరోగం. దీని సహాయంతో ఎవరినైనాసరే మనం గొప్పవాళ్లమన్న భ్రమలో పడవేయవచ్చు. ఫ్యాషన్, నగలు, ఆడంబరం, మాదకద్రవ్యాలను వాడటం మొదలైనవన్నీ గొప్పతనపు చిహ్నాలుగా పరిగణించబడుతున్నాయి. పెళ్లిళ్లు మొదలైన శుభకార్యాలప్పుడు ఈ అలవాటు నెత్తిమీదకెక్కి కూర్చుంటుంది. అందుకోసం – అవసరమైన సామాన్లు సైతం అమ్మి, టపాసులు కాల్చి ఆడంబరం చాటుకోవటం కోసం జనం ఆతురపడతారు, వ్యాకులమౌతారు. పెండ్లికొడుకును, పెండ్లికూతురిని, రాజకుమారుడు – రాజకుమార్తెలను తలపించేటట్లుగా అలంకరిస్తారు. ఆ ఊరేగింపును, ఆ విందును చూస్తే, రోజూ తిండికోసం అష్టకష్టాలుపడే ఈ జనానికి ఖజానా ఏమైనా దొరికిందా అన్పిస్తుంది.

సగటు భారతీయుడికి రోజు మొత్తమీద కొద్ది గంటలే పని దొరుకుతుంది. మిగతా సమయమంతా వారు చక్కర్లుకొట్టటమూ, ఊరికే రోడ్లవెంట తిరగటమూ, ఊసుపోక కాలక్షేపం చెయ్యటమూ చేస్తారు. ఈ సమయాన్ని వారు ఏదైనా కఠోర పరిశ్రమకు వినియోగించుకుంటే, సుఖ జీవితం గడపటానికి కావల్సిన సాధనాలు చక్కగా లభ్యమవుతాయి. వ్యవసాయం చేసేవాళ్లు తమకు మిగిలిన సగం కాలాన్ని కుటీర పరిశ్రమలలో ఉపయోగించుకోవచ్చు. అదనపు బ్రతుకు దెరువు సంపాదించుకోవచ్చు.

డబ్బు సంపాదించే అవసరం, బాధ లేనివారు, తమకు లభ్యమయ్యే విరామ సమయాన్ని విద్య అభివృద్ధికి గానీ, మురికి వాడలను పరిశుభ్రపరిచే కార్యక్రమాలకు కానీ ఉపయోగించాలి. కుటుంబంతో కలిసి ఆ ప్రదేశాలన్నింటినీ నాగరిక జనావాసాలుగా మార్చవచ్చు. ఆరోగ్య పరిరక్షణ, జీవనోపాధిని పెంపొందించుకొనుట, కళలో నేర్పును సంపాదించుట, విద్యాభివృద్ధి మొదలైన అనేక పనులు చేసుకొనుటకు ఉత్సాహం చూపితే, ఈ రోజుకన్నా రేపు ఇంకా ఎక్కువ డబ్బు, చదువు, నాగరికత, ప్రతిభ, సంపాదించడంలో సందేహమేమీ లేదు.

అధికవ్యయాన్ని అడ్డుకుంటే, మట్టిలో చిల్లిఉన్న కుండకు రంధ్రం మూసివేసినట్లయితే, నీళ్లు నిండి ఉంటాయి. దాహంతో అల్లాడిపోయే స్థితి రాదు. కాని దౌర్భాగ్యమేమిటంటే జనం సమయంతోపాటు శ్రమను జోడించటంలేదు. గొప్పతనం చాటుకోవడం అనే దెయ్యం, ఉన్మాదం నెత్తిమీదనుండి దిగనే దిగడంలేదు. ఈ మూర్ఛలోనుంచి బయటికి వచ్చి ముందుకి సాగే ప్రవృత్తి, దొరికిన వనరులను సద్వినియోగపరుచుకునే ఉత్సాహం పెల్లుబుకడంలేదు. ఈ మానసిక స్థితిలో ఉండేవాడు దారిద్ర్యం నుంచికానీ, అవిద్యనుంచిగానీ దూరం కాలేడు. అభివృద్ధి సాధించేందుకు ఇంకా అనేక మార్గాలు ఉన్నాయి. కానీ ఈ వెనుకబాటుతనం మన గుణ, కర్మ, స్వభావాలలో ఒక విడదీయలేని భాగంగా ఉన్నప్పుడు, మనం ప్రగతి పథాన్ని ఎలా అందుకోగలం?

ఇటువంటి ఉత్సాహపూర్వకమైన, ప్రగతిదాయకమైన వాతావరణంలో ఉండే అవకాశం మనకు దొరికితే బాగుంటుంది. కనీసం అటువంటి ప్రేరణలు ఉన్న ప్రదేశంతో స్థిరమైన సంబంధాలను ఏర్పాటుచేసుకుంటే బాగుంటుంది. చుట్టుప్రక్కల అటువంటి ఉత్సాహం ఎక్కడా కనబడకపోతే, ఇంకెక్కడయినా అటువంటి వాతావరణం ఉందేమో చూసుకోవాలి. అదీ వీలుకాకపోతే, కనీసం గతకాలపు కార్యశూరతను అర్థంచేసుకోవాలి, దానినుండి ప్రేరణ పొందే ప్రయత్నం చేయాలి. అటువంటి ప్రగతిశీలుర కీర్తి గాథలు ఇప్పుడుకూడా అక్కడక్కడ ఉన్నాయి. చరిత్ర పుటలలో అటువంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి.

ఏవ్యక్తి ఐనా కష్టాలలోనుండి బయటపడి, ప్రగతి పథంలో ముందుకుసాగాలంటే, అతడు గొప్పతనపు బురఖా తగిలించుకొని, చాలీచాలని బ్రతుకులు గడపటానికి దారితీసే మనస్తత్వాన్ని జయించాలి.

H H H

**ప్రజలు సమయం కోసం నిరీక్షిస్తారు. సమయం ఎవరికోసమూ నిరీక్షించరు.**

## ముఖచిత్ర కథనం

# గ్రుడ్డి నమ్మకాలను కూల్చివేసిన గురునానక్

శ్రీ గురునానక్ దేవ్ పంజాబ్ రాష్ట్రంలోని తల్వండి గ్రామములో 1526 వైశాఖ మాసం మూడవ రోజు, అనగా 15 ఏప్రిల్ 1469 నాడు జన్మించాడు. తండ్రి పేరు కల్యాణదాసు మెహతా. అతణ్ణి కాలూ అని పిలిచేవారు. వారు వేదికుల క్షత్రియులు. మెహతా కాలూ పట్వారీగా పనిజేసేవాడు. అతని భార్య పేరు తృష్త. బాలకుడైన నానక్ తేజస్సు చూసి జ్యోతిష్యుడు హరదయాల్ ఆశ్చర్య చకితులయ్యారు. సాధుసంతులెవరైనా వాకిట్లో కనబడగానే నానక్ ఇంట్లోకి పరుగెత్తి దొరికిన వస్తువును తెచ్చి వారికిచ్చేవాడు.

### యజ్ఞోపవీతం

ఏడు సంవత్సరాల వయసులో నానక్‌ను బడిలో చేర్పించారు. నానక్ మనసు చదువుమీద లగ్నమయేది కాదు. తొమ్మిదిసంవత్సరాల వయసప్పుడు నానక్‌కు యజ్ఞోపవీత సంస్కారం చెయ్యాలని నిశ్చయమైంది. కుటుంబ గురువు హరదయాళ్‌జీ యజ్ఞోపవీతం వెయ్యబోయాడు. నానక్ అతని చెయ్యి పట్టి ఆపేశాడు. "ఈ జంధ్యాన్ని ధరించడంలో లాభమేముంది?" అని సూటిగా ప్రశ్నించాడు. అంతటితో ఆగకుండా ఆదర్శప్రాయమైన జంధ్యము గురించి ఇలా చెప్పాడు : "దయ అనే పత్తి, సంతోషం అనే దారం, సంయమనం అనే ముడితో తయారైన జంధ్యం తెగదు, మెలికపడదు, కాలిపోదు.... ఎప్పుడూ చెడిపోదు. ఆదర్శమనే జంధ్యాన్ని ధరించిన మనిషి ధన్యజీవి. అతడు పుణ్యలోకాలకు వెళతాడు."

### పరోపకారి నానక్

నానక్ స్వభావం తండ్రి మెహతా కాలూను బాధపెట్టేది. అతడు నానక్‌ను వ్యాపారంలోకి దింపాలనుకున్నాడు. నమ్మకస్థుడైన సేవకుడు బాలూను తోడుగా ఉంచి వ్యాపారంలోకి దింపాడు. ఇరవై రూపాయలు తీసుకొని నానక్ చూహద్‌కాణ అనే వ్యాపార కేంద్రానికి బయలుదేరాడు. వెంట బాలూ ఉన్నాడు. తోవలో చెట్ల నీడలో సాధువులు భజన చేస్తున్నారు. వారు చాలా రోజుల నుండి ఉపవాసంతో ఉన్నారన్పించింది. నానక్ మనసు కరిగి వ్యాకులమైంది. తన వద్ద ఉన్న ఇరవై రూపాయలు ఇవ్వాలనుకున్నాడు కాని వారు స్వీకరించలేదు. బాలూతో వెళ్ళి వంటసామగ్రి తెచ్చి సాధువులకు భోజనం ఏర్పాటు చేశాడు. సాధువులు ప్రేమగా తిన్నారు.

ఇహ వ్యాపారం చేయలేడని తేలిపోయింది. నానక్ ఇంటి ముహం పట్టాడు. మెహతా నానక్‌ను కొట్టడం ప్రారంభించాడు. నానక్ మొహమ్మీద దెబ్బలు వేస్తూనే ఉన్నాడు. నానక్ అక్కయ్య భర్త జయరాం దౌలత్‌ఖాన్ నవాబు వద్ద దివాన్‌గా పనిజేసేవాడు. ఓసారి నానక్‌ను దర్బారుకు తీసుకువెళ్లి నవాబుకు పరిచయం చేశాడు. నానక్ వ్యక్తిత్వం నవాబుకు బాగా నచ్చింది. వెంటనే నానక్‌ను మోదీఖానా (అన్న భాండాగారము) ప్రధానిగా నియమించాడు. ముఖ్యమైన ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ నానక్ ఎంతో మంది అన్నార్తులు, అభాగ్యులకు సహాయం చేశాడు.

### వివాహం

పందొమ్మిదేళ్ల వయస్సులో సులక్షణతో నానక్ వివాహమైంది. నానక్ మానవ సేవను వదలలేదు.

### జ్ఞాన ప్రాప్తి

ఇలా పది సంవత్సరాలు గడిచాయి. నానక్ ఇద్దరు కొడుకులకు తండ్రయ్యాడు. ఎప్పట్లాగా ఓ రోజు ఓ నౌకరును వెంటబెట్టుకొని నదీ స్నానానికి వెళ్లాడు. ఒడ్డున గుడ్డల వద్ద నౌకరునుంచి తాను నదిలోకి దూకాడు. చాలా సేపైంది. నదిలోంచి నానక్ బయటకు రాలేదు. నౌకరు నిరాశతో గుడ్డలు తీసుకువెళ్లి ఇంటిలో అప్పగించి విషయమంతా చెప్పాడు. గజ ఈతగాళ్లు నది అంతా వెతికారు. కాని నానక్ జాడలేదు.

మూడవరోజు నానక్ క్షేమంగా తిరిగివచ్చాడు. నానక్ నోటినుండి వెలువడిన మొదటి మాట "హిందువెవరు,

**సమయాన్ని దుర్వినియోగపరచడం మన అదృష్టాన్నీ, భవిష్యత్తునూ కాలదన్నడమే.**

ముస్లిమెవరు?" ముఖంలో దివ్యమైన తేజస్సు కనబడింది.

## గృహత్యాగం

మానవసేవ కోసం నానక్ ఇల్లువదిలి పోవాలని నిర్ణయించుకున్నాడు. కుటుంబ సభ్యులతో "పరమపిత పరమాత్ముని ఆజ్ఞతోనే మానవసేవ చేసేందుకు ఇల్లు వదిలి వెళుతున్నాను"



అనేశాడు.

## శ్రమ సంపాదన

తిరుగుతూ తిరుగుతూ నానక్ ఎమునాబాద్ చేరుకున్నాడు. మలిక్‌భాగో అనే ధనవంతుడుండేవాడక్కడ. అతడు సామూహిక భోజనం ఏర్పాటు చేశాడు. అతి పెద్ద స్థాయిలో ఏర్పాటయింది. నానక్ వెంట మర్దానా గూడా ఉన్నాడు. నానక్ మలిక్‌భాగో విశాల సామూహిక భోజనంలో పాల్గొనేందుకు వచ్చాడనుకున్నాడు మర్దానా. సంతోషం కలిగిందతనికి. కాని నానక్ మాత్రం ఎమునాబాద్ నగరంలో ప్రవేశించాక ఒక బీదవారి పాత ఇంటిముందాగాడు. "సత్‌కర్‌తార్!" అని గట్టిగా అరిచాడు. మర్దానా ఆందోళన చెందాడు. ఈ ఇంటి యజమాని నుండి ఏమి ఆశిస్తాము? అనుకున్నాడు. మొదటి పిలుపుకు తలుపులు తెరుచుకోలేదు. నానక్ మళ్ళీ "సత్‌కర్‌తార్!" అని పిలిచాడు. తలుపులు తెరుచుకున్నాయి. ఓ బీద వ్యక్తి నిరాశగా బయటికివచ్చాడు. చేతులు జోడించి "మహాత్మా! మీరు పొరపాటున ఈ పేదవాడింటికి వచ్చి ఉంటారు. మాలిక్ భాగో గారిల్లు ముందున్నది. నేను మిమ్మల్ని ఆ ఇంటికి తీసుకు వెళ్తాను పదండి" అన్నాడు.

నానక్ అలాగే నిల్చున్నాడు. పేద వడ్రంగి లాలో ఇల్లు అది. ఆత్మీయమైన చిరునవ్వు చిందిస్తూ అన్నాడు నానక్ "సోదరా లాలో! మేము నీబంధువులం. నిన్ను కలవాలని వచ్చాము."

లాలోకు నమ్మకం కుదరలేదు. కాని.... పులకించి పోయాడు. నానక్‌ను, మర్దానాను మర్యాద పూర్వకంగా లోపలికి తీసుకు వెళ్ళాడు. అతిథులను మంచమ్మీద కూచోబెట్టి వంటచేస్తున్నాడు. సజ్జరొట్టె, కూర అతిథుల ముందుంచాడు లాలో. పక్కన కూచుండి విసనకర్రతో విసురుతున్నాడు. నానక్ చాలా ఆసక్తిగా తింటూ వంటకాలను ప్రశంసించడం ప్రారంభించాడు. లాలో సంతోషంతో ఊగిపోయాడు.

మలిక్ భాగో క్షత్రియుడు. స్వయంగా వెళ్ళి నానక్‌ను సామూహిక భోజనాల్లో పాల్గొనాలని ప్రార్థించాడు. నానక్ మర్దానాతో భాగో ఇంటికు వెళ్లాడు. గురునానక్ ముందు భోజన ముంచారు. కాని నానక్ తిరస్కరించాడు.

భాగో చేతులు జోడించి కారణమడిగాడు. నానక్ నిర్మొహమాటంగా అనేశాడు – "మలిక్ భాగో! నీ భోజనంలో పేదల రక్తం కలిసి ఉంది. కాబట్టి నేను స్వీకరించలేను."

మలిక్ భాగోకు అవమాన మన్పించింది.

"ఆ వడ్రంగి లాలో ఇంట్లో ఎండిన రొట్టెను ఎంతో ప్రేమగా తింటారు. కాని ఇది పవిత్రమైంది, రుచికరమైంది" అన్నాడు కోపంగా.

నానక్ అన్నాడు – "ఎవరినైనా పంపించు. లాలో ఇంటి

**అవకాశం కోసం ఎదురుచూస్తూ కూర్చోవద్దు. నేటి అవకాశమే సర్వోత్తమం.**



"నుండి రొట్టె తెప్పించు." వెంటనే లాలో ఇంటి నుండి రొట్టె తెప్పించారు.

ఒక చేతిలో లాలో రొట్టెముక్కను మరో చెత్తో భాగో పూరిని పట్టుకున్నాడు నానక్ - రెండింటిని గట్టిగా ఒత్తాడు. రొట్టె ముక్కలోంచి పాలు, పూరిలోంచి రక్తధారలు వచ్చాయి. మలిక్‌భాగో తన తప్పు తెలుసుకుని తన సంపదనంతా పేదలకు పంచాడు.

## వికలాంగులు, కుష్ఠురోగుల సేవ

ఓసారి నానక్ దీపాలపురం నుండి ముందుకు వెళుతూ ఒక గ్రామం చేరుకున్నాడు. సంధ్యా సమయం. ఊరి బయట పాడుబడిన గుడిసె కనబడింది. గుడిసె ముందుకువెళ్ళి "సత్‌కర్‌తార్" అనే జయఘోష చేశాడు. సమాజం బహిష్కరించిన ఒక కుష్ఠురోగి ఉన్నాడా గుడిసెలో. రోగి తలుపులు తెరిచాడు.

"ఏం సోదరా, బాగున్నావా?" గురునానక్ అడిగాడు.

రోగి పులకించి పాదాలమీద వాలాడు. "మీరు నన్ను సోదరునిగా భావిస్తున్నారా! మీరెవరో మహా పురుషులు. ఊరి వాళ్లెవ్వరూ ఈ గుడిసె ఛాయలకు రారు."

రాత్రంతా ఆరోగితో ఉన్నాడు నానక్. అతనికి సేవ లందించాడు. దేవుని మహిమలను వివరించాడు. ఆ దివ్య వాణిని విని కుష్ఠురోగి బాధనంతా మరిచిపోయాడు.

## వలీ కంధారీ కలయిక

తిరుగుతూ గురునానక్ రావల్పిండి దగ్గరి కొండ ప్రదేశం చేరుకున్నాడు. కొండమీద వలీ కంధారీ అనే ఫకీరున్నాడు. అదే కొండ మీద ఓ జల ప్రవాహమున్నది. ఫకీరు దాన్ని తన సొంతం చేసుకున్నాడు. చుట్టు పక్కల వారి జీవితాలన్నీ ఆ నీటిమీదనే ఆధారపడి ఉన్నాయి. ఫకీరుకు కోపం వచ్చినప్పుడల్లా కిందికి పారుతున్న జలమార్గాన్ని ఆపేసేవాడు.

నానక్ ఆకొండ దగ్గరకు వెళ్లినప్పుడు మర్దానా దప్పికతో అల్లాడి పోతున్నాడు. కొండపైకి వెళ్ళి నీరు తెమ్మని మర్దానా నాదేశించాడు నానక్. కొండ ఎత్తు చూస్తుంటే మర్దానాకు భయంవేసింది. అయినా పైకి వెళ్లి ఫకీరును నీళ్లు అడిగాడు. ఫకీరు అతని పేరడిగాడు. మర్దానా తన పేరు చెప్పాడు. గురువు పేరు అడిగాడు ఫకీరు. నానక్ పేరు చెప్పాడు మర్దానా. నానక్ పేరు వినగానే ఫకీరు కోపోద్రిక్తుడయ్యాడు. "ఓ హిందూ ఫకీరును గురువుగా అంగీకరించిన నువ్వేం ముస్లిమువు? పో" అనేశాడు. మర్దానా హతాశుడై తిరిగివచ్చాడు.

"నువ్వతనితో మర్యాదగా ప్రవర్తించలేదేమో నన్పిస్తుంది. మరోసారి వెళ్లిరా" అన్నాడు నానక్.

మర్దానా మళ్లీ వెళ్లక తప్పలేదు. అయినా ఫకీరు గుండె కరగలేదు. ఇంకోసారి వెళ్లి నీళ్లు అడుగమన్నాడు నానక్. పాపం మర్దానా అప్పటికే అలసిపోయాడు.

అయినా మూడోసారి వెళ్లక తప్పలేదు. ఊగుతూ వెళ్లి వలీ కంధారీని నీళ్లడిగాడు. వలీ కంధారీకి బాగా కోపం వచ్చింది. "నీ దప్పిక తీర్చమని మీ గురువుగారినే ఎందుకడగవు? నీ గురువు పవిత్రుడైతే, సహాయకారి అయితే మళ్లీ మళ్లీ నా దగ్గరికెందుకు పంపిస్తున్నాడు? ఒకవేళ అతనిలో శక్తి సామర్థ్యాలుంటే అతడే ఓ

**జీవితంలోని ప్రతిక్షణం ఉజ్వల భవిష్యత్తును వెంట తెస్తుంది.**

ప్రవాహాన్ని పుట్టించవచ్చు గదా! అలాంటి శక్తులు లేకపోతే నా వద్దకు వచ్చి క్షమాపణ కోరితే నేనే నీకు నీళ్లిస్తాను కదా!" అనేశాడు ఆవేశంగా. మర్దానా గురువు వద్దకువచ్చి వలీ కంధారీ పదజాలాన్ని వివరించాడు. నానక్ బంజరు భూమిలోనే కూచుండి ఉన్నాడు. లేచి పక్కనున్న ఓ రాయిని కాలితో పక్కకు జరిపాడు. అక్కడో గుంత తవ్వమని మర్దానా నాదేశించాడు. కొద్ది క్షణాల్లోనే నీటి ప్రవాహం పుట్టుకు వచ్చింది. మర్దానా దప్పిక తీర్చుకున్నాడు.

కొండకింద ప్రవాహం ప్రారంభం కాగానే పైన ప్రవాహం ఎండిపోయింది. వలీ కంధారీకి బాగా కోపం వచ్చింది. కొండ మీంచి ఓ బండను కిందికి దొర్లించాడు. నానక్ అంత పెద్ద బండను చెయ్యి అడ్డుపెట్టి ఆపేశాడు.

కొండమీదనుండి అంతా చూస్తున్నాడు వలీ కంధారి. ఈ చమత్కారంతో అతనిలో అహం చచ్చిపోయింది. కిందికి పరుగెత్తుకు వచ్చి నానక్‌కు నమస్కరించి మన్నించమని ప్రార్థించాడు.



## బాబర్ ఆక్రమణ

బాబర్ దండయాత్ర సమయములో నానక్ సయ్యద్‌పూర్‌లో ఉన్నాడు. యుద్ధానంతరం దోపిడీల పర్వం చెలరేగింది. నానక్, మర్దానాలు బందీలయ్యారు. నానక్ నెత్తిమీద బరువెత్తుకుని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ముందుకు సాగుతున్నాడు. అతని భజనను వింటూ ఖైదీలను కొడుతున్న మీర్‌ఖాన్ ఆశ్చర్య పోయాడు. కొట్టడం ఆపేసి నానక్ భక్తుడై క్రమశిక్షణాయుతంగా వెంటనడిచాడు.

చివరికి... ఖైదీలందరిని శిబిరంలోకి తెచ్చారు. అందరి ముందు తిరగలి నుంచారు. తిరగలి తిప్పుతూ తిప్పుతూ.... అందరి చేతులు బొబ్బలెక్కాయి. నానక్, మర్దానా కళ్లు మూసుకుని భజన చేస్తున్నారు. దాంతో తిరగళ్ళు వాటంతటవే తిరుగుతున్నాయి.

మీర్‌ఖాన్ ఆశ్చర్యాని కంతు లేదు. ఒకే పరుగులో బాబర్ వద్దకు వెళ్లి చెప్పాడు. "ప్రభూ! మన కారాగారంలోకి ఓ దైవభక్తుడు వచ్చాడు. అతని మొహమ్మీద వెలుగుంది. నోటినుండి భగవన్నామస్మరణ వినబడుతోంది. మీరు నా వెంట వచ్చి ఓసారి చూడండి."

బాబర్ వెంటనే వచ్చాడక్కడికి. నానక్ ధ్యాన ముద్రలో భగవంతుని గుణగణాలను గానం చేస్తున్నాడు. మర్దానా డక్కీ వాయిస్తూ వాతావరణాన్ని మధురంగా మార్చేస్తున్నాడు. గురునానక్ వ్యక్తిత్వం బాబర్‌నెంతో ప్రభావితం చేసింది. అతడు గానం వింటూ మైమరచి పోయాడు. క్రూరులను అహంకారులను నిందిస్తూ నానక్ పాడుతున్నాడు. తాను ప్రజల మీద చేయించిన అత్యాచారాలు గుర్తుకువచ్చి బాబర్ సిగ్గుపడ్డాడు. ఆత్మగ్లాని మనసును ఏవేవో లోకాలకు తీసుకు వెళ్లింది. గురునానక్ గానం పూర్తవగానే బాబర్ కళ్లు తెరచి చేతులు జోడించాడు. క్షమించమని వేడుకున్నాడు. విలువైన కానుకలివ్వబోయాడు కాని నానక్ తిరస్కరించాడు. నానక్ ఆజ్ఞతో బందీలందరినీ విడుదలచేశాడు.

నానక్ దేశం నలుమూలలా పర్యటిస్తూ మనిషిలోని ఏకాత్మను, పరమాత్మ తత్వాన్ని ప్రజలకు బోధించాడు. ధర్మాచార్యులతో చర్చలు సాగించాడు. తన తత్వాన్ని వారికి వినిపించాడు. ఎందరో శిష్యులై వెంటనడిచారు. నానక్ సందర్శన

**జీవితంలోని ప్రతి క్షణం ఒక సువర్ణ అవకాశం. బద్ధకస్తులు దీన్ని గుర్తించలేరు.**

సందర్భంగా ఎన్నోచోట్ల గురుద్వారాలు నిర్మించారు.

నానక్ టిబెట్, మానససరోవరమును దాటి తూర్పువైపు చైనాదాకా వెళ్లాడు. మానససరోవరము సమీపములో గోంబా గుహలున్నాయి. వాటిలో విగ్రహాలున్నాయి. అందులో ఒకటి గురునానక్‌ది. ఇతణ్ణి టిబెట్‌లో “లామా”, అమృతసర్ గురువు రింపోచా పేరుతో, భద్రగురువు పేరుతో సంబోధిస్తారు.

గురునానక్ పశ్చిమాసియాలోని సౌదీ, అరబ్, పాలస్తీనా, ఇరాక్, ఆఫ్రికా దేశాలు పర్యటించాడు. బాగ్దాద్ ఖలీఫాతో ఆసక్తికరమైన చర్చ సాగింది. ఓ సంఘటన గురించి చాలామంది చెప్పుకుంటుంటారు.

ఓరోజు ఖలీఫా గురునానక్‌ను కలిసేందుకువచ్చారు. అప్పుడు నానక్ రాళ్లు రప్పలను ఏరి కుప్పపోస్తున్నాడు.

“ఇదేమిటి?” ఆశ్చర్యంతో అడిగాడు ఖలీఫా.

“చచ్చింతర్వాత మరో లోకానికి వెళ్తాంగదా! ఆ లోకంలో ఉపయోగించాలి వీటిని” అన్నాడు నానక్.

ఖలీఫా నవ్వాడు. “ఇవి మరోలోకానికెట్లా వెళ్తాయి?” అనడిగాడు. గురునానక్ ప్రశాంతంగా జవాబిచ్చాడు.

“మీరు కూడబెట్టిన ధనమంతా వెళ్లగలిగినప్పుడు ఇవెందుకు వెళ్లలేవు?”

ఖలీఫా సిగ్గుపడ్డాడు. లజ్జాభారాన్ని మోయలేక పోయాడు. పశ్చాత్తాపంతో కూడబెట్టిన ధనాన్నంతా పేదలకు దానం చేశాడు. గురునానక్ ఖలీఫా కిచ్చిన ఉపదేశాన్ని “నసీహత్ నామా” అంటారు.

మక్కాలో నానక్ పవిత్రస్థానం వైపు కాళ్లుచాచి పడుకున్నాడు. ఎంతో మంది బాధపడ్డారు. వారితో గురునానక్ – “పవిత్రస్థానం ఏవైపున లేదో చెప్పండి. అటువైపే కాళ్లు చాస్తాను.” ఈ విషయములో ముస్లిం ధర్మాచార్యులతో సుదీర్ఘ మైన చర్చ జరిగింది.

పర్యటనలో నాగపూర్ దగ్గరలోని రాంటెక్ పట్టణానికి వెళ్లాడు. అక్కడ గాణపత్య సాంప్రదాయానికి చెందిన ఆచార్య జోగన్ ప్రకాశ్‌తో చర్చ సాగింది.

సుప్రసిద్ధుడైన సంత్ నామ్‌దేవ్‌ను గూడా కలిశాడని చెబుతారు. గురునానక్ తన యాత్రలో జంతుబలి లాంటి మూఢాచారాలను దూరం చేసే ప్రయత్నం చేశాడు.

దివారాత్రాలు భగవంతుడిని స్మరించాలనే వాడు. “సాధు సంతులను గౌరవించాలి. వారికి సేవలందించాలి. సింహంలాగా జీవించాలి. ఉదయమే పరమాత్మను స్మరించాలి. మానవ వికారాలను జయించు” అని బోధించే వాడు.

## కర్మయోగి జీవనం

నానక్ జీవితాంతం కర్మయోగిలా ఉన్నాడు. ఆధ్యాత్మిక జీవితం ఆత్మపరిశోధన కంకితం కావాలనే వాడు. జీవన సంధ్యాసమయాన్ని కర్‌తార్‌పూర్‌లో నిరాడంబరంగా గడిపాడు. వ్యవసాయం చేస్తూ రైతుగా జీవించాడు.

## భాయి లహణాజీ

ఓసారి భాయీ లహణాజీ నానక్ దర్శనం కోసం కరతార్‌పూర్ వచ్చాడు. అప్పుడాయనతో ఓ గ్రామస్తుడున్నాడు. వాళ్లెప్పుడూ అనగా ప్రతి సంవత్సరం జ్వాలాముఖి దుర్గా మందిరానికి వెళ్లేవారు. ఈ మందిరం కాంగడాలో ఉంది. అప్పుడు నానక్ తన పొలంలో పనిజేస్తున్నాడు. అతడో మామూలు ముసలి వాడనుకుని భాయీ లహణాజీ నానక్ ఇల్లెక్కడ అని అడిగాడు. లహణాజీ కూచున్న గుర్రం కళ్లాన్ని పట్టుకుని నానక్ అతణ్ణి తన ఇంటి దాకా తీసుకెళ్లాడు. లోపలికి వెళ్ళి తన స్థానంలో కూచుండి లహణాను లోపలికి పిలిచాడు. లహణాజీ ఆశ్చర్య పోయాడు. సిగ్గుతో తలవంచుకుని క్షమాపణ కోరాడు. పాదాలు తాకి మన్నించమన్నాడు.

“దాంట్లో మీ తప్పుమీలేదు. నేను నానక్‌నని మీకు తెలీదుగదా” అన్నాడు నానక్. లహణాజీ దుఃఖపూరిత స్వరంతో “కాని.... మీరు వృద్ధులు. నేను గుర్రం మీదున్నాను. మీరు నా ముందు కాలినడకన వచ్చారు. నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. మీరు చాలా గొప్పవారని తెలిపోయింది. నా అహం నన్ను గుర్రమ్మీదుంచింది. నన్ను క్షమించండి గురుదేవా.... నన్ను క్షమించండి!” అని బతిమాలాడు.

**కర్తవ్యాల విషయంలో రేపటి గురించి ఆలోచించడం అవివేకం.**

భాయీ లహణాజీకి నానక్ ధైర్యం చెప్పాడు. మర్నాడు లహణాజీ – గ్రామ ప్రజలందరూ మందిర ప్రవేశం చెయ్యాలన్నాడు. గ్రామస్తులంతా వెళ్లారు. లహణాజీ మాత్రం గురునానక్ వద్దనే ఉండిపోయాడు. లహణాజీ నియమ నిష్ఠలు, పట్టుదల నానక్‌ను అబ్బుర పరిచాయి. భాయీ లహణాజీయే ఆ తర్వాత గురు అంగద పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. తన కొడుకుల నెవ్వరినీ తన వారసుడిగా ఎన్నుకోలేదు నానక్.

డిసెంబర్ 7, 1539 నాడు గురునానక్ శరీరత్యాగం చేశాడు. అతని దేహత్యాగంతో హిందూ ముస్లిముల మధ్య వివాదం చెలరేగింది. హిందూ శిష్యులు హిందూ సాంప్రదాయంలో అంత్యక్రియలు చెయ్యాలంటే, ముస్లిం భక్తులు ఇస్లాం సాంప్రదాయ ప్రకారం పార్థివ శరీరాన్ని భూస్థాపితం చెయ్యాలన్నారు. ఇరువర్గాల వారు తగవులాడుతూ శవమ్మీద ఉన్న దుప్పటి లాగారు. దుప్పటికింద పార్థివ శరీరం స్థానంలో పూలకుప్ప కనిపించింది. ఆ పూలను హిందూ ముస్లిములు పంచుకుని అంతిమ సంస్కారం కావించారు.

గురునానక్ సంకుచిత ధార్మిక విచారధారను సమర్థించలేదు. ఏకాత్మతా భావాలను మనుషుల మనస్సులో ప్రోది చేశాడు. ఆరోజుల్లో విదేశీయుల అన్యాయాలు ఈ దేశంలో పాతుకు పోతున్నాయి. దేశ సంస్కృతి ధర్మాలను, శాస్త్ర విద్యను రక్షించుకోవాల్సిన అవసర మేర్పడింది. సమాజ శాంతి అవసరాన్ని గ్రహించిన నానక్ దేశ విదేశ పరిస్థితులను అవగాహన చేసుకున్నాడు. దేశంలో ఎక్కడెక్కడో విడివిడిగా ఉన్న సాధు సంతుల అభిప్రాయాలను, మాటలను సంగ్రహించాడు.

ఐదవ గురువు అర్జున్‌దేవు సంపాదకత్వం వహించిన ఆది గ్రంథంలో గురునానక్ ఏకత్రితం చేసిన విభిన్న సాధుసంతుల భావాలు, మాటలను పొందుపరిచారు. ఈ ఆది గ్రంథమునే గురుగోవింద్‌సింగ్ గురుస్థానంలో ప్రతిష్ఠించారు.

ఆరోజుల్లో స్త్రీలను ఘోరంగా నిందించేవారు. కాని గురునానక్ మహిళలను నిందించలేదు. స్త్రీలు చెడ్డవారైతే గొప్పగొప్ప మహారాజులకు ఎలా జన్మనిచ్చేవారు? అని సూటిగా ప్రశ్నించాడు.

ఆరోజుల్లో ఇల్లు, సంసార బాధ్యతలను వదిలేసి సన్యాసాన్ని స్వీకరించే ప్రవృత్తి బలపడింది. సాంసారిక బాధ్యతలనుండి మొహం చాటేయడాన్ని గురునానక్ సమర్థించలేదు. "మనిషి మనసు భగవంతునిలో ఉన్నా చెయ్యి మాత్రం సాంసారిక బాధ్యతలను నిర్వర్తించడంలో ఉండాలి" అనేవాడు.

గురునానక్ ఉపాసన పద్ధతి మూఢాచారాలకు, బూర్జువా పద్ధతులకు, కరడుగట్టిన అంధవిశ్వాసాలకు పూర్తిగా వ్యతిరేకం. అతని దృష్టిలో బ్రాహ్మణుల ఆధ్యాత్మికత, క్షత్రియుల ఆత్మరక్షణ, వైశ్యుల వ్యవహార కుశలత, శూద్రుల సేవాభావాలను తనలో ఇముడ్చుకున్న వ్యక్తియే ఆదర్శమూర్తి.

విదేశీ భాషలను గుడ్డిగా అనుసరించే వారిని గురునానక్ నిర్మొహమాటంగా విమర్శించేవాడు. "క్షత్రియులు ధర్మాన్ని వదిలేసినట్టు – మ్లేచ్ఛులు సొంత భాషను వదిలేస్తారు" అనేవాడు. ఆ తర్వాత గురు అంగదుడు (రెండవ గురువు) ఆ ప్రాంతంలోని ప్రాచీన లిపిని పునరుద్ధరించాడు. దానినే గురుముఖి అన్నారు.

వర్ణవివక్ష, కులగర్వం సమాజాన్ని, ఏకత్వాన్ని చిన్నాభిన్నం చేస్తాయని మానవజాతికి ఇలా బోధించేవాడు నానక్–

బ్రహ్మజ్ఞానం గురించి ఆలోచించేవాడే బ్రాహ్మణుడు కాని వర్గ, వర్ణ అభిమానంగల వాడు కాదు. తన కులం కారణంగా గర్వం ప్రదర్శిస్తే అనేక వికారాలు పుట్టుకువస్తాయి.

కులము పేర గర్వించకురా మూర్ఖుడా, ఆ గర్వమే సర్వస్వము హరించునురా!

భగవంతుడనే కుమ్మరి ఒకే మట్టితో ఎన్నోరకాల కుండల్ని తయారు చేస్తాడు. ఒకే రకమైన ఐదు తత్వాలు కలిస్తే మానవ శరీర నిర్మాణం జరుగుతుంది. ఐనప్పుడు చిన్నాపెద్దా అనే ఆలోచన ఎందుకు?

ఆయన గురువు పదవి మహత్వాన్ని అందరి గుండెల్లో ప్రతిష్ఠించాడు. అలా వ్యక్తి కంటే సంస్థ మహత్వాన్ని చాటిచెప్పాడు. నానక్ అనే వ్యక్తి వాచకం ముందురోజుల్లో సంస్థావాచకమైంది.

– కె.హరిభజన్ సింగ్ హంసపాల్

H H H

**పరమేశ్వర ఉపాసన అంటే అర్థం – తనను తాను వికసింపజేసుకోవడం.**

## యజ్ఞ విజ్ఞానం

# బ్రాహ్మణత్వానికి జనని యజ్ఞం

బ్రాహ్మణునికి ఆరు కర్మలు విధించబడ్డాయి - విద్యాభ్యాసం - విద్యాదానం, దానం ఇవ్వడం - దానం ఇప్పించడం, యజ్ఞం చేయడం - యజ్ఞం చేయించడం. ఇలా బ్రాహ్మణుని జీవితంలో మూడవవంతు యజ్ఞప్రక్రియతో సంబంధించినది. సంధ్యావందనంతోపాటు అగ్నిహోత్రంకూడా అతడి నిత్యకర్మలో చేర్చబడింది. ఈ అనుశాసనం వల్ల ప్రత్యేక ప్రయోజనం లభిస్తుంది. ప్రజాసేవతో కూడిన పరమార్థ పరాయణ జీవితం గడపడానికై శరీరమూ, మనస్సూ ఆరోగ్యంగా, సమర్థంగా ఉండాలి. యజ్ఞం సన్నిధిలో ఈ రెండూ చేకూరుతాయి.

**మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః ॥**

- (మనుస్మృతి 2/28)

*అనగా - యజ్ఞములద్వారా, మహాయజ్ఞముల ద్వారా మామూలు శరీరాలు బ్రాహ్మణులు అవుతాయి. బ్రాహ్మణుడు ఏదో ఒక ప్రత్యేక వంశంలో జన్మించడు. యజ్ఞ చికిత్సద్వారా అతడు తయారవుతాడు, మలచబడతాడు.*

మకరధ్వజ రసాయనం ప్రత్యేకత ప్రసిద్ధమైనది. దానిలోని పదార్థాలు మామూలువే. ప్రత్యేకమైన అగ్ని సంస్కార పద్ధతులద్వారా దానిని అమృతంతో పోల్చదగినదానినిగా తయారుచేస్తారు. అలాగే, నిరంతరం యజ్ఞ సంపర్కంలో ఉండే వ్యక్తి శరీర బలాన్నీ, మనోబలాన్నేకాక ఆత్మబలాన్ని కూడ సంపాదిస్తాడు. ఈ బలాలు కలిగిన వ్యక్తియే బ్రాహ్మణుడు. అతడు సర్వ సమర్థుడుగా పరిగణించబడేవాడు. అతడికి శ్రద్ధగా వందనం చేసి ఆశీస్సు కోరేవారు. ఆ ఆశీస్సు దివ్య సామర్థ్యం వల్ల ఫలించేది. ఆ సామర్థ్యాన్ని సంపాదించడానికి చేసే సాధనలో యజ్ఞ సాధన మహత్తరమైనది.

యజ్ఞంవల్ల వాయుమండలం యొక్క క్షాళన జరుగుతుంది. వాతారణంలోని విషాణువులు నశిస్తాయి. ఆరోగ్య రక్షణ జరుగుతుంది, యజ్ఞ చికిత్సవల్ల రోగనివారణ, శక్తి సంవర్ధన జరుగుతాయి. ఇతర సాధనాల వల్ల కూడ ఈ పని జరపవచ్చు. అయితే వాటిలో ఉన్నత స్థాయి సాత్వికత లోపిస్తుంది.

మద్య మాంసాలతో తయారైన ఆహార వస్తువులు కూడ ఏదో విధంగా శక్తిని పెంచవచ్చు. కానీ, వాటిలోని తామసికత వాడిన వ్యక్తి శరీరంలో ప్రవేశిస్తుంది. ఫలితంగా - అలా లభించిన సామర్థ్యం నికృష్ట స్థాయి దుష్టప్రవృత్తులను ప్రోత్సహించే దిశలో వినియోగపడుతుంది. వాడిన వ్యక్తి చివరికి నష్టపోతాడు. ఉత్కృష్టత తోడయినపుడే బలిష్టత వల్ల నిజమైన ప్రయోజనం లభిస్తుంది. యజ్ఞం ద్వారా సూక్ష్మీకరించబడిన సామర్థ్యం ఉదాత్త లక్ష్యాలకోసం వినియోగించబడుతుంది.

ఆత్మపరమైన ఈ బలిష్టత బ్రాహ్మణునికి తప్పనిసరి అయిన ఆవశ్యకత. అతడు లౌకిక సుఖ భోగాలలో మునిగితేలే జీవి కాడు. ఉత్కృష్టమైన ఆలోచనలలో, శ్రద్ధతో నిండిన భావనలలో ఓలలాడే దేవత అతడు. బ్రాహ్మణుని గరిమను పొందడం ప్రతి ఒక్కరికీ సాధ్యమయ్యే పని కాదు. ఉత్కృష్టత, యోగ్యతల గీటురాయిపై అతడి ఆచరణ పరీక్షించబడుతుంది. ఎక్కడ ఏమాత్రం జారినా అతడు ఆ పదవిని కోల్పోతాడు.

ఈ వాస్తవాలను మళ్లీ మళ్లీ స్మరింపజేయడానికై బ్రాహ్మణునికి యజ్ఞ కర్మ తప్పనిసరి చేయబడింది. యజ్ఞం వల్ల సాంగత్యం చేసే గుణం లభించడం సహజం. అగ్ని సన్నిధిలో సంపాదించే వేడిమి, తేజస్సు, ఊర్ధ్వచింతన, పరమార్థ భావం అతడికి యజ్ఞ భగవానునినుండే లభిస్తాయి.

ఈ వాస్తవాన్ని గుర్తించి, దీన్ని తన ఆచరణలోనికి మలచుకున్నవాడే బ్రాహ్మణుడని పిలువడానికి అర్హుడు.

H H H

**పరమేశ్వర ఉపాసన, ఆత్మశాంతి-ఇవి ఒకే వస్తువుకు రెండు వైపులు.**

సాధన విజ్ఞానం

# ఉపాసనకన్న జీవన సాధన మిన్న

రైతు పొలంలో విత్తనం వేయడానికి ముందు దానిలో నీళ్లు నింపుతాడు. దాన్ని బాగా దున్నుతాడు. దానిలో కలుపు తీస్తాడు. దానికి  ఎరువు వేస్తాడు. అప్పుడు పొలం పదునుకు వస్తుంది. అప్పుడు నాట్లు వేస్తే పంట పండే అవకాశం ఏర్పడుతుంది.

ఉపాసన మనోభూమిలో మొలిచే విత్తనం. రైతు భూమిని సంస్కరించే విధంగా - మనో భూమిని సంస్కరిస్తే, ఆ విత్తనం ఫలించి పుష్పిస్తుంది. మనో భూమిని క్షాళన చేయకుండా వేసిన ఉపాసనా బీజం వరదల్లో వేసిన విత్తనంలా కుళ్లి కృశించి నశించిపోతుంది; లేదా దాన్ని పక్షులూ, ఎలుకలూ, అడవి జంతువులు తినివేస్తాయి.

ఉపాసనకు ఎంత ప్రాముఖ్యం ఉన్నదో సాధనకు అంత ప్రాముఖ్యం ఉన్నది. కనుక, మనం ఉపాసనతో పాటు సాధనకు కూడ విలువ ఇవ్వాలి. జీవితాన్ని పవిత్రంగా, సంస్కారయుతంగా, సంయమయుతంగా, సంతులనం కలిగినదిగా, ఉత్కృష్టంగా, ఆదర్శవంతంగా మలచుకోవడానికై మన గుణ కర్మ స్వభావాలను ఉన్నత స్థాయికి కొనిపోవడం కోసం నిరంతరం కృషి జరపాలి. ఈ కృషి పేరే జీవన సాధన, లేక సాధన.

నిర్ణీత సమయంలో కార్యకలాపాలను పూర్తిచేయడం ద్వారా ఉపాసన - పూజను ముగించవచ్చు. కానీ, సాధనను 24 గంటలూ సాగించవలసి ఉంటుంది. మన ప్రతి ఆలోచనపై, ప్రతి చర్యపై ఒక కాపలాదారులా నిఘావేసి ఉంచాలి. అనుచితమూ, అనుపయుక్తమూ అయినది ఏదీ జరగకుండా మెలకువ వహించాలి. పొరపాటు కనబడితే దాన్ని వెంటనే సరిదిద్దడం, వికృతి ఏర్పడితే దానిని తక్షణమే సంస్కరించడం, పాపం జరిగితే దానిని ప్రతిఘటించడం - ఇదే సాధన. సరిహద్దు గస్తీ సైనికుడు శత్రువు ఎత్తుగడలనూ మాటలనూ పసిగట్టి వాటిని వమ్ము చేయడానికి అనుక్షణం సర్వసన్నద్ధంగా ఉంటాడు. అలాగే - జీవన సంగ్రామంలోని ప్రతి రంగంలో మనం మెలకువగా, తత్పరతతో ఉండాలి. ఈ తత్పరతయే సాధన.

భజన చేసినంత మాత్రాన పాపాలు నశిస్తాయనీ, దేవుడు ప్రసన్నుడు అవుతాడనీ, కనుక జీవితాన్ని పరిశుద్ధం చేసుకోవడం, అది పెడదారి పట్టకుండా చూడడం అవసరం లేదని భావించడం పొరపాటు. ఈ భ్రమ మనకు అధ్యాత్మయొక్క ప్రయోజనాలు అందకుండా చేసింది. ఈ భ్రమను తొలగించుకోవాలి. ఉపాసన, సాధనలు ఆధ్యాత్మిక ప్రగతికి విడదీయరాని అంగాలనే నిర్ణయానికి రావాలి. భారతీయ అధ్యాత్మయొక్క తత్వజ్ఞానం ఇదే. ఋషుల అనుభవం బోధిస్తున్నది ఇదే. ఉపాసన, సాధనలు ఒకదాన్ని మరొకటి పూరిస్తాయి. ఆహార పానీయాలు, రాత్రిం బవళ్లు, శీత ఉష్ణములు, స్త్రీ పురుషులు పరస్పర ఆశ్రితాలు. అలాగే ఉపాసన, సాధనలుకూడ ఒకదానిపై మరొకటి ఆధారపడినవి. ఒకటి లోపిస్తే రెండవది ఒంటరిగా, నిస్సహాయంగా, అసంపూర్ణంగా మిగిలిపోతుంది. కనుక - రెంటినీ కలుపుకుని అధ్యాత్మ మార్గంలో పురోగమించడం సముచితం, ఆవశ్యకం.

గాయత్రీ ఉపాసకుని జీవన విధానం ఉత్కృష్టంగా, ఆదర్శవంతంగా, సంస్కరించబడినదిగా ఉండితీరాలి, మాదక పదార్థాలు సేవిస్తే మత్తు రావలసిందే. అలాగే - భక్తి ప్రభావం సజ్జనత్వంగా, ప్రగతిశీలతగా కనిపించితీరాలి. కనుక మన ఉపాసనా విధానం సర్వతోముఖంగా ఉండాలి. ఆత్మపరీక్ష, ఆత్మ సంస్కరణ, ఆత్మ నిర్మాణం, ఆత్మ వికాసముల పరిపూర్ణ ప్రక్రియ అందులో మిళితమై ఉండితీరాలి. ఉపాసన, సాధనలకు స్వతంత్రమైన మనుగడ ఉంది. ఒకటి చేస్తే రెండవది పూర్తవుతుందని భావించడం తగదు.

గాయత్రి యొక్క భావనాత్మక పూజయే ఉపాసన. సదాచరణ ద్వారాకూడ ఈ ఉపాసన జరపవచ్చు. మనం పాపరహితులముగా ఉంటే సరిపోదు. మన పనులలో, మన స్వభావంలో సద్గుణాలను నింపాలి. మన జీవితాన్ని దివ్య జీవనంగా మలచాలి. మన జీవితంద్వారా మనకూ, మొత్తం సమాజానికీ మంచి జరగాలి. వ్యక్తిత్వాన్ని సంస్కరించుకోవడంద్వారానే, వికసింపజేసుకోవడం ద్వారానే మనం ఆత్మిక ప్రగతి సాధిస్తాం; పూర్ణత్వాన్ని పొందడంలో సాఫల్యం పొందుతాం. HHH

**కషాయ కల్మషాలకు రామబాణం ఉపాసన.**

వ్యక్తి నిర్మాణం

# నిరాడంబరతలో నిజమైన ప్రగతి

ఎప్పుడైతే మనిషి తన జీవితాన్ని సంక్లిష్టంగా, ఆడంబరంగా తయారుచేసుకుంటాడో అప్పుడే అతని జీవితంలో కష్టాలు ప్రారంభమవుతాయి. జీవితాన్ని తేలికగా చేసుకోవటంలోనే ఆనందం ఉంది. మన వ్యవహారంలో, ఆలోచనలో, ఆచరణలో స్పష్టత ఉన్నట్లయితే, మన జీవితంలో ద్వేషభావాలకు, కఠినమైన పరిస్థితులకు తావు ఉండదు.

## ఆడంబరాలతో అష్టకష్టాలు

నిరాడంబరత అంటే వాస్తవికతను అవలోకించటం. మనం యథార్థాన్ని విస్మరించి దానికి భిన్నంగా వ్యవహరించటం వలన క్లిష్ట పరిస్థితులు తలెత్తి అనేక రకాలైన సమస్యలకు కారణభూతాలవుతాయి. మీరు ఈ గుమాస్తాకు సంబంధించిన కథగాని చదివారా? ఒక గుమాస్తా గొప్పలకుపోయి తనది గుమాస్తా ఉద్యోగం అంటే తన భార్య చిన్నచూపు చూస్తుందని భావించి, తను చేసే ఉద్యోగం దాచిపెట్టి, తనకు మంచి జీతం వస్తుందని గొప్పలు చెప్పాడు. అసలు నిజాన్ని దాచిపెట్టి దాంపత్య జీవితంలో భర్తీచెయ్యలేని లోటును సృష్టించుకున్నాడు. ఒక పెళ్లికి వెళ్లటానికి అతని భార్య ఒక హారం కావాలని అడిగింది. గుమాస్తాగా తనకు వచ్చే జీతంలో అతను దానిని సమకూర్చలేడు. కాని చెప్పిన అబద్ధాన్ని నిజం చెయ్యటం కోసం తెలిసిన వాళ్ల దగ్గరనుండి హారాన్ని అరువు తీసుకొని తన భార్య కోరిక తీర్చాడు. కాని దురదృష్టవశాత్తు ఆ హారం ఆ పెళ్లిలో పోయింది. తనకు వచ్చే జీతంలో సగభాగం దానికి పరిహారం కట్టడంతోనే సరిపోయింది. మిగిలిన సగం జీతంలో కుటుంబాన్ని గడపలేక అతను చాలకాలం లేమితో బాధపడాల్సి వచ్చింది.

నేడు సమాజంలో ఎటు చూసినా ఇటువంటి కథలు కోకొల్లలుగా కనిపిస్తాయి. సామాన్య జీవితం నుండి పండుగలు, పెళ్లిళ్లవరకు, విద్యార్థి జీవనశైలి నుండి సమాజంలో వ్యవహరించే తీరు వరకు అన్ని చోట్లా ప్రదర్శన ఎక్కువయింది. ఒక వ్యక్తి రాబడి రోజుకి రూ.50/- అయితే, దానిని దాచిపెట్టి తనకి రోజుకి రూ.150/- రాబడి వస్తుందని చెప్పుకోవటాన్ని గొప్పగా భావిస్తున్నాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినా బయటకు వెళ్లటానికి ఖరీదైన మంచి బట్టలు కావాలని కోరుకొంటున్నాడు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల వల్ల కుటుంబంలో, సమాజం, దేశంలో అనేక రకాలైన సమస్యలు ఎదురవుతున్నాయి, అంతేకాక మనిషి మనుగడ భారంగా తయారవుతోంది. దీనివల్ల తనకు ప్రశాంతత లేకపోగా మిగతా వాళ్లకు శాంతి కరువవుతోంది. దాంపత్య జీవితంలో అసూయా ద్వేషాలు, కుటుంబంలో కలహాలు, కర్కశ స్వభావం, వ్యక్తిగత జీవితంలో విసుగు, ఉద్రేకం, అవ్యవస్థ, అధిక ఖర్చులు, పిల్లలు సరిగ్గా చదవకపోవడం వంటి అనేక సమస్యలు మనిషి తన స్థాయిని మరచి లేనిపోని గొప్పలకుపోవడం వల్ల తలెత్తుతాయి. ఈ ఆడంబర ప్రదర్శన ఎక్కడ మొదలవుతుందో అక్కడ జీవితంలో హాని తప్పకుండా కలుగుతుంది. దీనివల్ల మనిషి జీవితం కష్టాలు, ఆందోళనలనే సుడిగుండంలో చిక్కుకుంటుంది.

## మానవీయ గుణాల వికాసం ముఖ్యం

మనిషి ఈ అహంకారాన్ని వదిలిపెడితే, అతని జీవితంలో నిరాడంబరత రావటం ప్రారంభమవుతుంది. దీనివల్ల అతనికి ఎటువంటి హాని జరుగదు. జనం చిన్నచూపు చూస్తారన్న భావన ఉండదు. ఋషులు చాలా సామాన్యమైన, నిరాడంబరమైన జీవితాన్ని గడిపేవారు. అందువల్ల వారికి సర్వత్రా గౌరవం లభించేది. అహంకారం, ప్రదర్శన సమాజంలో ఎప్పుడూ విమర్శకు గురవుతాయి. నకిలీ ప్రదర్శన చేసే వాళ్లను చూసి అందరూ నవ్వుతారు. ఎవరి వ్యక్తిత్వమైతే యథార్థంగా, పారదర్శకంగా ఉంటుందో వారి జీవితం అందరికీ ఆదర్శప్రాయం, అనుకరణీయం అవుతుంది. వారి వ్యక్తిత్వం ఇతరులకు ఉదాహరణగా నిలుస్తుంది. కష్టాలు వారి నుంచి దూరమవుతాయి. వారు ఆనందంగా జీవితాన్ని గడుపుతారు.

దేనినైతే మనం స్వాభిమానం, ఆత్మగౌరవం అంటామో అది సామాన్య జీవితం గడపటం వల్ల సహజంగా వచ్చే లక్షణం. మనం ఏ పరిస్థితుల్లో ఉన్నామో, ఆ పరిస్థితుల పట్ల సంతృప్తి చెందినట్లయితే ఇతరుల దగ్గరకు వెళ్లి చెయ్యి చాపాల్సిన అవసరం

ప్రేమ రథానికి చక్రాలు రెండు : త్యాగం, సేవ Ð ª•Ëq° <¬°O^Î~¡K³á`Ç<Œ/#O^Î.

రాదు, వాళ్ల సహాయం తీసుకోవాల్సిన అవసరం కలగదు. ప్రజలకి బయటకు కనిపించే ఆడంబర ప్రదర్శనతోనే సమయం సరిపోవట్లేదు. ఇక ఆధ్యాత్మిక చింతన ఎట్లా జాగృత మవుతుంది? మంచి లక్షణాలు వృద్ధి చెందకపోవటానికి కారణం కూడా ఇదే. ఎందుకంటే – జనం తమ గొప్పలు చెప్పుకోవటాన్ని, ప్రదర్శనని జీవిత ధ్యేయాలుగా భావిస్తున్నారు. ఈ ప్రదర్శన వల్ల లభించే గౌరవాన్ని చూసి ఉప్పొంగిపోయి గర్వాన్ని, ఆనందాన్ని అనుభవిస్తున్నారు. మన బుద్ధిని వ్యక్తిత్వ వికాసానికి, ఆధ్యాత్మిక శక్తుల జాగరణకు వినియోగించాల్సిందిపోయి బాహ్య ఆడంబరాలతోనే మనం సరిపుచ్చుకుంటున్నాం. బౌద్ధికంగా మనం ప్రగతి సాధించినా, మానసికంగా మనం పతనానికి దగ్గరవుతున్నాం. నైతిక దృష్టితో చూస్తే – అటువంటి వ్యక్తులను మనం వెనకబడినవారుగానే పరిగణించాల్సి ఉంటుంది.

మన ఆహార విహారాలలో, మన వ్యవహారంలో, మనం ధరించే దుస్తులలో నిరాడంబరత చాలా అవసరం. మానవ జీవితానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. దానిని మరువకూడదు. ఆత్మశక్తిలో ఎదగటం మనిషికి చాలా అవసరం. వ్యక్తి జీవితంలో స్నేహం, ప్రేమ, ఆత్మీయత, దయ, కరుణ, ఉదారత, సాహార్ధ్రత ఉండాలంటే అతని జీవితంలో స్వచ్ఛత, నిరాడంబరత ఉండాలి. వీటివల్ల అతని మానసిక స్థైర్యం పెరుగుతుంది. అతనిలోని దైవీ శక్తులు వికాసం చెందుతాయి. ఆ శక్తులవల్ల ఆ వ్యక్తిలోని మానవీయ గుణాలు దినదిన ప్రవర్ధమాన మవుతాయి.

## సత్యానికి మరో రూపం నిరాడంబరత

సంక్లిష్టత వల్ల జీవన శక్తి వృధా అవుతుంది. నిరాడంబరత మన ఆత్మస్థాయిని పెంచుతుంది, మన అంతఃకరణాన్ని విశాలం చేస్తుంది. సత్యం యొక్క వ్యవహారిక రూపం నిరాడంబరత. నిరాడంబరతవల్ల మనిషి విశాల హృదయు డవుతాడు; అతని ఆలోచనలు సంస్కరించబడతాయి. ఎప్పుడైతే అతడు అంతర్ముఖుడవుతాడో, అతడికి ప్రపంచమంతా స్వచ్ఛంగా, స్పష్టంగా కనిపిస్తుంది. ప్రపంచాన్ని యథాతథంగా చూడటమే ఆత్మయొక్క లక్ష్యం. ఎవరైనా వ్యక్తి సర్వత్రా వ్యాపించి ఉన్న సద్గుణాలను తన జీవితంలో ఆహ్వానించటం మొదలుపెడితే, అతడు భగవంతునికి దగ్గర అవుతాడు. మనిషి జీవితంలో మిథ్య, అహంకారాలు చోటుచేసుకున్నప్పుడు అతను వాస్తవం నుండి దూరమవుతాడు. అంతేగాక నాస్తికత అనే విషవలయంలో చిక్కుకొని జీవితాన్ని కష్టాలపాలు చేసుకుంటాడు.

మానసిక అశాంతికి కారణం ఏమిటి? ప్రపంచంలోని పదార్థాలన్నీ వాటి వాటి స్వభావాలను వదిలేసి తనకు అనుకూలంగా ప్రవర్తించాలని మనిషి కోరుకొంటాడు. కాని పదార్థాలు అలా ప్రవర్తించలేవు. ప్రకృతి తమకు విధించిన నియమాలకు అవి ఉల్లఘించలేవు. పదార్థం మనిషి కోరికలను తీర్చలేకపోవటంవల్ల అతను దుఃఖానికి లోనవుతున్నాడు. అందుబాటులోని వస్తువులకు అనుగుణంగా తన అవసరాలను మార్చుకున్నట్లయితే మనిషి ఇంత బాధపడాల్సిన అవసరం ఉండదు. కాని పరిస్థితుల కనుగుణంగా మనస్సుని అదుపులో ఉంచుకున్నప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. మన ఆశలు, కోరికలు మన స్థాయికి మించినవి కానట్లయితే, అవి మన ప్రగతికి అవరోధాలు కావు. శక్తి సామర్థ్యాలు, సంపద మనకు గౌరవాన్నిస్తాయి కాని, అవి ప్రదర్శనకు పరిమితం కాకూడదు. యథార్థంగా ఉండాలి.

## కోరికలపై అదుపు తప్పనిసరి

మనిషి ప్రతివస్తువు మీద తన అధికారాన్ని వదిలిపెట్టి, పరిస్థితులతో మమేకమైనప్పుడు, అతనికి తన మనస్సులోని శూన్యం అనుభవంలోకి వస్తుంది. వినమ్రత, వివేకం, ధైర్యం, కరుణ వంటి సద్గుణాలు జాగృతం అవుతాయి. ఆత్మానుభూతి అద్దంవంటిది, దానికి ఎటువంటి తర్కాలతో పనిలేదు. సంక్లిష్టత, దుర్గుణాలు, చెడు ఆలోచనలవల్ల పాప ప్రవృత్తి ఉత్పన్నమవుతుంది. అంతరంగం ఎటువంటి కల్మషం లేకుండా స్వచ్ఛంగా ఉంటే, బాహ్య జీవితంలో అహంకారం మచ్చుకైనా లేనట్లయితే – ఆ వ్యక్తి జీవితం శాంతికీ, దైవీగుణాలకూ ఆలవాలమవుతుంది.

ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలు అధిరోహించటానికి, నిజమైన ఆనందాన్ని పొందటానికి రాజమార్గం కోరికలను అదుపులో పెట్టుకోవటం. కోరికలకు దాసులై, వాటిని తీర్చుకోవడం కోసం ఉచితానుచితాలు మరచి తమ ప్రయత్నాన్ని కొనసాగించే వారి ఆత్మ చాలా బలహీనంగా ఉంటుంది. కోరికల మాయాజాలాన్ని తిరస్కరించి కేవలం ఔచిత్యం మీద ధ్యాస పెట్టినప్పుడు మాత్రమే మనిషి దీనినుండి తప్పించుకోవటం సాధ్యమవుతుంది.

అనువాదం: ఉషా సుందరి

H H H

**తనను తాను పూర్తిగా దేవునికి సమర్పించుకునే జీవునికే దేవుడు తనను తాను పూర్తిగా సమర్పించుకుంటాడు.**

భాగవత బోధ

# మానవజన్మ లభించడం మహాభాగ్యం

## మానవ జన్మ మహిమ

ఒకసారి లక్ష్మి విష్ణుమూర్తిని ఇలా అడిగింది – "ప్రభూ! మీరు రూప, గుణాలకు అతీతులు. అయినా, అవతారాలు ధరించడంకోసం మీరు మానవ శరీరాన్ని ఎందుకు ఎంపిక చేస్తారు?" విష్ణుమూర్తి నవ్వుతూ ఇలా జవాబిచ్చాడు – "దేవీ! మనిషి శరీరంలో ఎన్నో ప్రత్యేకతలు, ఎన్నో గుణగణాలు ఉన్నాయి. వాటిద్వారా నా పని తేలికవుతుంది. కనుక నేను మనిషిగా పలుమారులు అవతరిస్తాను."

కనుక – మనిషి శరీరం ఎంతో గొప్పది. అయితే – శరీరం అంటే ఎముకల గూడు కాదు. అతడిలో సూక్ష్మ శరీరం (బుద్ధి), కారణ శరీరం (సంవేదనలు) ఉన్నాయి. దత్తాత్రేయ భగవానుడు యదు మహారాజుకు ఇలా బోధిస్తాడు – "భగవంతుడు పశు పక్షులను, వృక్షాలను సృష్టించాడు. అయినా ఆయనకు తృప్తి కలుగలేదు. కనుక – ఆయన మనిషిని సృష్టించాడు. బ్రహ్మసాక్షాత్కారాన్ని పొందే సామర్థ్యం మనిషిలో ఉంది. అతడిని సృష్టించి, భగవంతుడు ఎంతో ఆనందం పొందాడు."

## సంయమనం ప్రధానం

అయితే, మనిషి జీవితం సద్వినియోగం కావాలంటే అతడి శరీరం, మనస్సు ఆరోగ్యంగా ఉండాలి. వీటిని దుర్వినియోగపరచితే, ఇవి చెడిపోతాయి. కృష్ణ పరమాత్మ గరుడునికి ఇలా బోధిస్తాడు – "ఓ గరుడా! వేదం మనిషిని వంద సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా శతాయువుగా వర్ణించింది. కానీ, చెడు కర్మల ప్రభావంవల్ల అతడు అంతకు ముందుగానే చనిపోతాడు."

జీవించడం అంటే ఏదోవిధంగా బ్రతకడం కాదు. జీవితం అంటే క్రియాశీలత, తీక్షణత. కాగా – మనిషి శరీరానికీ, మనస్సుకూ అవినాభావ సంబంధం ఉంది. శరీరంలో ఏదో వికారం ఏర్పడినా, మనస్సు దాన్ని తొలగించడానికి సంకల్పిస్తే – ఆ వికారం నిలబడదు. ఆది శంకరులకు భగందర వ్రణం, వినోబాజీకి కడుపులో అల్సరు ఉండేవి. అయినా ఆ ఇద్దరూ మానసిక సంకల్పంవల్ల రోగ స్థితిలో ఉండిపోకుండా జీవితమంతా క్రియాశీలంగా ఉన్నారు. రోగాల రహస్యం తెలియని జనం ఔషధాలద్వారా ఆరోగ్యం పొందడానికి ప్రయత్నిస్తారు. ఔషధాలు కొద్దో గొప్పో సాయపడవచ్చు. అయితే, నిజమైన ఆరోగ్యం నియమిత జీవనంలో, సంయమనంలో ఉంది. ఒక రాజు ఒక గ్రామంలో ఆసుపత్రి స్థాపించాడు. ఒక సంవత్సరం వరకు అక్కడికి రోగులెవరూ రాలేదు. ఆ గ్రామ ప్రజలు నియమ, సంయమనాలు పాటిస్తారనీ, కనుక వారికి రోగాలు రావనీ– విచారించగా అతడికి తెలిసింది.

## మోక్షానికి పది సాధనాలు

శుక యోగి ఇలా ఉపదేశించాడు – "ఓ పరీక్షిత్తు మహారాజా! ఆహారాన్ని పథ్యంగా తీసుకునే వ్యక్తికి రోగం రాదు. నియమ పాలన చేసేవారు క్రమక్రమంగా ఆత్మకళ్యాణ స్థితిని పొందుతారు. శరీరంతో, మాటతో, బుద్ధితో శ్రద్ధగా శ్రేష్ఠ నియమాలను పాటించే వారి గొప్పగొప్ప పాపాలు సైతం నశిస్తాయి. రుచికోసం కాక, ఆరోగ్యం కోసం భోజనం చేయాలి. రోగం పాపాల ఫలితం, చెడు కర్మల ఫలితం."

ప్రహ్లాదుడు ఇలా చెపుతాడు – "ఓ పురుషోత్తమా! మోక్షానికి సాధనాలు పది: మౌనం, బ్రహ్మచర్యం, శాస్త్ర శ్రవణం, తపస్సు, స్వాధ్యాయం, స్వధర్మ పాలన, తర్కం ద్వారా శాస్త్రాలపై వ్యాఖ్య, ఏకాంత సేవనం, జపం, సమాధి."

దత్తాత్రేయ భగవానుడు యదు మహారాజుకు ఇలా బోధిస్తాడు – "సవతులు తమ భర్తను తమతమ వైపులకు లాగుకుంటారు. అలాగే – జీవుణ్ణి నాలుక రుచికరమైన పదార్థాలవైపు లాగుతుంది. దాహం నీళ్ల వైపు, జననేంద్రియం వాసనలను తీర్చుకోవడం వైపు లాగుతూ ఉంటాయి. చర్మం మెత్తని స్పర్శవైపు, కడుపు భోజనంవైపు, చెవి మధుర శబ్దంవైపు లాగుతూ ఉంటాయి. ముక్కు సువాసన వైపు, కళ్లు అందం వైపు లాగుతూ ఉంటాయి."

ఇంద్రియాలకు ఆలోచన యొక్క సమర్థన దొరికినప్పుడే అవి ఈ విధంగా బలీయం అవుతాయి. ఫలితంగా – మనిషి వ్యక్తిత్వం దిగజారిపోతుంది. శుక మహర్షి పరీక్షిత్తు మహారాజుకు ఇలా బోధిస్తాడు – "విషయాలను గురించి ఆలోచిస్తూ ఆలోచిస్తూ, అతడు విషయంగా మారుతాడు. అతడి జీవితం వృక్షంలా తయారవుతుంది. అతడి శరీరం లోహకారుడు వాడే తిత్తి అవుతుంది. అతడు

**మానవుడు–కోరిక = దేవుడు.**

ఆత్మవంచనకు లోనవుతాడు."

## లక్ష్యాన్ని మరచిన వ్యక్తి జీవచ్ఛవం

ఇలా - తన జీవన లక్ష్యాన్ని మరచిన వ్యక్తి జీవచ్ఛవమే. మనిషి గొప్పతనం అతడి మానవత్వంలో, అతడి జ్ఞానంలో, అతడి ఆత్మబోధలో ఇమిడి ఉంది. అతడి మనస్సు ఇంద్రియాలను సమర్థించడంలో మునిగిపోతే - అతడి శక్తి ఆ దారిలో నడుస్తుంది. అతడి శక్తి మానవీయమైన లక్ష్యాల కోసం వినియోగపడదు.

సనత్కుమార భగవానుడు పృథు మహారాజుకు ఇలా బోధిస్తాడు - "విషయ చింతనలో మునిగిపోయిన వ్యక్తుల ఇంద్రియాలు విషయాలలో చిక్కుకుంటాయి. మనస్సును తమవైపు లాగుకుంటాయి. నదీ తీరంలో మొలిచే మొక్కలు తమ వ్రేళ్లతో ఆ నది నీటిని పీల్చివేస్తాయి. అలాగే - ఇంద్రియాలలో ఆసక్తి కలిగిన మనస్సు బుద్ధియొక్క ఆలోచనా శక్తిని క్రమంగా పీల్చివేస్తుంది."

మనిషిని మానవత్వపు స్థాయికి చేర్చేవి అతడి బుద్ధి, మనస్సు. ఇంద్రియాలు అదుపుతప్పడంవల్ల అతడి శక్తి నిరర్థకమైన పనుల కోసం ఖర్చవుతుంది. మనిషి ఇంద్రియాలను ఉపయోగించవలసిందే. అయితే - సంయమనంద్వారా వాటిని అదుపులో ఉంచాలి. కృష్ణ పరమాత్మ తన బాల్య మిత్రులకు ఇలా బోధిస్తాడు - "మిత్రులారా! చూడండి. రైతులు పొలాల గట్టులను బలపరచి, నీరు పారకుండా చేస్తున్నారు. అలాగే - యోగులు విషయాలవైపు వెళ్లకుండా ఇంద్రియాలను అదుపుచేసి, ప్రత్యాహారం చేసి, తరుగుతూన్న జ్ఞానాన్ని రక్షిస్తారు."

## కాపలాకుక్కలా మారిన మనిషి

వాస్తవానికి అజ్ఞానం వల్లనే విషయాల గురించిన ఆలోచన జరుగుతుంది. బయటి వస్తువులను సేకరించి ఉపయోగించడం ద్వారానే తనకు గొప్పతనం వస్తుందని మనిషి అనుకుంటాడు. అతడు తన ఆంతరికమైన గొప్పతనాన్ని మరచిపోతాడు. కానీ - తక్కువ సాధనాలతో మహత్కార్యాలను సాధించడమే విజ్ఞత. రాజసూయ యజ్ఞం తర్వాత నారదుడు యుధిష్ఠిరునికి ఇలా బోధిస్తాడు - "యుధిష్ఠిరా! రసనేంద్రియం (నాలుక), జననేంద్రియముల వలలో చిక్కుకుని మనిషి కాపలా కుక్కలా తయారవుతాడు." నాలుకను గెలువగలిగితే - మనిషి కనీస ఖర్చుతో పౌష్టిక ఆహారాన్ని భుజించగలుగుతాడు. కామేంద్రియాన్ని వశపరచుకుంటే - మనిషి జీవన రసాన్ని కాపాడుకోగలుగుతాడు. అధిక జనాభా సమస్యను కూడ పరిష్కరించగలుగుతాడు. ఇంద్రియాల కోరికలను తీర్చడంద్వారా ముందుకు పోగలుగుతానని, సంతోషం పొందగలుగుతానని జనం భావిస్తారు. కానీ, ఇది వట్టి భ్రమ మాత్రమే. వామన భగవానుడు శిబి చక్రవర్తికి ఇలా బోధిస్తాడు - "ఓ రాజా! ప్రపంచంలోని అత్యంత ప్రీతికరమైన వస్తువులన్నీ కూడ ఒక్క మనిషి కోరికలను సైతం తీర్చలేవు - అతడు తన ఇంద్రియాలను అదుపుచేసే సంతృప్తిపరుడు కాకపోతే."

ఈ మాట అక్షర సత్యం. నారదుడు యుధిష్ఠిరునికి ఇలా ఉపదేశిస్తాడు - "హిరణ్యకశిపుడు దిగ్విజయాలు చేశాడు. ఏకైక సమ్రాట్టు అయినాడు. తనకు ఇష్టమైన విషయ సుఖాలను అనుభవించాడు. అయినా అతడికి సంతృప్తి కలుగలేదు. ఎందుకంటే - చివరికి అతడు ఇంద్రియాలకు దాసుడు అయిపోయాడు."

## దాసుడుగా మారిన యజమాని

తన స్థాయిని కోల్పోయినపుడు మనిషి యొక్క అంతఃకరణ సంతృప్తిగా ఉండజాలదు. వాస్తవానికి మనిషి తన ఇంద్రియాలకు యజమాని. కానీ, ఉచితానుచితాలను మరచి, ఇంద్రియాలను సంతృప్తిపరచడంలో మునిగిపోతే అతడు వాటికి దాసుడు అవుతాడు. దాసుడుగా మారిన యజమానికి సంతృప్తి ఎలా ఉంటుంది? అతడికి పశ్చాత్తాపం తప్ప మరో దారి ఉండదు. పురూరవ మహారాజు ఊర్వశి మోహంలో పడ్డాడు. ఆమె ఆయనను చూచి వెళ్లిపోయింది. ఆయన కలత చెందాడు. కానీ, ఆయన అంతరాత్మ ఆయనను మేలుకొలిపింది. తన మోహం వల్ల తాను పతనం చెందినట్లు ఆయన అంగీకరించాడు. ఆయన ఇలా ఆలోచించాడు - ఈ శరీరం చర్మం, మాంసం, రక్తం, స్నాయువులు, మేద, మజ్జ, ఎముకలతో ఏర్పడిన పంజరం. మల, మూత్రాలతో నిండినది. మనిషి దీని ఆకర్షణకు లొంగితే - కీటకాలకూ, అతడికీ తేడా ఏముంది? శరీరాన్ని ఉపయోగించడం మంచిదే. కాని శరీరానికి అతీతమైన చేతన విషయంలో ఆలోచించకపోవడం, పనిచేయకపోవడం జరిగితే - అతడి మనస్సు కీటకం మనస్సులా మారుతుంది.

మనిషి అంతఃకరణ పశు పక్ష్యాదుల స్థాయితో, క్రిమి కీటకాల స్థాయితో ఎన్నడూ సంతృప్తి చెందజాలదు. మనిషి ఎన్ని లౌకిక సాధనాలను సంపాదించినా - ఈ సంతృప్తి లోపిస్తే, అతడు నరకాన్ని అనుభవిస్తాడు. నారదుడు యుధిష్ఠిరునికి ఇలా బోధిస్తాడు - అనేక విషయాల పరిజ్ఞానం కలిగిన వ్యక్తిసైతం, అనుమానాలను తొలగించి శాస్త్రాల అర్థాలను విప్పిచెప్పగలిగే వ్యక్తిసైతం, విద్వత్ సభలకు అధ్యక్షత వహించే వ్యక్తి సైతం అసంతృప్తివల్ల పతనం చెందవచ్చు.

**శరీరం పొలం. మంచి పనులు విత్తనాలు. నామస్మరణ నాగలి. హృదయం రైతు. పండించే పంట దేవుడు.**

## పాండిత్యం వేరు, ఆత్మోన్నతి వేరు

పాండిత్యం ఒక ఎత్తు. ఆత్మోన్నతి మరో ఎత్తు. రావణుడు కూడ విద్వాంసుడే. ఇతరుల ధనాన్నీ, స్త్రీలనూ పొందాలనే లాలస అతడిని ముంచివేసింది.

అంతఃకరణలోని అసంతృప్తిని తొలగించుకోవడానికై మనిషి భారీయెత్తున సాధన సంపత్తిని సమీకరించడానికి ప్రయత్నిస్తాడు. అయితే అది తప్పు దారి అని రుజువవుతుంది. వాస్తవానికి – కృషి ఇందుకు విరుద్ధమైన దిశలో జరగాలి. ఇంద్రియ విషయాలు మనశ్శాంతిని భంగపరచకుండా ఉండాలంటే – మనస్సునూ, ఇంద్రియాలనూ అదుపుచేయాలి. కృష్ణ పరమాత్మ ఉద్ధవునికి ఇలా బోధిస్తాడు – "ఇంద్రియాలనూ, ప్రాణాలనూ నీ వశంలో ఉంచుకో. మనస్సును ఒక్క క్షణంకూడ స్వేచ్ఛగా విడిచిపెట్టకు. దాని ప్రతి ఎత్తుగడనూ, ప్రతి జిత్తునూ చూస్తూ ఉండు. ఫలితంగా సత్వ సంపద పెరుగుతుంది. క్రమ క్రమంగా మనస్సును వశపరచుకోవాలి."

మనస్సు ఇంద్రియాలను అదుపుచేయగలుగుతుంది. అయితే, బుద్ధి – వివేకముల అదుపులో ఉండడాన్ని అది అభ్యాసం చేయాలి. మనసుకు ఏది తోచితే అది చేయడం తప్పు. బుద్ధిద్వారా ఏది సముచితమో, ఏది అనుచితమో నిర్ణయించాలి. ఆ ప్రకారం మనస్సును నడపాలి.

## బంధ మోక్షాలకు కారణం మనస్సు

కపిల మహర్షి తన తల్లి దేవహూతితో ఇలా చెపుతాడు – "జీవుని బంధనానికీ, మోక్షానికీ కారణం మనస్సు. విషయాలపట్ల ఆసక్తి కలిగిన మనస్సు ఒక బంధనం. పరమాత్మపట్ల అనురక్తి కలిగిన మనస్సు మోక్షానికి కారణం అవుతుంది." బంధనం అంటే వికారాలతో బంధించబడడం. పరమాత్మ శ్రేష్ఠ ఆదర్శాలకు ప్రతీక. ఉన్నత ఆదర్శాల కోసం జీవించే వ్యక్తి, సంకుచిత స్వార్థానికి కట్టుబడని వ్యక్తి జీవన్ముక్త స్థితికి చేరగలుగుతాడు. ఈ విధంగా – మనిషి అంతఃకరణలో తిష్టవేసిన దోష దుర్గుణాలే అతడికి శత్రువులు.

విద్వాంసుడు దుష్టుడయితే – అతడి విద్వత్తు ప్రజలకు కష్ట నష్టాలు కలిగించడానికి వినియోగపడుతుంది. తన శరీరం పట్లకాని, తన కుటుంబంపట్లకాని వ్యామోహంలో పడిన వ్యక్తి శ్రేష్ఠ కార్యాలను సాధించలేడు. అతడి వికారాలు అతడి తేజస్సును హరిస్తాయి. కనుకనే, మాలిన్యాలను క్షాళన చేసుకోవడం, పవిత్రతను నిలిపిఉంచుకోవడం – ఇవి మతపరమైన ప్రతి కర్మకాండలో అంతర్భాగాలు అయినాయి.

జనం బాహ్యమైన పవిత్రతను మాత్రమే పరిగణిస్తూ ఉంటారు. కానీ, ఆంతరిక పవిత్రత లేనపుడు బాహ్య పవిత్రత నిరర్థకం అవుతుంది. ఒక యోగీశ్వరుడు నిమి మహారాజుకు ఇలా బోధిస్తాడు – రాజా! మట్టి, నీరు మున్నగువాటి ద్వారా బాహ్య శరీరాన్ని క్షాళన చేయాలి. కల్లా కపటాలను వదులుకోవడం ద్వారా ఆంతరిక పవిత్రతను సాధించాలి. ధర్మ అనుష్ఠానం, సహన శక్తి, మౌనం, స్వాధ్యాయం, సరళత, బ్రహ్మచర్యం, అహింస మున్నగువానిద్వారా శీత ఉష్ణములు, సుఖ దుఃఖములు మున్నగు ద్వంద్వములలో హర్షం, విషాదం లేకుండా ఉండడం నేర్చుకోవాలి."

**ప్రతి శ్రేష్ఠ గుణం ఏదో ఒక వికారాన్ని తొలగిస్తుంది.** పవిత్రతలన్నింటిలో హృదయ పవిత్రత గొప్పది.

## అంతఃకరణ స్థితియే స్వర్గం

స్వర్గం ఏదో ఒక లోకం పేరు కాదు. మనిషి అంతఃకరణ యొక్క స్థితికి పేరు అది. ప్రతి మనిషికీ ఈ స్వర్గంపై సహజమైన హక్కు ఉన్నది. మానవ జీవనంవంటి అద్భుత వరాన్ని పొందికూడ మనిషి రోగిగా, దుఃఖితుడుగా, దీనుడుగా, అసంతుష్టుడుగా ఉండిపోతున్నాడు. ఆత్మవికాసాన్నీ, ఆదర్శవాదాన్నీ, శ్రేష్ఠమైన జీవన లక్ష్యాన్నీ మరచిపోవడమే ఇందుకు కారణం. లక్ష్యాన్ని చేరుకోవాలంటే మనిషి తన సర్వశక్తులనూ ఆ ఒక్క దిశలోనే కేంద్రీకరించాలి. దత్తాత్రేయ భగవానుడు బాణం వదిలి లక్ష్యాన్ని ఛేదిస్తూన్న వ్యక్తిని చూచాడు. అతడు తన దృష్టిని అన్ని దిశలనుండి తప్పించి, ఊపిరి తీసుకోవడంసైతం నిలిపివేసి, గురి చూస్తున్నాడు. యదు మహారాజుకు ఆయన దాన్ని ఇలా వర్ణించాడు – "రాజా! బాణం వేసే వ్యక్తినుండి నేను ఇది నేర్చుకున్నాను: ఆసనాన్ని, శ్వాసను జయించి, వైరాగ్య అభ్యాసముల ద్వారా నీ మనసును అదుపు చేయి. ఎంతో మెలకువతో ఆ ఒక్క లక్ష్యంపైననే మనస్సును కేంద్రీకరించు."

## నరునినుండి నారాయణునివరకు

దేవతలకుసైతం దుర్లభమైన మానవ జీవనంలోని సద్గుణాలను మనిషి వృధా చేయకూడదు. జీవిత లక్ష్యాన్ని గుర్తించాలి. దాన్ని పొందడానికి మార్గాలను, విధానాలను అనుసరించాలి. పూర్తి తత్పరతతో, పూర్తి శ్రద్ధతో ఆవైపు తన శక్తులన్నింటినీ కేంద్రీకరించాలి. అప్పుడు అతడు నరునినుండి నారాయణుడుగా, పురుషునినుండి పురుషోత్తముడుగా, ఆత్మనుండి మహాత్ముడుగా పరమాత్మగా రూపొందగలుగుతాడు.

H H H

**ఇతరులకన్న మనం ఎలా భిన్నమో తెలిపేది మనస్సు. ఇతరులలో మనలో సమాన లక్షణాలను తెలిపేది హృదయం.**

## ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వ్యాసం

# మూర్తీభవించిన విప్లవ చైతన్యం

1835 నవంబర్ 19వ తేదీ, కార్తీక మాసంలో మనూబాయి జన్మించింది. ఆమె చాలా అందగత్తె. పొడవైన కురులు... పెద్ద కళ్లు...ముఖంలో రాజఠీవి ఉట్టిపడుతూ ఉండేది.

మనూకి 4 సంవత్సరాల వయస్సులోనే ఆమె తల్లి మరణించింది. మనూకు తండ్రి కత్తి తిప్పడం, గుఱ్ఱపు స్వారీ, తుపాకి పేల్చడం నేర్పించాడు.

క్రీ.శ.1842లో ఝాన్సీరాజు గంగాధరరావుతో మనూబాయి వివాహం జరిగింది.

### ఝాన్సీ కథ

ఆంగ్లేయులకు, ఝాన్సీ రాజుకు మధ్య రెండు ఒప్పందాలు జరిగాయి. మొదటిది, ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఝాన్సీరాజ్యం ఆంగ్లేయులకు సహాయం చేయాలి. రెండవది, ఝాన్సీకి రాజును ఎంపిక చేసేటప్పుడు ఆంగ్లేయుల అనుమతి తీసుకోవాలి. 1838లో ఆంగ్లేయులు గంగాధరరావును ఝాన్సీ రాజుగా నియమించారు. గంగాధరరావు అధికారంలోకి వచ్చిన వెంటనే గోసంతతి, ఏనుగులు, గుఱ్ఱాలు మంచి సంఖ్యలో కోటలో సమకూరాయి. ఆయుధాగారంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి సమకూర్చబడ్డాయి. 5వేల మంది కాల్బలాన్ని, 500 మంది గుఱ్ఱపు దళాన్ని అతడు రూపొందించాడు. ఫిరంగిదళం ఏర్పాటుచేశాడు.



### పెద్ద దెబ్బ

1851లో మహారాణి లక్ష్మీబాయికి ఒక కొడుకు పుట్టాడు. కానీ దురదృష్టవశాత్తు మూడునెలలలోపునే ఆ బాలుడు చనిపోయాడు.

1853లో గంగాధర రావు, లక్ష్మీబాయిలు ఆనందరావు అనే బాలుడిని దత్తత తీసుకున్నారు. ఆ బాలుడికి దామోదరరావు అని నామకరణం చేశారు.

### ఆశ చావలేదు

దత్తత స్వీకారం అయిన తరువాత గంగాధర రావు ఒక ఉత్తరంలో తన దత్తపుత్రుని తన రాజ్య వారసుడిగా గుర్తించమని బ్రిటిష్‌వారిని ప్రార్థించాడు.

కొద్ది రోజుల తరువాత 1853 నవంబర్ 21వ తేదీన గంగాధరరావు మరణించాడు. 18 సంవత్సరాల యుక్త వయస్సులోనే లక్ష్మీబాయి వితంతువుగా మారింది.

మహారాజు వారసుని గురించి లక్ష్మీబాయి అనేకసార్లు లార్డు డల్హౌసీకి వర్తమానం పంపించింది. మూడునెలలు గడిచినా ఎలాంటి సమాధానం రాలేదు.

1854 మార్చిలో డల్హౌసీ నుండి ఆదేశాలు వచ్చాయి.

దత్తతద్వారా తన వారసుని ఎంపిక చేసుకునే అధికారం గంగాధరరావుకు లేదంటూ బ్రిటిష్ ప్రభుత్వం కొట్టిపారేసింది.

ఆంగ్లేయులు ఝాన్సీ పరిపాలనను తమ చేతులలోకి తీసేసుకున్న తరువాత నుండి రాణి దినచర్యలో మార్పు వచ్చింది. రోజూ ఉదయం 4 గంటల నుండి 8గంటల వరకు సమయాన్ని స్నానం, పూజ, ధ్యానం, ప్రార్థనలలో గడిపేది. 8 గంటల నుండి

**మనిషి మనసు ఒక ఊటబావి, నిత్యనూతనం - 1_È°Û H>$+¬â=üï**

11 గంటల వరకు గుర్రపు స్వారీ చేసేది. తుపాకీ, ఖడ్గం, బల్లెం ప్రయోగించడం నేర్చుకునేది. ఇవన్నీ చేస్తున్న సమయంలో గుర్రాన్ని విపరీతమైన వేగంలో పరిగెత్తిస్తూనే ఉండేది. ఆ తరువాత తిరిగి స్నానం చేసేది. ఆకలిగొన్నవారికి, పేదలకు ఆహారం పంచిపెట్టి, తరువాత తాను తినేది. భోజనం తరువాత రామాయణం పఠనం సాగించేది. సాయంత్రం తేలికపాటి వ్యాయామం, కొద్దిసేపు ధార్మిక గ్రంథాల పఠనం, ధార్మిక ప్రవచనాలు వినడం, ఇష్టదేవతను ప్రార్థించడం - ఈ దినచర్య అంతా క్రమపద్ధతిలో అమలు చేస్తూండేది.

గుర్రంపై స్వారీ చేస్తూ బైటకు బయలుదేరినప్పుడల్లా రాణి మగవారి వేషం ధరించేది. ఇనుప శిరస్త్రాణం ధరించి, దానిపై తలపాగాను చుట్టేది. ఛాతీ ముందుకూడా ఇనుప కవచం ధరించేది. రెండు వైపులా పిస్తోలు, చురకత్తి ఉండేవి. వాటితో బాటు ఖడ్గాన్ని కూడా ధరించేది.

బ్రిటిష్ వారిపట్ల అసంతృప్తితో ఉన్న నానాసాహెబ్, రావుసాహెబ్, ఢిల్లీరాజు బహదూర్‌షా, అయోధ్య నవాబు సహచరులు - వీరంతా ఒకచోట అప్పుడప్పుడు సమావేశం కావాలని భావిస్తూ ఉండేవారు. రాణి మనస్సులో కూడా అదే ఆలోచన ఉంది. ఏదైనా ధార్మిక కార్యక్రమం జరిగినపుడు వారు కలుసుకోగలుగుతూ ఉండేవారు.

## సమైక్యంగా

దత్తపుత్రుడు దామోదరరావుకు 7 సంవత్సరాల వయస్సు వచ్చింది. అతడికి ఉపనయనం జరిగింది. ఈ ఉపనయనం పేరిట నాయకులందరూ కలుసుకున్నారు.

## అగ్నిజ్వాల

పాటలు, ఉత్సవాలు, మనోరంజక కార్యక్రమాలద్వారా సైన్యంలోని అసంతృప్తిని మరింత మండేటట్లు చేసేందుకు మహిళలు కూడా నడుం బిగించారు.

ఫిబ్రవరి నెలలో పౌర్ణమి తరువాత ఒకనాటి రాత్రి తాత్యాటోపే రాణిని కలవడానికి వచ్చాడు. ఆయన తనతోబాటు ఒక పత్రాన్ని తీసుకువచ్చాడు. అందులో "ఇక ఆలస్యం చేయడం అసంభవం! దేశాన్ని స్వతంత్రం చేయండి. మీ హక్కులను కాపాడుకోండి!" అని ఉంది. సమయం ప్రస్తుతం అనుకూలంగా లేదని రాణి అభిప్రాయపడింది. అయితే తాత్యా మాత్రం సైన్యంలో



అసంతృప్తి చాలా తీవ్రంగా ఉందని, ఆయుధాలు, మందుగుండు సామగ్రి సిద్ధంగా ఉన్నాయని, ఇక డబ్బు సేకరించడం కష్టమేమీ కాదని ఆమెకి నచ్చచెప్పాడు.

మే 31వ తేదీ ఆదివారం దేశమంతటా ప్రజలు ఒకేసారి తిరుగుబాటు చేయాలని నిర్ణయం జరిగింది. కమలాన్ని ఈ విప్లవానికి చిహ్నంగా స్వీకరించారు.

అయితే బారక్‌పూర్‌లో నిర్ణయించిన తేదీ కంటే ముందే తిరుగుబాటు తల ఎత్తింది. మే 10న మీరట్‌లో తిరుగుబాటు అగ్నిజ్వాలలు చెలరేగాయి. మీరట్, ఢిల్లీలలో భారతీయ సైనికులు ఒకటయ్యారు. ఢిల్లీ సింహాసనాన్ని చేజిక్కించుకున్నారు. బహదూర్‌షాను భారతదేశ చక్రవర్తిగా ప్రకటించారు.

విప్లవంలో పాల్గొన్నది కేవలం సైనికులే కాదు. రాజులు, మహారాజులు, సర్దారులు, పీష్వాలు, నవాబులు, ఢిల్లీ సామ్రాట్టులు- వీరే కాదు. హిందువులు, ముస్లింలు, మౌల్వీలు, పురోహితులు, అందరూ విప్లవంలో దూకారు. మహిళలు కూడా ప్రముఖ పాత్ర వహించారు. 19,20 నెలలపాటు పోరాటం సాగుతూనే ఉంది.

**రుచి జీవి పశువు. అభిరుచి జీవి మనిషి.**

## నిప్పు రాజుకుంటూ పోయింది

రాణి దినచర్యలో మార్పు లేదు. ఆమె యుద్ధానికి సన్నాహాలు చేయసాగింది. ఒకసారి ఆమెను ఎవరో అడిగారు. "రాణీ! ఇప్పుడు ఈ యుద్ధశిక్షణలు అవీ ఎందుకు?"

రాణీ సమాధానం ఏమిటో తెలుసా! "నేనొక క్షత్రియ మహిళను. దేశం, న్యాయం కాపాడడం క్షత్రియుల కర్తవ్యం. శత్రువుముందు తలవంచడం నాకు సహింపరాని విషయం. నా లక్ష్యం కోసం నేను పోరాడుతాను. నవ్వుతూ నవ్వుతూ మరణాన్ని స్వీకరిస్తాను."

జూన్ 4వ తేదీన మీరట్‌లో విప్లవం చెలరేగింది. అదేరోజు ఝాన్సీలో కూడా ఉపద్రవం ముంచుకొస్తున్న సూచనలు కనిపించసాగాయి. ఒక హవల్దార్ కొందరు సైనికులను తీసుకుని ఆంగ్లేయులు కొత్తగా నిర్మించిన 'స్టార్ ఫోర్ట్' కోటలోకి ప్రవేశించాడు. అందులో ఉన్న యుద్ధసామగ్రి, ధనం తన వశం చేసుకున్నాడు.

తమ గుడారాలలో ఉన్న ఆంగ్లేయ మహిళలు, పిల్లలను వెంటనే పాత కోటలోకి తరలించే ఏర్పాట్లు జరిగాయి. బ్రిటిష్ అధికారులు రాణిని సహాయం చేయవలసిందని ప్రార్థించారు. రాణి వారికి ఆశ్రయం ఇచ్చింది. భోజన వసతులతోబాటు యుద్ధం జరిగినంత కాలం వారికి అన్ని సౌకర్యాలు కల్పించింది.

నాయకుడు లేని సైన్యం ఆంగ్లేయులపై విజయం సాధించింది. కమాండర్లు, గ్రామాధికారులు అంతా రాణిని రాజ్యభారం స్వీకరించమని ఏకకంఠంతో ప్రార్థించారు. రాణి అంగీకరించింది. తిరిగి కోటపై ఝాన్సీ రాజ్య పతాకం రెపరెపలాడింది.

ఝాన్సీలో రాత్రింబవళ్లు యుద్ధ సన్నాహాలు నడుస్తున్నాయి. సరిక్రొత్త ఆయుధాలు తయారయ్యాయి. కమాండర్లు, గ్రామాధికారులు అంతా రాణిని రాజ్యభారం స్వీకరించమని ఏకకంఠంతో ప్రార్థించారు. రాణి అంగీకరించింది. తిరిగి కోటపై ఝాన్సీ రాజ్య పతాకం రెపరెపలాడింది.

1857 జూన్ నుండి 1858 మార్చి వరకు 10 మాసాలపాటు ఝాన్సీ రాజ్యాన్ని పరిపాలించిన సమయంలో లక్ష్మీబాయి అనేక మార్పులు తెచ్చింది. ఖజానా తిరిగి ధనంతో నిండింది. సైన్యం సువ్యవస్థితంగా రూపొందింది. పురుషుల సైన్యంతో సమానంగా స్త్రీ సైన్యం ఏర్పడింది.

'గర్జన', 'భవానీ శంకర్', 'విద్యుల్లత' లాంటి పేర్లను రాణి తన ఫిరంగులకు పెట్టింది. ఈ ఫిరంగులను మహిళలు, పురుషులు కూడా సమానంగా ప్రేలుస్తూండేవారు. పాత ఆయుధాలకు పదును పెట్టారు. కొత్త ఆయుధాలు తయారు చేసారు. ఆ రోజుల్లో ఝాన్సీలో ఏ ఇంటిలో చూసినా యుద్ధానికి తయారవుతుండడం కనిపించేది.

1858 మార్చి 23న సర్ రోజ్ సైన్యం ఝాన్సీపై యుద్ధం ప్రకటించింది.

10,12 రోజుల వరకు చిన్న రాజ్యమైన ఝాన్సీ గెలుపు-ఓటముల మధ్య ఊగిసలాడుతూ వచ్చింది.

## అపర దుర్గాదేవి

ఆంగ్లేయుల సైన్యం ఝాన్సీ రాజ్యంలో ప్రవేశించడంతో రాణి స్వయంగా ఆయుధాలు చేపట్టింది. పురుష వేషం ధరించి అపరదుర్గాదేవిలా పోరాడింది. ఎక్కడ ఆమె ప్రత్యక్షమైతే అక్కడ ఆంగ్లేయ సైన్యం పలాయనం చిత్తగించేది. ఝాన్సీ రాజ్యంలోని మహిళల సైన్యం, పురుషులతో సమానంగా వారు సాగించిన వీరోచిత పోరాటం చూసి సర్‌రోజ్ ఆశ్చర్యచకితుడయ్యాడు.

నెమ్మదిగా పరిస్థితి అదుపు తప్పుతూ ఉండడంతో, రాణి కొద్దిమంది యోధులను వెంట తీసుకుని శత్రుసైనికుల వరుసలను చీల్చుకుంటూ ఝాన్సీ నుండి బైటకు దూసుకుపోయింది.

బోకర్ కొద్దిపాటి సైన్యాన్ని తీసుకుని ఆమెను వెంబడించాడు. అతడు గాయపడి వెనుకబడిపోయాడు. అయితే రాణి గుఱ్ఱం కూడా మరణించింది. అయినప్పటికీ రాణి చలించలేదు. అక్కడినుండి కాల్పి చేరి తాత్యాటోపే, రావుసాహెబ్‌లను కలుసుకుంది.

## దీపం కొడిగట్టే ముందు

కాల్పిలో రాణి సైన్యాన్ని సమీకరించ నారంభించింది.

**ఆనందానికి సోపానాలు ప్రేమ, జ్ఞానం.**

రోజ్ తన సైన్యంతో కాల్పిని ముట్టడించాడు. వెంటనే రావుసాహెబ్, తాత్యాటోపే, రాణీతో కలిసి గ్వాలియర్ బయలుదేరారు.

గోపాలపూర్ చేరుకున్నారు. ఆరాత్రి రావుసాహెబ్, తాత్యా, బాందానవాబు, రాణిల మధ్య సమావేశం జరిగింది.

కొద్ది సైన్యంతో తాత్యా గ్వాలియర్ చేరుకోగానే అక్కడి సైన్యంలో అధికశాతం అతడిపక్షాన చేరిపోయింది. గ్వాలియర్ మహారాజు ఆగ్రాకు పారిపోయి, ఆంగ్లేయులను శరణువేడాడు.

రాణి, ఆమె మిత్రులు మినహా మిగిలిన సర్దారులంతా ఆనందంలో మునిగిపోయారు. రాణి ముందుచూపుతో చేసిన హెచ్చరికను వారు ఖాతరు చేయలేదు. ఈ ఆనందాలకు దూరంగా ఉండిపోయిన రాణి, గ్వాలియర్ కోటలోని కీలక ప్రదేశాలను పరిశీలించింది. కొన్ని మార్పులను సూచించింది. కానీ మిగిలిన సర్దారులు ఆమె సలహాను పట్టించుకోలేదు.

## యుద్ధం ముగిసింది

ఇంకొంతకాలం వేచి ఉండడానికి రోజ్ సిద్ధంగా లేడు. 1858 జూన్ 17న యుద్ధం తిరిగి ప్రారంభమైంది. రాణి పురుషవేషం ధరించి యుద్ధానికి సిద్ధమైంది.

రోజ్ ఒక కుట్ర పన్నాడు. గ్వాలియర్ నుండి పారిపోయి, ఆగ్రాలో బ్రిటిష్ వారి శరణుజొచ్చిన జయాజీరావు సింధియాను వెంటబెట్టుకుని గ్వాలియర్‌కు వచ్చాడు.

రాణి వద్ద సైన్యం సంఖ్యాపరంగా తక్కువే ఉన్నప్పటికీ సర్దారుల అసాధారణ సాహసం, యుద్ధవ్యూహం, రాణి పరాక్రమం కారణంగా ఆరోజు ఆంగ్లేయ సైన్యం భారీగా దెబ్బతింది. ఆనాటి విజయానికి ఘనత అంతా రాణికి చెందవలసిందే.

మరునాడు 18వ తేదీన ఆంగ్లేయులు సూర్యోదయానికి ముందే యుద్ధ భేరీలు మోగించారు. మహారాజు జయాజీరావు ప్రకటించిన క్షమాభిక్షకు కొందరు సైనికులు ఆంగ్లేయులతో చేయి కలిపారు. రావుసాహెబ్ వద్ద ఉన్న రెండు సేనావాహినులు ఆంగ్లేయుల పక్షాన చేరిపోయినట్లు వార్త వచ్చింది.

రాణి లక్ష్మీబాయి రామచంద్రరావు దేశముఖ్‌ను పిలిపించింది. "నేడు యుద్ధానికి చివరిరోజేమోననిపిస్తోంది. ఒకవేళ నేను మరణిస్తే, నా కుమారుడు దామోదరరావు జీవితాన్ని నా జీవితం కంటే విలువైనదిగా పరిగణించాలి. అతడిని జాగ్రత్తగా పెంచి పెద్ద చేయాలి" అంది. "నేను మరణించిన తరువాత నా శవం ఇతర మతస్థుల చేతుల్లో మాత్రం పడరాదు" అని ఆమె కోరింది.



రోజ్ వద్ద సైనిక శక్తి అధికంగా ఉంది. విప్లవకారుల పెద్ద సైన్యం వారిముందు నాశనమైపోయింది. వారి ఫిరంగులు ఆంగ్లేయుల చేతుల్లో చిక్కాయి. ఒక ఉప్పెనలా ఆంగ్లేయ సేన కోటపైన విరుచుకుపడింది.

రాణికి ఇక తప్పించుకుని పోవడంతప్ప మార్గాంతరం కనిపించలేదు. గుర్రపు కళ్లేన్ని నోటితో పట్టుకుని, రెండు చేతుల్లోనూ కత్తులు తీసుకుని ఆమె ముందుకు దూకింది. ఆంగ్లేయ సైన్యం వారిని చుట్టుముట్టింది.

రక్తపుటేరులు ప్రవహిస్తున్నాయి. పశ్చిమాన అస్తమిస్తున్న

**సేవా భావం వల్ల మనసు నిర్మలం అవుతుంది - స్వామి శివానంద.**

సూర్యుడు కూడా రక్తవర్ణం దాల్చాడు. ఒక ఆంగ్లేయ సైనికుడు రాణికి చాలా దగ్గరగా వచ్చాడు. ఆమె ఛాతీకి గురిపెట్టి బల్లెం విసిరాడు. రాణి వాడిని తన కత్తికి ఎఱ చేసింది. ఆమె శరీరమంతా గాయాలయ్యాయి. రక్తం కారుతోంది. ఆంగ్లేయ సైన్యం వెంబడిస్తోంది. రాణి స్వర్ణరేఖా నదిని దాటుతున్న సమయంలో ఒక ఆంగ్ల సైనికుడు కాల్చిన గుండు ఆమె కుడి భుజంలో దిగబడింది. వెంటనే ఎడమచేతిలోని కత్తితో ఆమె వాడి తలను ఎగురగొట్టింది.

గుర్రం కూడా రాణికి సహకరించలేకపోయింది. కడుపులోనుండి రక్తం కారుతోంది. ఒళ్లంతా గాయాలయ్యాయి. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఆమె దురవస్థను చూచి ఆమె అంగరక్షకుడైన గుల్‌మొహమ్మద్ విలపించసాగాడు.

రఘునాథసింహ, రామచంద్రరావుల సహాయంతో రాణి గుర్రం మీద నుండి క్రిందికి దిగింది.

ఏడుస్తున్న రాణి దత్తపుత్రుడు దామోదరరావును రామచంద్రరావు గుర్రంపై కూర్చుండబెట్టాడు. రాణిని భుజాలకు ఎత్తుకుని గంగాదాస్ ఆశ్రమం వైపు పరుగు తీశాడు. వారికి రక్షణగా రఘునాథసింహ, గుల్‌మొహమ్మద్‌లు అనుసరించారు.

ఆ చీకటిలోనే బాబా గంగాదాస్ రక్తసిక్తమైన రాణి ముఖాన్ని గుర్తు పట్టాడు. చల్లటి నీటితో ఆమె ముఖాన్ని కడిగాడు. గంగాజలం త్రాగించాడు. రాణికి కొద్దిగా స్పృహ వచ్చింది. వణుకుతున్న కంఠంతో 'హరహర మహాదేవ్' అని మాత్రం అంది. ఆ తరువాత ఆమె శరీరం తిరిగి చైతన్యాన్ని కోల్పోయింది.

కొద్దిసేపటి తరువాత అతికష్టం మీద మళ్లీ ఆమె కన్నులు తెరిచింది. బాల్యంలో తాను నేర్చుకున్న భగవద్గీత శ్లోకాలను నెమ్మదిగా ఉచ్చరించింది. ఆమె కంఠస్వరం అంతకంతకూ క్షీణించసాగింది. "ఓ కృష్ణా! నీ ముందు నేను ప్రణమిల్లుతున్నాను"- ఇవే ఆమె చివరి మాటలు. ఝాన్సీ రాజ్యపు భాగ్యరేఖ అంతరించింది.

రఘునాథసింహ, గుల్‌మొహమ్మద్, దామోదరరావుల కన్నుల నుండి అశ్రు ధారలు ప్రవహించాయి.

బాబా గంగాదాస్ పవిత్ర స్వరంతో ఇలా అన్నారు- "వెలుతురుకు అంతం లేదు. ప్రతి కణంలోనూ అది దాగి ఉంటుంది. తగిన సమయంలో అది తిరిగి ప్రకాశిస్తుంది."

రాణి పార్థివ శరీరం అక్కడే అగ్నిజ్వాలలకు ఆహుతి చేయబడింది.

## విప్లవ చైతన్యం మూర్తీభవించిన మహిళ

ఝాన్సీరాణి లక్ష్మీబాయి కేవలం భారతదేశానికే కాక మొత్తం ప్రపంచంలోని మహిళాలోకానికే వన్నె తెచ్చింది. ఆమెది పవిత్ర జీవితం. పరిపూర్ణ నారీత్వం, సాహసం, అమర దేశభక్తి, బలిదానాల ఉత్తేజకర గాథయే ఆమె జీవితం.

ఆమెలో సింహంతో సమానమైన తేజస్సు నిండి ఉంది. రాజకీయాలలో కూడా ఆమె దిట్ట. మామూలు సమయాలలో ఆమె అందరు స్త్రీల లాంటిదే. అయితే ఆయుధం చేతబూని, యుద్ధరంగంలో అడుగుపెట్టిందంటే ఆమె అపర కాళిమూర్తియే. వయస్సు తక్కువైనా ముందుచూపులో, దృఢ నిర్ణయాలలో ఆమె పరిపక్వత స్పష్టంగా కనిపించేది.

ఆమె ఒక ఆదర్శ పత్నిగా వ్యవహరించింది. ఆమె నిష్ఠావంతురాలైన హిందువు. మిగిలిన మతాల విషయంలో ఆమె పూర్తి సహిష్ణుత కలిగి ఉండేది. ఆమె ఏ యుద్ధానికి బయలుదేరినా హిందువులతో బాటు ముస్లింలు కూడా ఆమె సైన్యంలో ముందుండేవారు.

లక్ష్మీబాయి 1835 నవంబర్ 19 నుండి 1858 జూన్ 28 వరకు 22 సంవత్సరాల 6 నెలలు జీవించింది. గాఢాంధకారంలో ఒక మెరుపులా ప్రకాశించి మాయమైంది ఆమె.

రాణితో అనేకసార్లు యుద్ధంలో ఓడిపోయి, చివరకు ఆమెను ఓడించిన సర్‌రోజ్ రాణీ లక్ష్మీబాయి గొప్పతనాన్ని గురించి ఇలా అన్నాడు -

"విప్లవ కారులందరిలో అత్యంత సాహసి, అందరికంటే గొప్ప సేనాధిపతి రాణీ లక్ష్మీబాయి."

H H H

**గర్వం వదులు. అందరి ప్రేమనూ పొందు.**

# ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం- 6

# మర్మస్థానములను సక్రియంచేసే ఆసనాలు

స్థూలంగా ఆసనములను గూడ శారీరక వ్యాయామం క్రింద జమకట్టవచ్చు. వ్యాయామం ద్వారా కలిగే సత్ఫలితాలన్నీ ఆసనము ద్వారా కలుగుతాయి. సాధారణమైన కసరత్తుల ద్వారా వ్యాయామమందని శరీర భాగాలకు ఆసనం ఉపకరిస్తుంది.

ఆసనములకు ఋషులు యోగసాధనలో చాల పెద్ద పీఠం వేశారు. ఇవి మర్మస్థానము నందలి "హవ్యవాహ". "కవ్యవాహ" అనే నిద్రాణమై ఉన్న శక్తులను తట్టి లేపి క్రియాశీలం చేస్తాయి. ఆ మర్మస్థానము లతి కోమలములైనందున ప్రకృతి వాటిని చాల సురక్షితంగా అట్టిపెట్టింది. సాధారణంగా బాహ్యప్రభావం వాటివరకు ప్రసరించదు. ఆసనముల వలన వీటి సంరక్షణ జరుగుతుంది.

ఈ మర్మస్థానముల సంరక్షణలో ఎట్టి బాధ కలిగినా, జీవితం సంకటంలో పడుతుంది. ఇట్టి మర్మస్థానములు ఛాతీలోను, కడుపులోను ఎక్కువగా ఉన్నాయి. కంఠకూపము, స్కందములు, పుచ్ఛము, మేరుదండము, బ్రహ్మరంధ్రములకు సంబంధించి 33 మర్మస్థానము లున్నవి. వీనికి ఎట్టి అఘాతము కలిగినా రోగ విశేష కారణమున వికృతి కలుగుతుంది. దేహము లోపల లోపలనే కృశించి పోతుంది. బయటికి ప్రత్యక్షంగా ఏ రోగమూ కనిపించదు కానీ నోరు చేదుగా ఉంటుంది. శరీరంలో గగుర్పాటు కలుగుతుంది. బరువుగా ఉంటుంది. ఉదాసీనత, ఎముకలు చిట్లుట, శిరస్సు తేలిక కావడం లేదా తలనొప్పి, దప్పిక మొదలైన జ్వర లక్షణాలు కన్పిస్తాయి. వైద్యులకు ఏమి చేయాలో తెలియదు. మందుల వల్ల ఉపయోగం కన్పించదు.

మర్మస్థానములకు దెబ్బతగలటంవల్ల ఆకస్మిక మృత్యువు సంభవిస్తుంది. అభిచారులు మారణ ప్రయోగాలను ఈ మర్మ స్థానములకే చేస్తారు. హాని, శోకము, అవమానము మొ॥న మానసికమైన దెబ్బలు తగిలితే గూడ మర్మస్థానములు దెబ్బతిని అట్టి వ్యక్తికి ప్రాణసంకటము కలుగవచ్చు. మర్మస్థానములు అశక్తములైనప్పుడు, వాతరోగము, బట్టతల, బొల్లి, రాళ్లు, ధైర్యం సడలిపోవడం, ఎండిపోవడం, మొలలు మొదలైన వ్యాధులు కలుగుతాయి. శిరస్సునందు, మొండెమునందు ఉన్న మర్మస్థానములయందు "హవ్యవాహ" నామక ధన విద్యుత్తు ఉంటుంది. చేతులలో, కాళ్లలో "కవ్యవాహ" నామక ఋణ విద్యుత్తు ఉంటుంది. వీటి రెండింటి సంతులనం చెడిపోతే పక్షవాతం, అర్ధాంగం, సంధివాతము మొదలైన ఉపద్రవాలు సంభవిస్తాయి.

కొన్ని సార్లు లావుగా దృఢంగా కనుపించేవారికి కూడ వంద రోగాలుంటాయి. ఈ మార్మిక రోగములకు కారణం మర్మస్థానముల యందలి గడబిడయే. వీరు సరియైన వ్యాయామం చేయకపోవడం వల్ల ఈ మర్మస్థానములకు తగిన వ్యాయామము అందకపోవడం ఒక కారణం. మందులు వీనికి పనిచేయవు. ఆపరేషన్‌లు, ఇంజక్షన్లు ఉపయోగించవు. ఈ గట్టి చిక్కును విప్పటానికి కేవలం యోగాసనాలనే వాడి అస్త్రములు మాత్రమే శోధన చేసి చమత్కారాన్ని చూపగలవు.

మంచి ఆహార విహారములు, విశ్రాంతి, వ్యాయామము అన్నీ సక్రమంగా ఉన్నప్పటికి ఒకప్పుడు మనుష్యుని మర్మస్థానములు అజ్ఞాత సూక్ష్మకారణములచేత వికృతి నొందే అవకాశము కలదని తెలిసిన ఋషులు, హవ్యవాహ, కవ్యవాహ తాడిత శక్తులు సంతులనాన్ని కోల్పోవడం వల్ల వ్యాధులు, బలహీనతలు చుట్టు ముట్టి యోగసాధన చేసే సమయంలో బాధలు కలుగుతాయని, వీనిని దూరం చేయడానికి దీర్ఘకాల ప్రయోగాలు, అనుభవం ద్వారా "ఆసన క్రియను" ఆవిష్కరించారు.

ఆసనముల యొక్క ప్రభావము సరాసరి మన మర్మ స్థలాలమీద పడుతుంది. నసనాడులకు, మాంస కండరములకు అతిరిక్తమైన కశేరుకకు (వెన్నెముక) గూడ ఆసనముల ద్వారా ఆకుంచన ప్రకుంచనములు (ముడుచుకొనుట) పొందడంవల్ల వానియందు నిల్వయున్న వికారములు తొలగిపోయి, ఎల్లప్పుడూ పరిశుద్ధంగా ఉండటంవలన కొత్తవికారములు చేరవు. మర్మ స్థానములయొక్క శుద్ధి, స్థిరత్వము, పరిపుష్టి కొరకు ఆసనములు వాటి పద్ధతిలో అవి సర్వోత్తము ఉపచారములుగా పేర్కొనబడినాయి.

ఆసనములు అనేకములు. అందు 84 ప్రధానమైనవి. వాటిని అన్నింటిని గూర్చి వివరించవలసిన అవసరం ప్రస్తుతం మనకు లేదు. సర్వాంగపూర్ణమైన ఆసన శిక్షణ ఇక్కడ ఇవ్వబడటం లేదు. అది కావాలనుకొన్నవారు మా "బలవర్ధక వ్యాయామము" అనే

**కోపం అణుచుకో. దుఃఖం నశిస్తుంది.**

పుస్తకం చూడవచ్చు. నేడు గాయత్రీ యోగసాధన చేయగోరిన వారికి సులభంగా మర్మస్థానముల యొక్క సంరక్షణకు ఉపకరించే ఆసనములను గురించి వివరిస్తాను.

అటువంటి ఆసనములు ఎనిమిది. అవి అన్ని మర్మస్థానముల మీద ప్రభావం చూపుతాయి. అందులో 4, 5 మీకు అనుకూలంగా ఉండేవాటిని భోజనానికి పూర్వం మాత్రమే చేయండి. ఇవి ఇతర ఆసనముల కంటే ఉపయోగకరమేకాక సరళంగా కూడా ఉంటాయి. ఉపాసన చేసిన తర్వాత కూడ ఈ ఆసనాలను వేయవచ్చు. అందువలన రక్తగతి తీవ్రమైనందు వలన చిత్త చాంచల్యము ధ్యాన సమయంలో బాధించదు.

**(1) సర్వాంగాసనము :** ఆసనంపైన నిటారుగా పడుకోవాలి. అరచేతులు భూమికి ఆని ఉండేలా ఆనించాలి. మోకాళ్లు వంచకుండా రెండు కాళ్లను దగ్గరికి చేర్చి పూర్తిగా పైకి ఎత్తాలి. నిటారుగా ఉంచాలి. శరీరాన్నికూడ పైకి ఎత్తి పాదాలను తలవెనుకవైపు భూమికి తాకించాలి. కాళ్లు మడువరాదు. చేతులను మునుపటిలాగా భూమిపై ఉండవచ్చు లేదా సహాయం కోసం నడుముపైకి తేవచ్చు. గడ్డము ముందు భాగాన్ని తాకుతూ ఉండాలి.

**(2) బద్ధపద్మాసనము :** పద్మాసనములో ఆసనంపై కూర్చోవాలి. కుడిచేతిని వీపు మీదుగా పోనిచ్చి కుడికాలి బొటన వ్రేలిని పట్టుకోవాలి. అలాగే ఎడమచేతిని వెనగ్గా వీపుమీదుగా రప్పించి ఎడమకాలి బొటన వ్రేలిని పట్టుకోవాలి. వీపును నిటారుగా ఉంచి దృష్టి నాసికాగ్రంపై నిలపాలి. గడ్డమును కంఠానికి పూర్తిగా అన్చి ఉంచాలి. చాలామందికి ముందుగానే బొటన వ్రేలిని పట్టుకోవటం కష్టమవుతుంది. అలాంటివారు బొటన వ్రేలిని పట్టుకుంనేంతవరకు ఒకేచేతితో అభ్యాసం చేయడము మంచిది.

**(3) పాద హస్తాసనము :** నిటారుగా నిలబడాలి. తర్వాత మెల్లమెల్లగా చేతులను క్రిందకు దించి, కాలి బొటన వ్రేళ్లను పట్టుకోవాలి. కాళ్లు రెండు కలిపి ఉంచాలి. మోకాళ్లను వంచరాదు. తర్వాత తలను క్రిందికి వంచి రెండు చేతుల మధ్యగా ఉంచి ముక్కును మోకాలికి తాకించాలి. చేతులను మార్చి కుడిచేతితో ఎడమ వ్రేలిని, ఎడమ చేతితో కుడికాలి వ్రేలిని తాకవచ్చు. తలను వంచిన తర్వాత పొట్టను లోపలికి గాలి పీల్చి లాక్కోవాలి.

**(4) ఉత్కటాసనము :** నిటారుగా నిలబడాలి. రెండు కాళ్లు, మోకాళ్లు, మడమలు ఒకదానితో ఒకటి కలిసి ఉండాలి. గాలి లోపలికి పీలుస్తూ, రెండు చేతులను నడుముపై ఉంచి, మోకాళ్లు వంచుతూ, శరీరాన్ని నిటారుగా ఉంచి, వెనుక వైపుకి వెళ్లాలి. అంటే సరిగా కుర్చీపై నిటారుగా కూర్చున్నట్లు ఉండాలి. నడుము మోకాళ్లకు సమాంతరంగా వచ్చిన తరువాత తిరిగి యథాస్థితికి రావాలి.

ఇది బాగా అభ్యసించిన తరువాత మడమలను కూడా ఎత్తి కేవలం ముందు వ్రేళ్లపై బరువును మోపాలి. ఇదీ అభ్యాసమైన తరువాత మోకాళ్లను వేరుచేసి దూరంగా తేవాలి. చేతివేళ్లు మోకాళ్ల ముందు వైపు భూమిని తాకేటట్లు ఉంచటం మరచిపోరాదు.

**(5) పశ్చిమోత్తానాసనము :** ఆసనంపై కూర్చుని కాళ్లు పూర్తిగా ముందుకు చాచండి. రెండు కాళ్లూ తాకుతూ ఉండాలి. మోకాళ్లు వంచరాదు. తర్వాత రెండు చేతులను ముందుకు చాచి కాలి బొటన వ్రేళ్లను పట్టుకోవాలి. అంగుళము కూడ కదలరాదు. తర్వాత తలను మోకాళ్లపైకిగానీ, ఇంకా ముందుకుగానీ వంచి కాళ్లను తాకించాలి. ఇంకా వీలైనట్లయితే చేతులను పాదాల వద్దనున్న భూమి పైకి తేవచ్చు. ముందుగా కాళ్లు నిటారుగా ఉంచి వ్రేళ్లను పట్టుకోవటం అభ్యాసమైన తర్వాత తలను వంచడం అభ్యసించాలి.

**(6) సర్పాసనము :** పొట్ట ఆధారంతో నేలపై పడుకోవాలి. తర్వాత రెండు చేతులను నేలపై ఆనించి వాటి ఆధారంతో నడుము పైకి లేపాలి. చేతులు నాభి ప్రాంతంలో నేలను ఆని ఉండాలి. ముందుగా శరీరంలోని అన్ని భాగాలు నేలను తాకుతూ ఉండాలి. తర్వాత మెల్లగా తల, మెడ, ఛాతీ, పొట్ట భాగాలను పైకి లేపాలి. దృష్టి ముందువైపుకి ఉంచాలి. శరీరము పాము పడగవలె నిటారుగా ఉండాలి. నాభి భూమిని తాకరాదు.

**(7) ధనురాసనము :** ఆసనముపై బోర్లాపడుకోవాలి. తర్వాత రెండు మోకాళ్ల వద్ద వంచాలి. చేతులు వెనుకకు తీసుకొని వెళ్లి రెండు కాళ్లను పట్టుకోవాలి. తర్వాత మెల్లగా తలనుండి నడుము వరకు పైకి క్రమంగా ఎత్తాలి. దాని కనుగుణంగా చేతులను పైకి తీసికువెళ్లాలి. కాళ్లను పట్టుకున్న చేతులు విడిపోరాదు. వీలైనంతగా శరీరాన్ని భూమిపై నుంచి ఎత్తాలి. చూచేందుకు ధనుస్సు వలె ఉండాలి.

**(8) మయూరాసనము :** మోకాళ్లపై ఆసనం మీద కూర్చోవాలి. తర్వాత చేతులను బోర్లించి నేలపై ఆనించాలి. తర్వాత కాళ్లను వెనుకకు పూర్తిగా చాచి వేళ్లపై బలమంతా మోపాలి. తర్వాత శరీరం

**లోభిత్వం వదులు. ధనవంతుడవు అవుతావు.**

నిటారుగా ఉంచి భూమికి సమాంతరంగా పైకి లేపాలి. కేవలం చేతి వ్రేళ్లు, కాలి వ్రేళ్లుమాత్రమే భూమిని తాకుతూ ఉండాలి.

ఈ ఎనిమిది ఆసనాలు కష్టసాధ్యమైనవి కావు. కానీ నరాలపై మంచి ప్రభావము చూపగలవి. శాస్త్రాలలో ఇవి బాగా ప్రశంసింపబడినవి.

వీటన్నింటివలన కలిగే లాభం ఒక్క సూర్య నమస్కారముతో లభిస్తుంది. ఈ ఒక్క ఆసనం అనేక ఆసనాలకు సమానము.

మేము గాయత్రీ సాధకులందరికి ఎక్కువగా సూర్య నమస్కారములు చేయమని సలహా ఇస్తుంటాము. సూర్యనమస్కారం వలన కలిగే లాభం చాలా మహత్తును కలిగి ఉంటుందని మా అనుభవము. కానీ మిగతా ఆసనాలు కూడా వేయాలి.

## సూర్య నమస్కారములు

ప్రాతఃకాలంలో ఈ ఆసనాలు వేయండి. ఎక్కువగా వేడిగాని, చలిగాని, లేదా గాలి గాని ఉన్నట్టయితే తేలికగా ఉండే వస్త్రాలు ధరించవచ్చు. లేకుంటే శరీరంపై కేవలం లంగోటీ లేదా నిక్కరు ఉండాలి. బాగా గాలి, వెలుతురు వచ్చే గదిలో నడుముని నిటారుగా ఉంచి నిలబడాలి.

ముఖాన్ని తూర్పువైపు ఉంచాలి. కళ్లు మూసి సూర్య భగవానుని ధ్యానించాలి. ఈ శరీరములోనికి అన్ని వైపుల నుండి సూర్య కిరణములు ప్రవేశించి శరీరాన్ని ఆరోగ్యవంతం చేస్తున్నట్లుగా భావించాలి. తర్వాత క్రింది విధానాన్ని ప్రారంభించాలి.

(1) కాళ్లను నిటారుగా ఉంచి, నడుమును క్రిందివైపుకు వంచి, రెండు చేతులను నేలకు తాకించండి. తల మోకాళ్లను తాకాలి. ఇది పాదహస్తాసనము. దీనితో పిక్కలకు, తొడలకు భుజాలకు వెనుక వైపునకు చేతుల క్రింది భాగానికి వ్యాయామం అవుతుంది.

(2) తలను మోకాళ్లపైనుంచి తీసి గట్టి గాలిపీల్చండి. ముందు కుడికాలిని వెనుకవైపుకి తీసుకువెళ్లి, కాలి వ్రేళ్లపై నిలబెట్టాలి. ఎడమ మోకాలిని వంచాలి. రెండు అరచేతులు భూమిపై ఉండాలి. తల కొంచెము పైకెత్తి దృష్టిని ముందువైపుకి ఉంచాలి. దీనితో తొడలకు, ఎడమ భాగానికి వ్యాయామం అవుతుంది. దీనిని వివేకపాద ప్రసారనాసనం అంటారు.

(3) ఈ సారి ఎడమ కాలిని వెనుకకు తీసికొని వెళ్లాలి. నడుమును పైకి ఎత్తాలి. తల కొంచెం క్రిందికి వంగుతుంది. దీనిని ద్విపాద ప్రసారనాసనము అంటారు. దీనితో వ్రేళ్ల నరాలన్నిటికీ, భుజాలకు, కాలి వ్రేళ్లకు వ్యాయామం అవుతుంది.

(4) రెండు మోకాళ్లు, రెండు చేతులు, ఛాతీ, తల ఇవన్నీ భూమిని తాకుతూ ఉండాలి. శరీరము నిటారుగా ఉండాలి. పొట్ట భూమిని తాకరాదు. దీనిని అష్టాంగ ప్రణిపాతాసనము అంటారు. దీనితో చేతులు, నరాలు, పొట్ట, తొడ, భుజాలు, భుజ దండములకు వ్యాయామము కలుగుతుంది.

(5) చేతులను నిటారుగా నిలబెట్టండి. శరీరాన్ని పైకి ఎత్తాలి. నడుమును భూమివైపుకి వంచండి. తల పైకి ఎత్తండి. ఆకాశాన్ని చూడండి. మోకాళ్లు భూమిని తాకరాదు. చేతులపై శరీరం నిటారుగా ఉంచాలి. నడుమును ఎంత త్రిప్పగలిగితే అంత త్రిప్పండి. దానిని పైకి లేవగలిగనంత లేపవచ్చు. ఇది సర్పాసనము. దీనితో హృదయానికి, కంఠానికి బాగా వ్యాయామమవుతుంది.

(6) కాళ్లు చేతులు పూర్తిగా భూమిని తాకించండి. మోకాళ్లు వంగరాదు. నడుమును ఎంత వీలైతే అంత పైకి ఎత్తండి. గడ్డం కంఠాన్ని తాకుతూ తల భూమికి సమాంతరముగా ఉంటుంది. ఇది మయూరాసనము. దీనివలన మెడ, వీపు, నడుము, కాళ్లు, భుజాలకు మంచి వ్యాయామము లభిస్తుంది.

(7) ఇక్కడి నుంచి మళ్లీ ముందు చేసిన వ్యాయామాలు చేయవలసి ఉంటుంది. రెండవ నెంబరు ఆసనం మళ్లీ వేయాలి. అది ఏకపాద ప్రసారనాసనము.

(8) తర్వాత ఒకటవ ఆసనం పాదహస్తాసనము.

(9) నిటారుగా నిలబడి, రెండుచేతులను ఆకాశంవైపు లేపి జోడించండి. శరీరాన్ని ఎంత వీలైతే అంత వెనుకకు వంచండి. చేతులు ఎంత వెనుకకువెళితే అంత, కానీ నడుము వంగరాదు. ఇది ఊర్ధ్వ నమస్కారాసనము. దీనితో ఊపిరితిత్తులకు, హృదయానికి మంచి వ్యాయామం అవుతుంది.

(10) తిరిగి మొదట చెప్పిన స్థితికి వచ్చి నమస్కారము చేసి సూర్య భగవానుని ధ్యానించండి. ఇది సూర్య నమస్కారము. ముందు మొదట ఐదు చేసి మెల్లగా సంఖ్య పెంచుకుంటూ పోవాలి. వ్యాయామ కాలంలో నోరు తెరువరాదు. ముక్కునుండి శ్వాస పీల్చాలి.

H H H

**ఆశ వదులు. సుఖపడు.**

## దేవసంస్కృతి సౌరభం

# రోజుల పేర్లలో వైదిక విజ్ఞానం

వారంలోని ఏడు రోజుల పేర్లలో నిగూఢమైన వైజ్ఞానిక సత్యాలు ఇమిడి ఉన్నాయి. వీటికి మూలం మనకు వేదాలలో దొరుకుతుంది. రోజుల పేర్ల పుట్టుక ఇతర దేశాలలో, సంస్కృతులలో జరిగిందని కొందరు వాదిస్తారు. అయితే, స్పష్టమైన వైజ్ఞానిక ఆధారాలు లేకుండా ఆ వాదనను అంగీకరించలేము.

రోజుల పేర్లు, పుట్టుక, క్రమం ఎక్కడ ఎప్పుడు ప్రారంభమయ్యాయి? ఈ ప్రశ్నలకు జవాబులు మనకు మన జ్యోతిష విజ్ఞానంలో లభిస్తాయి.

ఒక పగలు – రాత్రిని జ్యోతిషశాస్త్రం అహోరాత్ర అని చెపుతోంది. ఒక హోర ఒక గంటకు సమానం. హోరలకు అధిపతులు ఏడు గ్రహాలు.

గ్రహాలు తొమ్మిది. మరి హోరలకు అధిపతులుగా ఏడు గ్రహాలనే ఎందుకు తీసుకున్నారు?

రాహువు, కేతువు గ్రహాలు కావు. అవి సూర్య, చంద్రుల పరిభ్రమణ కక్ష్యలు కలిసే బిందువులు. అవి ఒకదానికొకటి 180 డిగ్రీలవద్ద ఉంటాయి. అవి బిందువులు మాత్రమే. కనుక వాటికి స్థూలమూ, వ్యక్తమూ అయిన అస్తిత్వం లేదు. అందువల్ల శాస్త్రం వాటిని రోజులకు అధిపతులుగా పరిగణించలేదు.

సూర్యోదయం ఏగ్రహం ఆధిపత్యంలో ఉన్న హోరలో జరిగితే, ఆ గ్రహం ఆ రోజుకు పేరు అవుతుంది. గ్రహాల వరుస ఈ విధంగా ఉంది – సూర్యుడు, శుక్రుడు, బుధుడు, చంద్రుడు, శని, గురువు, కుజుడు.

సృష్టి ప్రారంభంలో మొట్టమొదట సూర్యుని దర్శనం జరిగింది. ఆ కారణంవల్ల మొదటి రోజు మొదటి హోరకు సూర్యుడిని అధిపతిగా పరిగణించారు. అలా వారంలో మొదటి రోజుకు సూర్య వారం, రవివారం, భానువారం అని పేరు పెట్టారు. మొదటి రోజు కనుక దీనిని ఆదివారం అని కూడ పిలుస్తారు.

రెండవరోజు హోర సూర్యుని తర్వాత నాల్గవ గ్రహం చంద్రునితో ప్రారంభం అవుతుంది. కనుక దానిని చంద్రవారం అనీ, సోమవారం అనీ పిలిచారు.

ఈ సందర్భంగా జ్యోతిష శాస్త్రంలో మహా విద్వాంసుడు ఆర్యభట్టు ఇలా పేర్కొన్నాడు –

**శీఘ్ర క్రమాత్ చతుర్థాః దినయః** – కాలక్రియ:16

చంద్రునినుండి నాల్గవ గ్రహం మంగళ (కుజుడు)తో మూడవ రోజు హోర ప్రారంభం అవుతుంది కనుక ఆ రోజు మంగళవారం అయింది. ఈ వరుసలో కుజునినుండి నాల్గవ గ్రహం బుధునితో నాల్గవ రోజు ప్రారంభం అవుతుంది. కనుక ఆ రోజు బుధవారం అయింది. ఈ వరుస ప్రకారమే ఆ తర్వాతి రోజులు గురు, శుక్ర, శని వారాలు అయినాయి.

ఇక – రోజుల పేర్లు మరో దేశంలో, మరో సంస్కృతిలో ఉద్భవించాయనే వాదాన్ని పరిశీలిద్దాం. రోజుల పేర్లు ఈజిప్టునుండి వచ్చాయని డాయన్ కాశియస్ (క్రీ.శ. 200) ఆధారం చూపుతూ కన్నింగ్‌హామ్ 'ఇండియన్ ఏన్‌టిక్విటీ – 14/2–8'లో వ్రాశారు. అయితే వాస్తవాలు ఈ వాదాన్ని ఖండిస్తున్నాయి. ఎందుకంటే – ఈజిప్టు ప్రజలు ఏడు రోజుల వారాలుగా నెలను విభజించరు. పదిరోజుల వంతు నెలను మూడు భాగాలు చేస్తారు. కనుక రోజుల పేర్లు ఈజిప్టులో

**మనిషి నడక నవగ్రహాలమీద కాక – రాగద్వేషాలనే గ్రహాలమీద ఆధారపడి ఉంది – మాతృశ్రీ అనసూయాదేవి.**

పుట్టాయనడం నిరాధారమని రుజువవుతోంది.

వారం అనే పదానికి మూలం హోరా అని హ్విట్ అనే రచయిత చెపుతున్నారు. ఆయన హోరా పదాన్ని ఈజిప్టుకు చెందిన హోరస్ దేవతతో జోడిస్తున్నారు. వారం పదానికి జన్మ స్థలం బాబిలాన్ లేదా చాంల్డియా అని వాదిస్తున్నారు. అయితే ఇందులో ఏమాత్రం నిజం లేదు. ఎందుకంటే – అహోరాత్ర అనే పదం వేద కాలంనుండి ప్రయోగంలో ఉంది. ఉదాహరణకు –

**జనకో హ వైదేహః। అహోరాత్రైః సమాజగామ**

–(తైత్తరీయ బ్రాహ్మణం – 3/10/9)

అహోరాత్ర అనే పదంలోని మొదటి అక్షరం, చివరి అక్షరం లోపించి హోరా శబ్దం ఏర్పడిందని మహాజ్యోతిషవేత్త వరాహమిహిరుడు స్పష్టంగా పేర్కొన్నాడు.

ఆంగ్లో శాగ్జన్ పద్ధతిలో సునాగ్ దేగ్ (సండే), మోనన్ దేగ్ (మండే), టివైస్ దేగ్ (ట్యూజ్‌డే), వాడేన్ దేగ్ (వెడ్‌నస్ డే), థైర్‌దేగ్ (థర్స్ డే), ఫ్రిగ్ దేన్ (ఫ్రైడే), సైంటర్స్ దేగ్ (సాటర్ డే) శబ్దాల వివరణ ఉంది. అయితే, ఇందుకు స్పష్టమైన వైజ్ఞానిక ఆధారం కాని, గణిత శాస్త్ర ఆధారంకాని లేదు. కనుక దీనిని వారు శబ్దపు పుట్టుకగా పరిగణించడానికి వీలులేదు. ఇదికూడ భారతీయ సంస్కృతి నుండి ప్రేరణ పొందినదేనని అనిపిస్తుంది.

ఈ విధంగా – రోజుల పేర్ల పుట్టుక సూక్ష్మమూ, గహనమూ అయిన వైదిక ఋషుల పరిశోధన ఫలితమేనని స్పష్టమవుతోంది. ఇందుకు గణితశాస్త్ర ఆధారం, జ్యోతిషశాస్త్ర ఆధారం స్పష్టంగా ఉన్నాయి. ఈ పేర్లు క్రమంగా ప్రపంచంలోని ఇతర నాగరికతలకు వ్యాపించాయి. ఆయా నాగరికతలు తమ తమ పద్ధతులలో వీటిని స్వంతం చేసుకున్నాయి. ఈ పేర్లు అపభ్రంశములూ, వికృతములూ అయినాయి. అయినా ఆ రూపాలు కూడ మౌలికమైన వైదిక నామకరణాన్నే స్పష్టం చేస్తున్నాయి.

H H H

## కుష్ఠురోగుల సేవకు సమర్పితురాలు మేరీరీడ్

మేరీ రీడ్ అమెరికా క్రిష్టియన్ మిషన్ ద్వారా భారత్‌లో సేవారతురాలగుటకు వచ్చింది. ఆమెకు మహిళా విద్య బాధ్యత అప్పగించారు. పిత్తౌర్‌గఢ్ పర్యటనలో భారత్‌లో కుష్ఠురోగుల సంఖ్య అధికంగా పెరుగుట ఆమె చూసింది. ఎవ్వరూ వారి సంపర్కంలోకి వెళ్లరు. వారి చికిత్స గురించీ పట్టించుకోరు. రీడ్ కుష్ఠురోగుల సేవ పట్ల తన ఆసక్తిని తెలిపింది. మిషన్ ఆమెకు ఆ అవకాశం కల్పించింది. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని పర్వత ప్రాంతంలో పర్యటించి కుష్ఠు రోగులను ప్రోగు చేసి వారికి చికిత్సతో పాటు అధ్యాపనం ప్రారంభించింది. రోగులకు ఎంతో ఉపశమనం కలిగింది. ప్రజలకు తెలిసివచ్చింది – మనం మన దేశవాసులకు ఏమీ చెయ్యలేకపోతున్నా విదేశస్తులు సేవచేస్తున్నారని.

మేరీ రీడ్ కుష్ఠు ప్రధాన వాతావరణంలో ఉండుటవలన ఆమెకు కూడా వ్యాధి సోకింది. అమెరికా తిరిగి రమ్మని పిలుపు వచ్చింది. నేను జీవితాంతము ఈ లక్ష్యం కోసం పని చేయాలని చెప్పి దానిని తిరస్కరించింది. వెనుకడుగు వేయలేదు. ఆమె పీడితురాలై కూడా జీవితాంతం ఆ రోగుల కళ్యాణం కొరకు సేవ చేస్తూనే ఉన్నది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**గుమ్మడి పాదు దూరంగా ప్రాకి కాయలు కాస్తుంది. మహనీయుల సేవ దూరంగా ప్రాకి ఫలాలు ఇస్తుంది–**శ్రీ మళయాళ స్వామి.

## ఆచరణలో అధ్యాత్మ

# సిరిసంపదలనుకాక - సద్గుణాలను సంపాదించు

సంపదలు ఇతరులకు గొప్పగా కనిపిస్తాయి; మనకు బరువులుగా మిగులుతాయి. సద్గుణాలు ఇతరులకు కనిపించవు; కాని మనలో ఆనందాన్నీ, ఉల్లాసాన్నీ నింపుతాయి.

### దూరపు కొండలు నునుపు

ధనం, వైభవం, పదవి - వీటిని చూచి జనం ఈ సంపదలు ఉన్న వ్యక్తి చాలా సుఖపడుతున్నాడని అంచనా వేస్తారు. వాస్తవానికి అది నిజం కాదు. గానుగ లాగుతూ ఉన్న ఎద్దును చూచి - అది నూనె త్రాగుతూ ఉంటుందనీ, తెలకపిండి తింటూ ఉంటుందనీ, నూనె వ్యాపారంలో లాభాలు గడిస్తూ ఉంటుందనీ అనుకోవచ్చు. కానీ, అది నిజం కాదు. దూరంనుంచి చూస్తే, ఎప్పుడూ ఇలాంటి భ్రమలే కలుగుతూ ఉంటాయి. రాత్రి చీకటిలో అడవిలోని చెట్లు ఏనుగుల్లా కనిపిస్తాయి. దగ్గరకు వెళితే, నిజం బయటపడుతుంది. చందమామవలె సంపదలు దూరంనుంచి చూస్తే బాగా మెరుస్తూ ఉంటాయి. కానీ, ఆ చందమామ మీదకు వెళ్లి చూస్తే - అక్కడ గాలీ, నీరూ ఉండవు. ప్రాణులు ఉండవు. ప్రాణంలేని బండరాళ్లు మాత్రమే కనిపిస్తాయి.

సాధారణంగా - కోట్లు కూడబెట్టడం సహృదయుడైన వ్యక్తికి సాధ్యం కాదు. ప్రపంచంలో ఇంత దుఃఖం నిండి ఉంది. దాన్ని తొలగించడానికై సహృదయుడైన వ్యక్తి సంపదనేకాక, తన ప్రాణాన్నిసైతం ఇవ్వాలని కోరుకుంటాడు. సాధారణంగా - అన్నివైపులా కళ్లు మూసుకున్న వ్యక్తి మాత్రమే, తన సిరి సంపదలగురించీ, తన సంతానం సిరి సంపదలగురించీ మాత్రమే ఆలోచించే రాతిగుండెకల వ్యక్తిమాత్రమే కోట్లు కూడబెట్టగలుగుతాడు. న్యాయంగా సంపాదించేది స్వల్పంగానే ఉంటుంది. దానితో బ్రతుకుదెరువు సాగించడం సాధ్యపడుతుంది. కూడబెట్టడం సాధ్యపడదు.

కూడబెట్టిన ధనం పొరుగువారిలో అసూయనూ, ద్వేషాన్నీ రగిలిస్తుంది. మోసగాళ్లు వెంటపడతారు. వారి ఆటలు సాగకపోతే, వారు శత్రువులు అవుతారు. కూడబెట్టిన దాన్ని కాపాడుకోవడంకూడ కష్టమే. తేనెపట్టుపైన ఎన్నెన్నో దెబ్బలు పడతాయి.

పైగా - సంపద వల్ల మనిషికి మదం ఎక్కుతుంది. సంపద అహంకారాన్ని పెంచుతుంది. సాధారణంగా - సంపద మనిషిని భోగవిలాసాలకు దాసుడుగా, వ్యసనపరుడుగా చేస్తుంది; అలా సంపద మనిషిని దిగజార్చుతుంది. సంపద ఉన్నంతవరకు వారసులుకూడ ఈ దుష్ఫలితాలను అనుభవిస్తారు.

### సద్గుణాలతోనే సాఫల్యపు శిఖరాగ్రం

మనిషిలోపలి సద్గుణాలు మాత్రమే నిజమైన సంపద. సద్గుణాలు వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా, ఉదాత్తంగా తీర్చిదిద్దుతాయి; గౌరవాన్నీ, సహకారాన్నీ పెంచుతాయి. సద్గుణాలవల్ల మిత్రబృందం పెరుగుతుంది. ప్రశంసకులకు కొదవ ఉండదు గుణవంతునికి.

సద్గుణాలు ఆధారంగానే నిజమైన, శాశ్వతమైన, ఉన్నత స్థాయికి చెందిన సాఫల్యాలు అందుతాయి. శ్రమించే గుణం, ధైర్య సాహసాలు, ఏకాగ్రత, సంయమనం, నిరంతర కృషి - ఇవి ఆధారంగానే ప్రపంచంలో పటువిధములైన సాఫల్యాలు లభిస్తాయి; ప్రగతికి రాచబాట నిర్మాణం అవుతుంది. సౌశీల్యం, నిజాయితీలు ఆధారంగానే మనిషి ఇతరుల విశ్వాసాన్ని పొందగలుగుతాడు. విశ్వాసపరుణ్ణే సమాజం తనవాణ్ణిగా చేసుకుంటుంది. అతడికే గొప్పగొప్ప పనులు అప్పగించబడతాయి. అతడికే సహకారం పుష్కలంగా అందుతుంది. నిజాయితీలేని వ్యక్తి తనపట్ల విశ్వాసాన్ని కోల్పోతాడు. నిజాయితీ లేని వ్యక్తికి నిజమైన సహచరుడు దొరకడు. ఫలితంగా - అతడు జీవితమంతా ప్రగతికి దూరం అవుతాడు.

సద్భావనతో, సద్గుణాలతో కూడిన వ్యక్తిత్వం దానికదిగా ఒక వరం. అలాంటి వ్యక్తి తనలోపల సంతృప్తినీ, ఉల్లాసాన్నీ అనుభూతి పొందుతాడు. అతడి మనసు తేలికగా ఉంటుంది. అతడు ఎవరికీ భయపడడు. పిరికితనం, దుష్టత్వం లేని వ్యక్తి ఎవరికైనా ఎందుకు భయపడాలి? సదాచరణ కలిగిన వ్యక్తి నిర్భయంగా, నిర్ద్వంద్వంగా ఉంటాడు. న్యాయంగా సంపాదించిన దానితో పేదవాడిలా జీవిస్తూ కూడ సంతోషాన్ని అనుభవిస్తాడు. అవినీతితో కోట్లు సంపాదించిన వ్యక్తికి అలాంటి సంతోషం కలలో అయినా కలుగదు.

మనం సంపదలవెంట పరుగులు తీయకూడదు. సద్గుణాల ప్రాముఖ్యాన్ని గుర్తించాలి. సద్గుణాలు ఉన్నచోట సంపదలుకూడ నిలచి ఉంటాయి. కానీ, కళ్లు మూసుకుని సంపదలవెంట పరుగులు తీయడంవల్ల సుఖమూ దొరకదు, సంతృప్తీ దొరకదు. HHH

**ఒకడు నిన్ను ఒకసారి మోసగిస్తే, అది అతడి తప్పు. రెండుసార్లు మోసగిస్తే అది నీ తప్పు.**


## ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 23

# హిమాలయం నుండి ఆహ్వానం - 3

### తపోవనం దిశగా

జోషీమఠానికి తిరిగిరావడానికి కొద్ది సమయమే పట్టినట్లు అనిపించింది. తిరుగు ప్రయాణం కావడంవల్ల కాబోలు. దారి ఒకసారి చూచినదే. కనుక, కుతూహలం రోమాంచమూ కలగడం లేదు. ఆ తర్వాత సమయం వాయువేగంతో పరుగుతీసింది.

జోషీమఠంలో శంకర గుహదగ్గర ఇద్దరు వృద్ధ సన్యాసులు కలిశారు. ఇద్దరి వయస్సులో 10 - 15 సంవత్సరాల తేడా ఉంది. దాదాపు 60 సంవత్సరాల వయస్సు ఉన్న సన్యాసి స్వామి నిర్మలానంద. ఆయనకన్న తక్కువ వయస్సులో ఉన్న సన్యాసి స్వామి గంభీరానంద. ఇద్దరూ గురు శిష్యులు. ఎంతో సహజంగా, ఎంతో త్వరగా వారితో పరిచయం ఏర్పడింది. తోడు కావడానికి కూడా హెచ్చు సమయం పట్టలేదు. గోముఖంవరకు కలిసి వెళ్లాలనే నిర్ణయం సుమారు పది నిమిషాలలో జరిగిపోయింది. అంతా ముందుగానే అనుకున్నట్లు ఆ నిర్ణయం జరిగింది.



అది చలి కాలం. దారిలో ఇబ్బందులు చలి కన్న తీవ్రంగా ఉన్నాయి. భవిష్య బదరి దాటిన తర్వాత వచ్చిన సెలయేరువద్ద తపస్వి గోముఖయాత్ర గురించి ఇచ్చిన సమాచారం ఆయన మనసులో మారుమ్రోగుతోంది. త్రోవలో సిద్ధ యోగులు కలుస్తారనే ఆశకూడ ఆ తపస్విని చూచినప్పుడు శ్రీరామ్ మనసులో ఏర్పడింది. కొండల మీదుగా, గ్రామాల మీదుగా సన్యాసులతోపాటు వెళుతూ ఉండగా - దారిలో అడుగడుగునా గుహలు ఉన్నాయి. ఇప్పుడే గుహనుండి ఒక సిద్ధపురుషుడు బయటకువస్తారు - అని అనిపించేది. ఆ గుహ దాటేసరికి కొద్ది నిరాశ కలిగేది. వారు ముందుకు వెళ్లేవారు. మరో గుహ వచ్చేవరకు ఎదురు చూచేవారు. ఆ గుహ వచ్చినా, మళ్లీ అదే నిరాశ.

చివరికి - సిద్ధ యోగులను కలుసుకునే ఆశ వదలిపెట్టే పరిస్థితి వచ్చింది. సహచరులు ఇద్దరితో కబుర్లు చెపుతూ శ్రీరామ్ విశ్రాంతిగా ప్రయాణించారు. మధ్యలో గుట్టలమీద చిన్నా పెద్దా దుకాణాలు కనిపించేవి. ముగ్గురూ ఆ దుకాణాలవద్ద కొద్దిసేపు విశ్రమించేవారు. గిరిజనులతో కబుర్లు చెప్పేవారు. ఆ దుకాణాలలో గోధుమపిండి, పప్పు, బియ్యం వంటి అవసర వస్తువులతోపాటు శెనగలు, బెల్లం, బంగాళదుంపలు, అగ్గిపెట్టెలు మున్నగు సరకులుకూడ ఉండేవి. జనం తమ అవసరాలనుబట్టి ఆ సరుకులు కొంటారు. ఆ దుకాణాల వద్దనే వండుకుని తినే ఏర్పాటు కూడ ఉండేది. సరుకులు కొంటే, వంటకూ వడ్డనకూ పాత్ర సామాను అద్దెలేకుండా అక్కడ ఇచ్చేవారు.

అయితే వీటి అవసరం అంతగా రాలేదు. దారిలో కొన్ని గ్రామాలు వచ్చాయి. వాటిలో జనాభా బాగా తక్కువ. వారిలో స్త్రీలు శాతం హెచ్చు. పురుషులు బ్రతుకు దెరువుకోసం మైదాన ప్రదేశాలకు దిగివెళ్లారు. సన్యాసులు తోడుగా ఉన్నారు. అయినా నిర్జనమైన దారిలో భయం కలుగుతోంది. అక్కడక్కడ అడవి జంతువులూ, క్రూర మృగాలూ కనిపించేవి. 20 - 22 గంటల ప్రయాణంలో 15సార్లు పులులూ, చిరుతపులులూ, ఎలుగుబంట్లూ ఎదురయినాయి. కొన్ని మలుపులలో చిన్న పులులు కూడ కానవచ్చాయి. నేడా ప్రాంతంలో ఇలాంటి పులులు కానరావు. అడవి జంతువుల తోలుతో వ్యాపారం

**తృణం కన్న దూది తేలిక. దూదికన్న యాచకుడు తేలిక Ð KŒ}ä>½¼_È°.**

చేసేవారు వాటిని చంపివేశారు. అయితే, 1926-27లో ఇలాంటి పులులు పెద్ద సంఖ్యలో ఉండేవి.

గోముఖం చేరడానికి మామూలుగా మూడు రోజులు పడుతుంది. వీరు ఒక రోజులో గోముఖం చేరారు. గంగోత్రికి సుమారు 20 కి.మీ. దూరంలో ఉంది గోముఖం. అయితే తెలియని దారి. రాళ్లతో నిండిన దారి. గోముఖం చేరడంతో, సన్యాసులు ఇద్దరూ శ్రీరామ్‌నుంచి విడిపోయారు. వారు గత 25 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. సరాసరి దారులూ, తేలిక దారులూ, దూరపు దారులతోపాటు తక్కువ సమయం పట్టే దగ్గర దారులుకూడ వారికి బాగా తెలుసు. ఉత్తరాఖండ్‌లోని ఈ ప్రాంతంలోని ప్రతి అంగుళం వారు చూచినదే. దగ్గర దారిలో కష్టం చాలా హెచ్చు. అయినా, నడచివెళ్లేవారు ఈ దారినే ఎంపిక చేస్తారు. శరీరంలో సామర్థ్యం ఉన్న వారు ఎట్టి పరిస్థితిలోనూ ఈ దారులగుండానే గమ్యాన్ని చేరుకోవాలని అనుకుంటారు.

## నలువైపులా ప్రమాదమే ప్రమాదం

గోముఖానికి ఆవల అంతటా మంచే. నలువైపులా తెల్లటి మంచు కప్పి ఉంది. మంచుతో నిండిన ఈ పీఠభూమిలో అడుగడుగునా సవాళ్లే. దారి అంతటా పెద్దపెద్ద గోతులు. కాలు జారితే వాటిలో పడిపోయే ప్రమాదం ఉంది. గోముఖానికి ఆవల ఉన్న ఈ దారి 4 కి.మీ. మాత్రమే. అయితే, అడుగడుగునా ప్రమాదమే. అనుక్షణం మెలకువతో ఉండవలసిందే. ప్రకృతి మంచు దుప్పటి తొలగించుకుని స్థలం స్థలంలో రాళ్లనూ, మట్టినీ గిరవాటువేస్తూ ఉంటుంది.

నాలుకు కి.మీ. ఈ దారిలో ప్రయాణిస్తూన్న శ్రీరామ్‌కు గత రెండు రోజులూ పలుమారులు గుర్తు వచ్చాయి. ఆ దారులలోకూడ ప్రమాదాలు తక్కువేమీ కావు. అయితే, మంచూ, ఆ మంచుక్రింద దాగిన మరణ గహ్వరాలూ, చావు బావులూ మాత్రం లేవు. ప్రమాదం ముఖ్యంగా క్రూర జంతువులనుంచే. అవి ఎదురు బదురుగా ఉన్నపుడు మృత్యువు కట్టెదుట నిలబడినట్లు అనిపిస్తుంది. కానీ, ఆ జంతువులుకూడ మనుషులకు భయపడేవి. రాత్రిపూట నల్లటి సర్పాలు బుసకొట్టేవి. పెద్దపెద్ద కొండశిలువలు నోళ్లు తెరుచుకుని కనిపించేవి. ఎలుగుబంట్లు, చిరుతపులులు, ఏనుగులు మున్నగు జంతువులుకూడ ఎదురైనాయి. తపోవనంలోని మంచు పీఠభూమిలో ఆ సంఘటనలు గుర్తువచ్చాయి. కానీ, ఆ పీఠభూమి మరింతగా వణకించే స్థలం. ఒకరిద్దరు సన్యాసులు అక్కడ కనిపించారు. వారు ఆ దారిగురించి కొన్ని కథలు వినిపించారు. వాటిని విన్న మనిషి మరింతగా భయకంపితుడు కావలసిందే.

శరీరాన్ని గగుర్పాటు చెందించే ఈ స్మృతులతో బయటకు వచ్చి శ్రీరామ్ అంతటా కానవస్తూన్న రంగురంగుల రాళ్లనూ, అడవి పువ్వులను పరిశీలించసాగారు. నలువైపులా విస్తరించి తళతళా మెరుస్తున్న తెల్లని మంచులో ఈ రంగు రాళ్లూ, పువ్వులూ ఇంద్రధనుస్సులా ప్రకృతి అందాలకు మెరుగులు దిద్దుతున్నాయి. అప్పుడు శ్రీరామ్‌కు అక్కడ అడుగడుగునా తగిలిన కందకాలూ, బావులూ గుర్తు వచ్చాయి. మృత్యు స్మరణలోనే జీవన ఆనందం ఇమిడిఉన్నదని ఈ అనుభూతులు రెండూ శ్రీరామ్‌కు బోధించాయి. మృత్యువు యొక్క భయానకత గుర్తుంటే మనం వర్తమానాన్నే సమగ్రంగా జీవిస్తాం; ఎదురుగా ఉన్న క్షణాన్ని పూర్తిగా సద్వినియోగపరుచుకుంటాం. అది సత్యంతోపాటు ఆనంద అనుభూతిని కలిగిస్తుంది. గడచిన మూడు నాలుగు రోజులలో ఎప్పుడూ ఉన్ని దుస్తులు ధరించే అవసరం కలుగలేదనే విషయంకూడ ఈ అనుభూతితో పాటు శ్రీరామ్‌కు గుర్తువచ్చింది.

చలి వేయలేదని గుర్తుకు రావడంతో మరో ఆలోచన మనసులోకి వచ్చింది. నోరు, కళ్లు, చెవులు, ముక్కు - వీటిని కప్పుకోము. వీటికి చలివేయదు. మరి, మిగతా శరీరానికి చలి ఎందుకు వేస్తున్నది? కొండలలో ప్రజలు ఉన్ని దుస్తులు లేకుండానే బ్రతకగలుగుతున్నారు. వారికి చలి వేయదు.

**తోటను నరికి బొగ్గులు అమ్మేవాడిలాకాక, దాన్ని కాపాడే పువ్వులు అమ్మేవాడిలా ఉండాలి రాజు**-పరాశర స్మృతి.

జోషీమఠంనుండి గోముఖానికి వస్తూన్నప్పుడు స్వామి నిర్మలానంద చెప్పిన ఈ మాటలు గుర్తువచ్చాయి – కొండమీద చలిగా ఉంటుంది. కానీ, కొండ లోపలి గుహలలో వెచ్చగా ఉంటుంది. అక్కడి కాయగూరలు కొన్నిటిని పచ్చివే తినగలుగుతాము. వాటివల్ల వేడి పుడుతుంది. భోజపత్రం కాడలోని కణుపులను ఉడికించి ఆ జావ త్రాగితే, చలి వేయదు. కడుపులో మోకాళ్లూ, తలా దూర్చి గొంతు కూర్చుంటే చలివేయదు. విషమ పరిస్థితులలో, అడవి జంతువులనూ ప్రకృతి ప్రమాదాలనూ ఎదుర్కొంటూ ఒంటరిగా జరిపిన ఈ యాత్ర, మారిన పరిస్థితులలో మరింతగా గగుర్పాటు కలిగించింది.

ఆ పీఠభూమిలో స్వామి తత్వబోధానంద అనే సన్యాసిని శ్రీరామ్ కలుసుకున్నారు. ఆ సన్యాసి ఒక చిన్న కుటీరం నిర్మించుకున్నారు. అయితే ఆయన అందులో ఉండడం అరుదు. ఆయన హెచ్చు సమయం మంచుతో కప్పబడి ఉన్న తపోవనంలోనే ఉంటారు. ఆరుబయట. శరీరంపై ఒక వస్త్రం చుట్టుకుంటారు. అప్పుడప్పుడు వచ్చే వ్యక్తులు ఆ కుటీరంలో బస చేస్తారు. ఎప్పుడో ఎవడో వస్తాడు. చలికి వణకిపోతూ ఉంటాడు. అలాంటివాడికి ఆ కుటీరంలో బస ఏర్పాటు చేస్తారు. అలాంటి యాత్రికులు ఒకటి రెండు రోజులు ఉండి వెళ్లిపోతారు. ఆ కుటీరానికి ఇదే ఉపయోగం. మిగతా సమయాలలో అది ఖాళీగానే ఉంటుంది. తపోవనం ప్రారంభమయ్యే చోట ఆశ్రమంకాని, ఆవాసంకాని, ఆలయంకాని, తీర్థంకాని లేదు.

## నందనవనంలో ప్రవేశం

తపోవనంనుండి కొంత ముందుకుపోతే నందనవనం ప్రారంభమవుతుంది. ఆ రోజుల్లో యాత్రికులలో హెచ్చుమంది ఇక్కడివరకు వచ్చేవారు కారు. మంచు, ఎక్కడో ఒకటి రెండు వనస్పతులు – ఇవి తప్ప ఎంత దూరం వెళ్లినా ఏమీ కనపడవు. యాత్రకూ, చూడడానికీ అక్కడ ఎలాంటి ఆకర్షణా లేదు. కనుక, యాత్రికులు తపోవనంనుండే తిరిగివెళతారు. 99శాతం యాత్రికుల యాత్ర గోముఖంవద్దనే ముగిసిపోతుంది. ఈ విధంగా నందనవనం పూర్తిగా నిర్జనమైంది. ఆకర్షణ లేనిది. ఇక్కడికి రమ్మని ఆదేశం రాకపోతే, శ్రీరామ్‌కూడ ఈవైపు వచ్చేవారు కారు.

పీఠభూమికి కొద్ది కిలోమీటర్లు ఆవల ఈ నందనవనం ఉంది. ఇక్కడి పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి. బాగా పలుచటి మంచు పొర నేలను కప్పి ఉంటుంది. మెల్లగా ఆచితూచి అడుగు వేయాలి. స్వామి తత్వబోధానంద ఇలా సలహా ఇచ్చారు – మంచుతో కప్పిన నేలమీద నెమ్మదిగా, జాగ్రత్తగా అడుగు వేయాలి. నేలమీద పువ్వులు పరచారని అనుకుని అడుగు వేయాలి. అడుగు మోపేముందే ఈ జాగ్రత్త తీసుకోవాలి. బెత్తాన్ని ఉపయోగించవచ్చు. అయితే కేవలం బెత్తంమీదనే ఆధారపడవద్దు. ఒక అడుగు సరిగా మోపకుండా మరో అడుగు వేయకూడదు. అక్కడక్కడ నీళ్ల గుంటలు ఉంటాయి. అక్కడకూడ ఇలా జాగ్రత్త పడాలి.

జోషీమఠం దాటిన తర్వాత ధాంధరియా సమీపంలో భూఇందర్ కొండచరియలో కూడ ఒక పూలలోయ ఉంది. దీనిని నందనకానన అని పిలుస్తారు. 'ఫూలోంకీ ఘాటీ' (పూలలోయ) అన్నది ప్రసిద్ధి పొందిన పేరు. త్రేతాయుగంలో లక్ష్మణుడు ఇక్కడే తపస్సు చేశాడు.

పూలలోయను పరశురాముడు నిర్మాణం చేశాడన్నది ప్రజల నమ్మకం. సీతా స్వయంవరం సమయంలో శ్రీరామచంద్ర భగవానుని ఆజ్ఞ అందడంతో – ఆయన ఇక్కడే నివసించాడు. బ్రాహ్మణ ధర్మాన్ని వదలి క్షత్రియ సంహారం చేసినందుకు ఆయన ఇక్కడ ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు. ఉద్ధతులైన క్షత్రియులను సంహరించడానికై ఆయన ఆయుధాన్ని ప్రయోగించాడు. అయితే అది బ్రాహ్మణత్వ నియమానికి ఉల్లంఘన అని ఆయన భావించాడు. ఈ పాపంనుండి విముక్తి ఎలా కలుగుతుందని ఆయన శ్రీరామచంద్రుణ్ణి అడిగాడు. హిమాలయ ప్రాంతాన్ని పూల చెట్లతో కప్పవలసిందని ఆయన

**శారీరక అనారోగ్యం ఔషధం వల్ల, మానసిక అనారోగ్యం పెద్దలకు సేవవల్ల తగ్గుతాయి.**

సలహా ఇచ్చాడు. విష్ణుమూర్తి అంశావతారం అయిన పరశురాముడు ఈ ప్రాంతంలోనే తపస్సు చేశాడు. పెక్కు రకాల పూలచెట్లను నాటాడు.

అయిదు కిలోమీటర్ల పొడవు, రెండు కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ క్షేత్రంలో నేటికీ 700 రకాల పూలచెట్లు ఉన్నాయి. ప్రపంచంలో మరెక్కడా ఇంతటి వైవిధ్యం కలిగిన పూలచెట్లు, వనస్పతులూ లేవు.

శ్రీరామ్ చేరిన నందనవనం ఈ పూలలోయ కన్న భిన్నమైనది. అక్కడికి ఎవరికీ సులభంగా ప్రవేశం దొరకదు. ఎన్ని కష్టాలు పడినా, ఎంత సాహసం చేసినా అక్కడికి వెళ్లలేము. స్వామి తత్వబోధానంద చెప్పిన జాగ్రత్తలన్నింటినీ శ్రీరామ్ అక్షరాలా పాటించారు. అయినా కొన్ని చోట్ల ఇబ్బందులు వచ్చాయి. అడుగు స్థిరంగా పడినప్పటికీ, లోతుకు దిగబడిపోతూన్నట్లు అనిపించింది. అయితే మరుక్షణంలో ఎవరో చేయి పుచ్చుకుని లేవదీస్తున్నట్లు అనిపించింది.

## మరోమారు సాక్షాత్కారం

ఇలా జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ ఆయన 2 – 2 1/2 కిలోమీటర్లు ముందుకు వెళ్లి ఉంటారు. అక్కడ ఒక కొండ దిబ్బ కనబడింది. ఆ దిబ్బమీద మంచు కప్పును చీల్చుకుని కొన్ని వనస్పతులు వెలిశాయి. వాటిని చూస్తే శ్రీరామ్‌కు ఆశ్చర్యం కలిగింది. మంచు వాతావరణంలో పైరుపచ్చ ఎలా మొలిచింది. అయితే అది ప్రకృతి చేసిన అద్భుతం అని ఆయన తనను తాను సమాధానపరచుకున్నారు. అంతా సహజమే కావచ్చు. స్వాభావికమే కావచ్చు. ప్రకృతి – నియమం అర్థం కాదు కనుక మనకు అద్భుతం అనిపించవచ్చు. ఆయన ఆ వనస్పతులవైపు దృష్టి సారిస్తూ ఉండగా – ఒక చల్లని వాయు వీచిక వచ్చింది. ఆ గాలి తరగలో ఏదో తీయ తీయని సుగంధం నిండిఉంది. ఆ సువాసనను గుర్తుపట్టడానికి ఆయన ప్రయత్నించారు. ఆవల్‌ఖేడాలో వసంత పంచమి రోజున పూజ గదిలో తనకు అనుభవం అయిన సువాసనయే అది.

ఆ సువాసనను గుర్తుపట్టగానే, ఆయన దృష్టి ఆ వనస్పతులనుండి మళ్లింది. ఆ సుగంధం వస్తూన్న వైపు చూచారు. కొద్ది అడుగుల దూరంలో తనకు పరిచితమైన ఆ ఆకారంలో, దిగంబర స్థితిలో గురుదేవులు నిలబడి ఉన్నారు. ఆయనను చూడగానే ఆనందం అవధులు దాటింది. ముఖమండలం పులకితం అయింది. ఆయనకు ప్రణామం చేయడానికై వంగారు. దిగంబర యోగి చేయి ఆశీర్వచన ముద్రలో పైకి లేచింది. మంచులా తెల్లని గడ్డం. మీసాల వెనుక దాగిన చిరునవ్వు వెలికివచ్చింది. ఆ కళ్లలో వెలుగు. ఆ వెలుగు తళతళలలో శ్రీరామ్‌కు అభివాదనం. ఆయన నోటితో ఏదీ మాట్లాడలేదు. దారిలో వచ్చిన ఇబ్బందుల గురించికూడ అడుగలేదు. కుశల ప్రశ్నలు వేయలేదు. తన వెనుక రమ్మని సైగ చేశారు. బయలుదేరారు.

శ్రీరామ్ తమ మార్గదర్శక సత్తాను అనుసరిస్తూ ముందడుగు వేయసాగారు. జాగ్రత్తగా నడవాలనే ఆలోచన ఆయన మనస్సులో ఇప్పుడు లేదు. ఆయన నిశ్చింతగా తమ మార్గదర్శక సత్తా వెనుక నడుస్తున్నారు. శ్రీరామ్ ఏ కొండదిబ్బ చూచి ఆశ్చర్యపడ్డారో ఆ కొండదిబ్బవైపు గురుదేవులు నడుస్తున్నారు. అయితే ఆయన ఆ గుట్ట ఎక్కలేదు. మంచు అడుగున ఉన్న ఒక గుహలో ప్రవేశించారు. గురుదేవుల వెనుక గుహలోకి వెళూతూ ఉండగా ఆలోచన వచ్చింది – పైన కప్పబడిఉన్న మంచు విచ్చుకుని పడితే ఏమవుతుందని, అదే సజీవ సమాధి అవుతుందని. ఆ క్షణంలోనే తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చింది. ఆయన అలా నవ్వుతూ ఉండగా గురుదేవులు ఇలా అన్నారు –

సజీవ సమాధి కావడంలో కూడ ప్రయోజనం ఉంది. నీవుకూడ సూక్ష్మదేహధారివి అయిపోతావు. సిద్ధులు నివసించే ఈ కాననంలో నివసిస్తావు.

H H H

**కృషివల్ల దుర్భిక్షం, జపం వల్ల పాతకం, మౌనం వల్ల కలహం, జాగరూకత వల్ల భయం నశిస్తాయి.**

## నావారితో నామాట : మహోద్యమం విరాట్ యాత్ర -10

# ఇతర సంస్థలతో సమన్విత కృషి

సమాజంలో అనేక సంస్థలు ప్రభుత్వేతర స్థాయిలో సేవాభావనతో వివిధ పథకాలను అమలుచేస్తున్నాయి. ప్రభుత్వం చేయలేని పనులను ఈ సంస్థలు చేస్తున్నాయి. జల సంరక్షణ నుండి పచ్చదనం పెంపుదల, స్వావలంబన నుండి నిరాశ్రయులైన బాలల శిక్షణ, అక్షరాస్యతా విస్తరణ నుండి గ్రామీణ అభివృద్ధి పథకాల వరకు - ఇవన్నీ ప్రభుత్వం చేయగలిగే సమాజసేవలు కావు. ఈ సంస్థల స్వచ్ఛందసేవకులలో ఉండే నిబద్ధత, ప్రబల కార్యనిష్ఠ ప్రభుత్వ స్థాయిలో కనబడవు.

సేవ ఒకవిధమైన సాధన. ఇందుకు సమర్పణ భావన అవసరం అవుతుంది. వనవాసీ సేవాకార్యం, ఏకల విద్యాలయం, గోసంరక్షణ ఉద్యమం, గోధనంయొక్క శక్తినుండి వివిధ ప్రత్యామ్నాయ వనరుల నిర్మాణం, సామూహిక శ్రమదానం, రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య ఉద్యమం, ఆపదలలో చిక్కుకున్నవారికి సహాయంవంటి పనులలో స్వచ్ఛంద సంస్థలు సమర్పణ భావంతో పని చేస్తున్నాయి.

ప్రభుత్వంనుండి ఆర్థిక సహాయం పొంది బ్రతుకుతూన్న ఎన్.జిఓలు, ప్రభుత్వేతర సంస్థల గురించి ఇక్కడ ప్రస్తావించడం లేదు. ఇవి సేవ ముసుగులో శాపాలుగా తయారైనాయి. స్వచ్ఛంద సంస్థలకు చెడ్డపేరు తెస్తున్నాయి. ప్రజల సహకారంతో పనిచేస్తూన్న స్వచ్ఛంద సంస్థల గురించి మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాము.

గాయత్రీ పరివార్ యొక్క వివిధ శాఖలు సమాజ నిర్మాణం కోసమే కాక వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణముల కోసం కూడ పనిచేస్తున్నాయి. అవి వివిధ సంస్థల సహకారాన్ని తీసుకుంటున్నాయి. అద్భుత విజయాలు సాధిస్తున్నాయి. గ్రామీణ పారిశుద్ధ్యం, సామూహిక శ్రమదానం, బాధితులకు సహాయం, వైద్యసేవ, స్వచ్ఛంద పొదుపు సంఘాల ద్వారా స్వయంపోషకత్వం, భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష, పర్యావరణ వాహిని ద్వారా మొక్కలు నాటడం, మాదక ద్రవ్యాల వ్యతిరేకత వంటి కార్యాలలో మన శాఖలు ఇతర సంస్థలతో కలసి పనిచేస్తున్నాయి.

పేరు ప్రతిష్టలకోసం ప్రాకులాడడం రాజకీయాలలో జరగవచ్చు. అయితే - సమాజ సేవా కార్యం మౌలికంగా ఆధ్యాత్మిక కార్యం. స్వాధ్యాయంపట్ల ఆసక్తిని పెంచడం, యోగ వ్యాయామ శిబిరాలు, వనమూలికల సహకార సేద్యం, వైదిక సేంద్రియ వ్యవసాయం - ఇలాంటివన్నీ ఈ పనులలోనికి వస్తాయి. సామూహిక సాధనా ఉద్యమం కూడ అందరి ఉజ్వల భవిష్యత్తు కోసమే జరుగుతోంది. వివిధ ధార్మిక సంస్థల సహకారంతోనే ఇది సాధ్యపడుతుంది.

పరమేశ్వరుడు ఒక్కడే అయినప్పుడు - విభేదాలు ఎందుకు? వివిధ సంప్రదాయాలుగా విడిపోవడంవల్ల మన సామర్థ్యం, మన ప్రార్థన సామర్థ్యం తరిగిపోతాయి. మంచి పనికోసం, విశ్వశాంతి కోసం మనం కలసి పనిచేయాలి. ఇంతకు మించిన దేవత్వ అభివృద్ధి కార్యం మరేముంటుంది?

భారత్ వికాస్ పరిషత్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, రామకృష్ణ మిషన్, వివేకానంద కేంద్రం, వనవాసీ సేవా విభాగం, సేవాభారతి, విద్యా భారతి, కిసాన్ సంఘ్, వేదాంత మిషన్, చిన్మయ మిషన్ మున్నగు సంస్థలన్నీ సేవా కార్యాలలో నిమగ్నమై ఉన్నాయి. గాయత్రీ పరివార్ పరిజనులు దేశ విదేశాలలో అవసరం అయినప్పుడల్లా ఇతర సంస్థలలో కలసి పనిచేస్తున్నారు. సహకారంతో, సమన్వయంతో పనిచేస్తున్నారు. ముందు ముందు ఈ సహకార కృషిని విస్తృతం చేస్తాం. ఇలాంటి సంస్థలు మరి అనేకం ఉండవచ్చు. సమాన లక్ష్యాలతో పనిచేసే సంస్థలు మరెన్నో ఉన్నాయి. వాటి సహాకరంకూడ పొందవచ్చు.

### వంద దేశాలలో మిషన్ శాఖలు

పరమపూజ్య గురుదేవులు 1972-73లో టాంజానియా - కెన్యాలలో పర్యటించి, ప్రవాస భారతీయులతో పరస్పర సంపర్కం

**తాను రూపం లేనివాడినని తెలుసుకోనంతవరకు మనిషి రూపరహితంగా దేవుణ్ణి పూజించలేడు - ~¡=° } =°,¬ìiÂ**

పెంచుకునే ప్రక్రియను ప్రారంభించారు. పూజ్యవరులు 1958లో మథురలో జరిపిన సహస్రకుండీయ యజ్ఞంలో ప్రవాస భారతీయ సోదర సోదరీమణులు పాల్గొన్నారు. 1945-46 నుండి పెక్కు ప్రవాస భారతీయ కుటుంబాలు పూజ్యవరులతో పరిచయం పెంచుకున్నాయి. పూర్వ జన్మలనుండి పూజ్యవరులతో, స్నేహ సలిల మాతాజీతో అనుబంధం కలిగినవారు ఎందరో ఉన్నారు. ఫిజీ, మారిషస్, దక్షిణాఫ్రికా, డచ్ - బ్రిటిష్ గయానాలలో 150 సంవత్సరాలనుండి ప్రవాస భారతీయులు ఉన్నారు. విద్యావంతులు, వ్యాపారస్థులు విదేశాలలో స్థిరపడడం 1950 తర్వాత పెరిగింది. అమెరికా, కెనడా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్, ఆఫ్రికా దేశాలలో, దక్షిణ అమెరికాలోని బ్రెజిల్, పెరూ మున్నగు దేశాలలో వీరు క్రమంగా స్థిరపడ్డారు. గత 50 సంవత్సరాలలో భారతీయులు సుమారు 150 దేశాలలో వ్యాపించారు. ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలలో వారు ప్రముఖ పాత్ర వహించారు. భగవద్ భక్తి వారి నరనరాలలో నిండి ఉంది.

గాయత్రీ పరివార్ 1979-1984 సంవత్సరాలలో అన్ని దేశాలలో వేగంగా పెరగసాగింది. తిరిగి - 1991లో ప్రారంభమై ఇప్పుడు 2005వరకు 40 దేశాలలో తన వ్రేళ్లను బలపరుచుకున్నది. శాంతికుంజ్ నుండి శిక్షణ పొందిన బృందాలు 5-6 నెలలపాటు ఆ దేశాలలో తరచు పర్యటిస్తున్నాయి. ఆ దేశాలలో యువ చేతనను మేలుకొలుపుతున్నాయి. శిక్షణ గరపుతున్నాయి, ప్రజలను గాయత్రీ చేతనతో నింపుతున్నాయి. వివిధ సంస్థలతో, ఆలయాలతో కలసి పనిచేస్తున్నాయి. లెస్టర్ (బ్రిటన్), టోరంటో (కెనడా), లాస్ ఏంజెల్స్ (అమెరికా), షికాగో (అమెరికా), మాంట్రెయిల్ (కెనడా), న్యూజర్సీ (అమెరికా)లలో జరిగిన అశ్వమేధ, వాజపేయ యజ్ఞాలద్వారా మిషన్ ప్రజలలో బాగా వ్యాప్తిచెందింది. షికాగోలో 1994లో, కేప్‌టౌన్‌లో 1999లో జరిగిన "వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్"లో పాల్గొనడంవల్ల గాయత్రీ పరివార్ ప్రభావం బాగా విస్తరించింది. ఇప్పుడు వివిధ స్థలాలలో గాయత్రీ చేతన కేంద్రాల నిర్మాణం జరుగుతోంది. బహుళార్థ సాధకములైన ఈ కేంద్రాల ద్వారా భారతీయ సంస్కృతి విశ్వమంతటా విస్తరిస్తుంది.

ఈ సంవత్సరం అక్టోబరు 1,2,3లలో సిడ్నీలో అశ్వమేధ యజ్ఞం జరిగింది. ఫలితంగా - దక్షిణార్ధ గోళంలో గాయత్రీ చేతన విస్తరిస్తోంది.

H H H

## పతి వదలివెళ్ళిన పనికి అర్పించుకొన్న తలాశ్‌కుమారి

1857 తిరుగుబాటులో ఏ తేజస్వీ మహిళలు అధికంగా పాల్గొన్నారో వారిని చరిత్రకారులు ఎన్నటికీ మరచిపోరు. రోదించుటకు, పిల్లల్ని కనుటకు, పూజా పురస్కారాలకు, పతితోపాటు సతియగుటకు మాత్రమే స్త్రీలు తయారుచెయ్యబడ్డారనే కొంతమంది భ్రమలను పటాపంచలు చేస్తూ, సముచిత శిక్షణ లేకుండానే ఆ దేవీ స్వరూపులు విదేశీ శాసనాన్ని పెళ్లగించి వేయుటకు శక్తికి మించిన పరాక్రమం ప్రదర్శించారు. భారత నారీరత్నములలో రాణీ లక్ష్మీబాయి, దుర్గాపతి, చాంద్‌బీబీ, చెన్నమ్మ, గుడలూ వంటి రణభేరి మ్రోగించిన దేవతలలో అమోఘా రాజ్యం రాణి తలాశ్‌కుమారి ఒకరు. ఆమె పతి ఈ తిరుగుబాటులో ఆంగ్లేయుల ద్వారా చంపబడ్డాడు. ఆ తరువాత రాణి బాధ్యతను స్వీకరించి కొద్దిపాటి సాధనాలతోనే ఎంత దీర్ఘకాలం పోరాడిందంటే ఆంగ్లేయులు రంగం నుండి తమ సేనను తొలగించవలసి వచ్చింది. ఫిరంగితో నిండిన ఒక ఓడను రాణి నష్టపరచింది. తనతో యుద్ధం చేయుటకు వచ్చే సైన్యాన్ని వెనుతిరిగిపోవటానికి కూడా వీలు లేకుండా బుద్ధి చెప్పింది. ఇరుగుపొరుగు సామంతులకు కూడా తెలివివచ్చేటట్లు చేసింది. భర్త వదలి వెళ్లిన పనిలో తన సర్వస్వం సమర్పించగలిగిన నిజమైన పతివ్రతలు ఇటువంటి పరాక్రమం ప్రదర్శిస్తారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**నీ దృక్పథంనుండే కాక ఎదుటివాడి దృక్పథం నుండి కూడ ఆలోచించగలగడం విజయానికి కీలకం.**

## విశ్వవిద్యాలయ విశేషాలు

# యోగ చికిత్సకు విలక్షణ కేంద్రం

దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో మొదటినుండీ యోగ విజ్ఞానంలో శిక్షణ ప్రారంభమయింది. యోగ చికిత్స ప్రారంభం కాలేదు. ఇందుకు కారణం ఉంది. మొదట యోగ విజ్ఞాన విభాగంలోని ఆచార్యులు తమ విషయంలోని రహస్యాలను క్షుణంగా తెలుసుకోవాలి; వారు పరిశోధనలో తగు అనుభవం పొందాలి. గత మూడు సంవత్సరాలలో ఆ పని పూర్తయింది. ఇందుకుతోడు - యోగ్యులైన శిష్యుల బృందాలు రెండు తయారయినాయి. గత మూడు సంవత్సరాలలో యోగ చికిత్సపై పెక్కు పరిశోధన పథకాలు పూర్తయినాయి. ఆ చికిత్సలో క్రొత్త పద్ధతులు కనుగొనబడ్డాయి. మౌలికమైన ఫలితాలు అనేకం లభించాయి.

ఈ సాఫల్యాలవల్ల యోగ విజ్ఞాన విభాగపు పరిశోధన దృక్పథం, వివేక దృష్టి అద్భుతంగా వికాసం పొందాయి. ప్రస్తుతం ఈ విభాగంలో 30మందికిపైగా పిహెచ్.డి చేస్తున్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో పరిశోధన పత్రాలు సమర్పించేవారి సంఖ్య 30కి పైగా ఉంది. ఫలితంగా - ఈ విభాగం ప్రపంచంలోని ఇలాంటి విభాగాలకన్న మరింత సమర్థవంతం అయింది. ఈ సామర్థ్యం బుద్ధిపరమూ, పరిశోధనా విషయికమూ మాత్రమే కాదు. యోగ చికిత్స సాధకుల దృష్టిలోకూడ ఈ విభాగం సమర్థం అయింది. సాఫల్యాలు, నాణ్యత, యోగ్యత, మౌలిక ఫలితాలు కారణంగా ఈ విభాగం సెంటర్ అఫ్ ఎక్స్‌లెన్స్' (అద్భుత ప్రతిభకు కేంద్రం)గా రూపొందింది.

తన సామర్థ్యం, ఆత్మవిశ్వాసం ఆధారాలుగా ఈ విభాగం నూతన సంవత్సరం నుండి "మానవ చేతన, యోగ చికిత్స" అనే విషయంపై పి.జి.డిప్లొమో కోర్సు ప్రారంభించింది. ఈ పాఠక్రమంలో యోగచికిత్సలోని వివిధ అంగాలలో శిక్షణ ఇస్తున్నారు. ఆచార్యులు, విద్యార్థులు కలసి, ఆసనాలు, ప్రాణాయామం, బంధాలు, ముద్రలపై చికిత్సకు సంబంధించిన ప్రయోగాలు చేస్తున్నారు. సాఫల్యాలు సాధిస్తున్నారు. ఈ క్రమంలో - ఆహార చికిత్స, ప్రకృతి వైద్యం, ఎక్యుప్రెషర్, ప్రాణ చికిత్సలలోకూడ ప్రయోగాలు చేసి సాఫల్యాలు సాధిస్తున్నారు ఈ సాఫల్యాల ప్రయోజనాన్ని మన పరిజనులూ, సామాన్య ప్రజలు పొందాలనే ఆలోచన వచ్చింది, కనుక - విభాగం ఒక స్వతంత్ర యోగ చికిత్సా కేంద్రాన్ని స్థాపించింది. ఈ విభాగంలోని ఆచార్యులూ, విద్యార్థినీ విద్యార్థులూ ప్రతిరోజూ వచ్చే రోగులకు నియమబద్ధంగా చికిత్స చేస్తున్నారు.

ఈ కేంద్రం ఇతర యోగ చికిత్సా కేంద్రాలకు పూర్తిగా విభిన్నం అయినది. ఇక్కడ ఒకప్రక్క శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన ఆచార్యులు ఉన్నారు. పరిశోధన చేస్తున్న విద్యార్థులు ఉన్నారు. మరో ప్రక్క అత్యాధునిక ఉపకరణాలతో కూడిన బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్‌వారి పరిశోధనాలయం ఉంది. అక్కడ శరీరానికీ, మనస్సుకూ సంబంధించిన వివిధ వైజ్ఞానిక పరీక్షలు జరుపుతారు. అంతే కాదు. అల్లోపతీ, ఆయుర్వేదములలో నిపుణులు ఈ కేంద్రంతో అనుసంధానం చేయబడి ఉన్నారు. రోగులను పరీక్ష చేయడంలో ఎలాంటి లోపమూ రాకుండా ఉండడానికే ఈ ఏర్పాటు జరిగింది. అవసరమైతే ఎమర్జెన్సీ విధానాలు అనుసరించడానికి కూడ ఈ ఏర్పాటు ఉపకరిస్తుంది.

ఈ కేంద్రంలో రోగికి చికిత్స చేసేముందు పరిపూర్ణమైన వైజ్ఞానిక ప్రక్రియలలో రోగనిదానం చేస్తారు. లక్షణాలు ఆధారంగా మాత్రమే చికిత్స చేయాలనే భ్రమ ఇక్కడ లేదు. రోగనిదానం తర్వాతనే అవసరాన్నిబట్టి యోగి చికిత్స, ప్రకృతి వైద్యం చేస్తారు. ఈ క్రమంలో అవసరం అయినప్పుడు ఆయుర్వేద ఔషధాలు వాడతారు. రోగికి సంపూర్ణమూ, ప్రాకృతిక-నైసర్గికమూ అయిన యోగ చికిత్స జరగాలన్నదే ఈ కేంద్రం సిద్ధాంతం. 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' అనే సూత్రం ఆధారంగా ఇక్కడ వైద్య సేవ అందిస్తారు.

అయితే - ప్రస్తుతం ఈ చికిత్సలో ఒక్క కొరత ఉన్నది. ఇప్పుడు 'ఔట్ పేషంట్' విభాగం మాత్రమే ఉన్నది. రోగులు బస చేయడానికి ఇక్కడకాని, శాంతికుంజ్‌లో కాని ఏర్పాటు లేదు. బస ఏర్పాటు రోగులు స్వయంగా చేసుకోవలసి ఉంటుంది. చుట్టుప్రక్కల ఉన్న ధర్మశాలలలో (సత్రాలలో) ఆ ఏర్పాటు సులభంగా జరుగుతుంది. కనుక, దూర ప్రదేశానుండి వచ్చేవారు సంకోచించవలసిన పనిలేదు.

విశ్వవిద్యాలయం ఇస్తున్న ఈ యోగ చికిత్స అన్నివిధాలా అద్భుతమైనది, అపూర్వమైనది. జటిలమైన జీర్ణ రోగాల చికిత్స కోసం మన పరిజనులు ఈ కేంద్రం సేవలను ఉపయోగించుకోవచ్చు. ఇందుకు ఇతరులను ప్రోత్సాహించి పుణ్యం సంపాదించవచ్చు.

H H H

**మనసు తలుపులు తెరిపించదం విద్యాబోధన ప్రయోజనం Ð ~¡gÕã^Î<Œ^Š£ \ìQ®¶~Ÿ.**

# వార్తలు

## చీరాలలో 24 లక్షల గాయత్రీ మంత్రజపం

చీరాలలో అన్ని ఆధ్యాత్మిక సంస్థల మహిళా సంఘాల సభ్యులు 24లక్షల గాయత్రీ మహామంత్ర జపం జరిపారు. ఆ కార్యక్రమం పూర్ణాహుతిగా ఆగస్టు 30న స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం మహావైభవంగా జరిగింది. 300మంది మహిళలు పాల్గొన్నారు. జప అనుష్ఠానానికి శ్రీ ఎస్.ఎస్.ప్రసాద్ అభినందనీయమైన అవిరళ కృషి జరిపారు. శ్రీయుతులు డి.వి.ఆర్. మూర్తి, డి. బాపయ్య యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు కె.జనార్దన్, బి.మల్లికార్జునరావు, శ్రీమతులు రమాదేవి, బి.కృష్ణకుమారి సహకరించారు.

లక్ష్మీసమాజం, శ్రీ వెంకట సీతారామాంజనేయ షణ్ముఖ మహిళా సమాజం, అన్నపూర్ణాదేవి భజన సమాజం, శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ మహిలా సమాజం, గాయత్రీ భజన సమాజం, శ్రీరామమందిర భజన సమాజం, సావిత్రి మహిళామండలి, వేదమాత గాయత్రి మహిళా మండలి జప అనుష్ఠానంలో పాల్గొన్నాయి.

### జ్ఞానపరీక్ష సెమినార్

చీరాలలో ఆగస్టు 28న భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షలో భాగంగా సెమినార్ జరిగింది. వివిధ విద్యా సంస్థల నుండి 25మంది ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీడి.వి.ఆర్.మూర్తి సెమినార్‌కు అధ్యక్షత వహించారు. శ్రీయుతులు ఎస్.ఎస్.ప్రసాద్, డి.బాపయ్య ప్రసంగించారు.

### నారాకోడూరు శక్తిపీఠంలో శాంతికుంజ్ ప్రతినిధులచే శిక్షణ

నారాకోడూరులోని గాయత్రీ శక్తిపీఠంలో ఆగస్టు 2నుండి 9వరకు శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీయుతులు నవరతన్, కేశవ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో యోగ, కర్మకాండ, డఫ్లి, సంగీతం, గోసంబంధిత ఔషధాల తయారీ, కీటకనాశిని తయారీ, నెడెప్ కంపోస్టు ఎరువు తయారీ నేర్పబడ్డాయి. పలువురు రైతులు ఆ కార్యక్రమంలో పాల్గొని, ఆయా వస్తువుల తయారీ విధానాన్ని నేర్చుకున్నారు.

### పొన్నూరులో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం

పొన్నూరులో రజక కళ్యాణమండపం నూతన భవన ప్రవేశం సందర్భంగా పంచకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. శ్రీ ఉల్లగుంట వెంకటేశ్వర్లు ఆధ్వర్యం వహించారు.

పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో కె.బి.పాలెంలో నాగేంద్రస్వామి గుడి ప్రాకార నిర్మాణం సందర్భంగా గాయత్రీ యజ్ఞం జరిగింది.

పొన్నూరులో శ్రీవంకదారి సీతారామయ్య గృహంలో 450 దీపాలతో దీపయజ్ఞం జరిగింది.

చింతలపూడివారి గృహంలో శ్రీమతులు దుర్గ, లక్ష్మి ఏకకుండీ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు.

శ్రీ కొండవీటి సాంబయ్య గృహంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది.

పై కార్యక్రమాలు శ్రీ సింగ్ పర్యవేక్షణలో జరిగాయి.

**మంత్రజప అనుష్ఠానంలో అభినందనీయమైన కృషి**

మధురైలో జరగనున్న అశ్వమేధ యజ్ఞానికి సన్నాహక చర్యగా సాగుతూన్న సామూహిక గాయత్రీ మంత్రజప అనుష్ఠానంలో భాగంగా తిరుపతిలోని శ్రీబి.వెంకటేశు 756 మాలల జపం చేశారు.

### పెదమేరంగిలో మాతాజీ వర్ధంతి

మాతా భగవతీదేవి వర్ధంతి సందర్భంగా పెదమేరంగిలోని తాళ్లదుమ్మ గాయత్రీ ప్రజ్ఞాపీఠంలో సెప్టెంబర్ 21న సామూహిక జపసాధన, ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగాయి. 100మంది పాల్గొన్నారు. అన్నశాంతి జరిగింది. సూర్య మేడం ముఖ్య అతిథిగా విచ్చేశారు. శ్రీయుతులు డి.చిన్నంనాయుడు, పి.లక్ష్మణ రావు, ఇ.హరినారాయణ, ఎస్.శంకరరావు, డి.శ్రీరామమూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పెదమేరంగి గాయత్రీ ప్రజ్ఞామండలి ఆధ్వర్యంలో తాళ్లదుమ్మ గాయత్రీ ప్రజ్ఞామండలిలో గురుపూర్ణిమ సందర్భంగా జూలై 20న అఖండ జపం, 21న ఏకకుండీ గాయత్రీయజ్ఞం జరిగాయి. కురుపాం, జోగులదుమ్మ, పెదమేరంగి పరిసర గ్రామాలనుండి 100 మంది పాల్గొన్నారు. అన్నశాంతి జరిగింది.

### బెండికొండలో గాయత్రీ యజ్ఞం

కవిటి అగ్రహారం బెండికొండలో ఆగస్టు 18న శ్రీఆర్.దిలీప్‌కుమార్, మందస యొక్క జన్మదిన సంస్కారం, ఏకకుండీ గాయత్రీ యజ్ఞం, అన్నదానం శ్రీ జి.సూర్యనారాయణ జరిపారు. శ్రీయుతులు బంగారు బారికి, సనపల అమ్మినాయుడు ఆధ్వర్యం వహించారు.

H H H

**నిన్ను నీవు పూర్తిగా మరచిపోయి పనిచేస్తే నీ విజయం నిశ్చయం – ª•Þq° ~Œ=°f~¡Ö.**